అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 9-1-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 322 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50



వారంతా తిరిగి జైలుకు వెళ్లాల్సిందే...

ఆ పదకొండు మందినీ విడుదల చేసే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదు

- బిల్కిస్ బానో కేసులో దోషుల విడుదలను రద్దుచేసిన సుప్రీంకోర్టు
- గుజరాత్ ప్రభుత్వం చట్ట విరుద్ధంగా వ్యవహరించిందని వ్యాఖ్య

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

2002లో గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానోపై లైంగికదాడి చేసి, ఆమె కుటుంబ సభ్యులను హతమార్చిన కేసులో 11 మంది దోషులను ముందస్తుగా విడుదలచేస్తూ గుజరాత్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఆ 11 మంది రెండు వారాల్లోగా జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. దోషుల ముందస్తు విడుదలపై ఉత్తర్వులు జారీ చేసే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదని ధర్మాసనం పేర్కొంది. కేసు విచారణ మహారాష్ట్రలో జరిగింది కాబట్టి... అటువంటి విడుదల ఉత్తర్వులు జారీచేసే అర్హత అక్కడి ప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని స్పష్టం చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని 'దోచుకున్నందుకు' గుజరాత్

...3లో

తీర్పు హర్షణీయం : ఐద్వా

వివరాలు 3లో

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో



న్యూఢిల్లీ : బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషుల శిక్షా కాలాన్ని తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న చట్టవిరుద్ధమైన నిర్ణయాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో స్వాగతించింది. 2002 గుజరాత్ మారణహోమం సమయంలో గర్భవతి అయిన బిల్కిస్ బానోపైన, ఆమె కుటుంబ సభ్యులపైన సామూహిక లైంగికదాడికి పాల్పడడం, 14మందిని మూకుమ్మడిగా చంపేసిన

...3లో

న్యాయానికి దక్కిన విజయం : రాహుల్ గాంధీ



బీజేపీ ప్రభుత్వ దురహంకారానికి వ్యతిరేకంగా బిల్కిస్ బానో అవిశ్రాంతంగా జరిపిన పోరాటానికి దక్కిన విజయమిది. ఎన్నికల ప్రయోజనాల కోసం న్యాయాన్ని చంపేసే ధోరణి ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరం. ఈ రోజు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో నేరస్తులను పెంచి పోషిస్తోంది ఎవరనే విషయం దేశానికి చాటి చెప్పినట్టయిందని రాహుల్‌గాంధీ తెలిపారు.

రాజస్థాన్‌లో బీజేపీకి ఎదురు దెబ్బ

- ఉపఎన్నికలో ఓటమి పాలైన మంత్రి
- కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో పరాభవం





జైపూర్ : రాజస్థాన్‌లో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించి, అధికారాన్ని కైవసం చేసుకున్న బీజేపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. కరణ్‌పూర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో ప్రతిపక్ష కాంగ్రెస్ అభ్యర్థి రూపేందర్ సింగ్ కూనర్ తన సమీప బీజేపీ ప్రత్యర్థి, రాష్ట్ర మంత్రి సురేందర్‌పాల్ సింగ్‌ను 11,283 ఓట్ల మెజారిటీతో ఓడించారు. కూనర్‌కు 94,950 ఓట్లు లభించగా సురేందర్‌పాల్‌కు 83,667 ఓట్లు వచ్చాయి. ఉప ఎన్నికలో

...11లో

6 గ్యారంటీల అమలుకు..

డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షులుగా మంత్రివర్గ ఉపసంఘం

- సభ్యులుగా పొంగులేటి, శ్రీధర్ బాబు
- లబ్ధిదారుల ఎంపికపై విధివిధానాలు ఖరారు
- మొత్తం కోటి 25 లక్షల దరఖాస్తులు
- క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత లబ్ధిదారుల ఎంపిక
- ప్రజాపాలనపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- నిర్ణయ వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి



సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం సమీక్షా సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేసేందుకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనపై హైదరాబాద్‌లోని సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకిచ్చిన హామీలను వేగంగా అమలు చేయాలని నిర్ణయించారు. అనంతరం సమావేశ వివరాలను సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. తనతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఉపసంఘంలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. ప్రజా పాలనలో ఒక కోటి 25లక్షల ధరఖాస్తులు వచ్చాయనీ, అందులో ఆరు గ్యారెంటీలకు సంబంధించి కోటి 5 లక్షలు, రేషన్ కార్డులు, భూములు తదితర అంశాలకు సంబంధించి 20లక్షలు వచ్చాయన్నారు. ఈ నెల 25 నుంచి 30 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎక్కించి, ఆధార్, రేషన్ కార్డు ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులతో లింక్ చేయనున్నట్టు పొంగులేటి వివరించారు. డేటా ఎంట్రీ అనంతరం సబ్ కమిటీ, కేబినెట్‌లో చర్చించి విధివిధానాలు రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలో 85లక్షల రేషన్ కార్డులుంటే ఒక కోటి 5లక్షల దరఖాస్తులు వచ్చాయనీ, క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులను ప్రకటిస్తామని తెలిపారు. 40 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎక్కడా చెప్పలేదనీ, డిసెంబర్ 9న అధికారం చేపట్టినప్పుడు ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లో అమలు చేస్తామని తెలిపారు. ఈ అంశంపై ప్రతి పక్షాలు తప్పుడు ప్రచారాలను మానుకోవాలనీ, లేదంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. నెల రోజులు కాకముందే అధికారం లాక్కోవాలని బీఆర్ఎస్ ఉవ్విళ్లూరుతోందని ఎద్దేవా చేశారు. వంద రోజుల వరకు ఓపిక పట్టాలని ఆయన హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ

...3లో

పార్టీ పనితీరులో మార్పులు చేయాల్సిందే..

నిజామాబాద్ ఎంపీ స్థానంలో మేమే ముందంజలో ఉన్నాం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



అసెంబ్లీ ఎన్నికల ఫలితాల దృష్ట్యా రాబోయే లోక్‌సభ ఎలక్షన్లకు సంబంధించి పార్టీ పనితీరులో కచ్చితంగా మార్పులు చేర్పులు చేయాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంగీకరించారు. వాటిని కార్యకర్తల ఆకాంక్షలకు అనుగుణంగా కచ్చితంగా మార్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిజామాబాద్ పార్లమెంటు స్థానంపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీకి హాజరైన నాయకులు, కార్యకర్తలనుద్దేశించి కేటీఆర్ ప్రసంగించారు. ఎన్నికల్లో గెలుపోటములు బీఆర్ఎస్‌కు కొత్త కావని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు గట్టిగా కృషి చేయాలని కోరారు. తద్వారా అత్యధిక ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మొన్నటి ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే నిజామాబాద్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్, బీజేపీకన్నా బీఆర్ఎస్ ముందుజలో ఉందని తెలిపారు. ఈసారి అక్కడ త్రిముఖ పోరు జరగనుందని

...11లో

పనికిరాని ప్రొటోకాల్‌తో ఇబ్బంది పెట్టారు..

ఎవరికి వారే యమునా తీరే...

- తాజా మాజీ ఎమ్మెల్యేలపై ఎమ్మెల్సీ కవిత ఫైర్
- అధిష్టానాన్ని..కార్యకర్తలు కలవకుండా అడ్డుకున్నారంటూ ఆగ్రహం
- నిజామాబాద్ నేతలు ఆత్మ పరిశీలన చేసుకోవాలంటూ హితవు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ అయిన నన్నే పనికిరాని ప్రొటోకాల్‌తో ఇబ్బంది పెట్టారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రుల మధ్య సమన్వయమే లేదు. ఒకరికి తెలియకుండా ఇంకొకరు తమ తమ కోటరీల వారీగా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఈ రకంగా ఎవరికి వారే యమునా తీరే అనే విధంగా వ్యవహరించి,

...3లో



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత హేమలత

కార్పొరేట్ మతతత్వ విధానాలను ఎండగట్టాలి

- ప్రజల సమస్యలను, హక్కులను ఎలుగెత్తి చాటాలి
- ఈ నెల పది నుంచి 20వరకు రాష్ట్ర వ్యాప్త ప్రచారం
- 19న కార్మిక కర్షక ఐక్యతా సదస్సులు
- 26న జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహనాల ర్యాలీలు : కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

' దేశాన్ని కాపాడుకునేందుకు కేంద్రంలో మతతత్వ, కార్పొరేట్ అనుకూల బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలి. కార్పొరేట్లకు వేల కోట్లు దోచిపెడుతున్న మోడీ సర్కారు సామాన్యుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్నద'ని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ,రైతు, వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ దేశవ్యాప్తంగా పోరాటాలకు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ అధ్యక్షతన సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం జరిగింది. రాష్ట్రంలో జనవరి 10 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాల ద్వారా మోడీ ప్రజావ్యతిరేక విధానాలపై విస్తృతంగా ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. 19న జిల్లా కేంద్రాల్లో కార్మిక- కర్షక ఐక్యతా సదస్సులు నిర్వహించాలని తీర్మానించింది. 26న జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహనాల ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా

...11లో



బస్సుల్లో ఒరిజినల్ కార్డులే చూపాలి

- పాన్‌కార్డ్, ఫోన్లు, జిరాక్స్ కాపీలు చెల్లవు
- ఒరిజినల్ లేకుంటే టిక్కెట్ తీసుకోవాల్సిందే
- 'జీరో టిక్కెట్' లేకుంటే రూ.500 జరిమానా : మహిళలకు టీఎస్‌ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ స్పష్టీకరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'మహాలక్ష్మి' స్కీం ద్వారా బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే మహిళలు తప్పనిసరిగా చిరునామా, తాజా ఫోటోతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఒరిజినల్ గుర్తింపు కార్డులే చూపించాలని టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. పలుమార్లు ప్రయాణీకులకు ఈ విషయం చెప్తున్నా, బస్సుల్లో డ్రైవర్, కండక్టర్లతో వాగ్వివాదాలకు దిగుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మహిళా ప్రయాణీకులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పాన్ కార్డులో

...11లో

ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి రైతుల ఆందోళన

వ్యాపారులకు కొమ్ముకాస్తున్న అధికారులు

- మార్కెట్ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం ఉదయం మిర్చి రైతులు ఆందోళనకు దిగారు. ధరలు అమాంతం తగ్గించి వేశారని, గిట్టుబాటు ధర కూడా రావడం లేదని మార్కెట్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం ఉదయం ఎప్పటిలాగే జెండా పాట నిర్వహించారు. ఈ పాటలో

...11లో



మార్కెట్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న మిర్చి రైతులు...

మూడు పూలు...ఆరు కాయలు

భారత్‌లో దినదినాభివృద్ధి చెందిన ట్రంప్ వ్యాపారాలు

- ఆయన వ్యాపార ప్రాజెక్టులు భారత్‌లోనే అత్యధికం
- మోడీతో సన్నిహిత సంబంధాలే కారణం : డెమొక్రటిక్ సభ్యుల కమిటీ వెల్లడి



వాషింగ్టన్ : డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మన దేశంలో ఆయన వ్యాపారాలు మూడు పూలు...ఆరు కాయలుగా దినదినాభివృద్ధి చెందుతూ వర్ధిల్లాయి. ప్రధాని మోడీతో ఆయనకున్న సన్నిహిత సంబంధాలే దీనికి కారణం. వ్యాపారాల ద్వారా ఆయన భారత్ సహా ఇరవై దేశాల నుండి కనీసం 7.8 మిలియన్ డాలర్లు ఆర్జించారని చెబుతూ అమెరికా హౌస్ ఓవర్‌సైట్ కమిటీలోని డెమొక్రటిక్ సభ్యులు ఓ నివేదికను విడుదల చేశారు. అమెరికా ప్రతినిధుల సభకు చెందిన ఈ కమిటీ అత్యంత శక్తివంతమైనది. ప్రభుత్వ విభాగాలలో జవాబుదారీతనాన్ని ఈ కమిటీ పరిశీలిస్తుంది.

న్యూయార్క్‌లోని ట్రంప్ వరల్డ్ టవర్‌లో, అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని ట్రంప్ ఇంటర్నేషనల్ హోటల్‌లో 2017-2020 మధ్యకాలంలో భారత్ 2,82,764 డాలర్లు ఖర్చు చేసిందని ఆ నివేదిక తెలిపింది. ట్రంప్ వ్యాపారాలలో చైనా, సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, మలేసియా, కువైట్, ఫిలిప్పీన్స్ దేశాలు కూడా ఖర్చు చేశాయని నివేదిక వెల్లడించింది. ట్రంప్‌కు గతంలో అకౌంటింగ్ సంస్థగా వ్యవహరించిన మజార్స్, అమెరికా సెక్యూరిటీలు-ఎక్స్ఛేంజ్ కమిషన్ నుండి సేకరించిన పత్రాల ఆధారంగా ఈ వివరాలు బయటపడ్డాయి. 'అమ్మకానికి శ్వేతసౌధం : అధ్యక్షుడు ట్రంప్‌కు రాకుమారులు, ప్రధానులు, దేశాధినేతలు ఎలా ప్రయోజనం చేకూర్చారు' అనే శీర్షికతో ఈ నివేదికను రూపొందించారు.

అమెరికా వెలుపల ట్రంప్ యాజమాన్యంలో నడిచిన వ్యాపార ప్రాజెక్టులలో అత్యధికం మన దేశంలోనే ఉన్నాయి. భారత్‌లో ట్రంప్‌కు ఉన్న వ్యాపార సంస్థలను, ఆయన అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అమెరికా విదేశాంగ విధానానికి ఆయన ఇచ్చిన సూచనలను గమనిస్తే వాటికి

...11లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,050	▼	220
22 క్యారెట్లు	57,800	▼	200
కిలో వెండి	77,800	▼	200



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	70
రిటైల్ (లైవ్)	రూ.	92
స్కిన్‌తో	రూ.	133
స్కిన్‌లెస్	రూ.	152

ఆధార్ అప్డేట్ కోసం జనాల అవస్థలు

ఉదయం 4 గంటల నుండే క్యూలో పడిగాపులు

- చలిలో అక్కడే నిద్రిస్తూ.. టోకెన్ తీసుకుంటున్న పరిస్థితి
- వికారాబాద్ జిల్లా తాండూరు పోస్టాఫీస్ వద్ద బారులు తీరిన జనం
- ఆధార్ సెంటర్లు పెంచాలని డిమాండ్



నవతెలంగాణ-తాండూరు

ప్రభుత్వ పథకాలకు ఆధార్ తప్పనిసరి కావడంతో అప్డేట్ కోసం ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అందులో తాండూరులో ఒకే సెంటర్ ఉండటంతో అప్డేట్ కోసం జనాలు ఉదయం 4 గంటల నుంచి చలిలో పోస్టాఫీస్ వద్ద బారులు తీరుతున్నారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో సోమవారం చోటు చేసుకున్నది. ప్రభుత్వం పలు పథకాల కోసం రేషన్ కార్డులకు ఈకేవైసీ చేయమని చెబుతోంది. దాంతో ప్రజలు ఆధార్ కార్డు సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. తాండూర్ పట్టణ కేంద్రంలో పోస్టాఫీస్ వద్ద నిత్యం ఆధార్ అప్డేట్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా రోజుకు సుమారు 30 నుంచి 40 మంది వరకే ఉండేవారు. అయితే ప్రజా పాలన దరఖాస్తులతో పాటు బ్యాంకు తదితర వాటి కోసం ప్రతిదానికి ఆధార్ అవసరం ఉండటంతో ప్రజలు ఉదయం నాలుగు గంటలకు వరుసలో నిలబడాల్సి వస్తోంది. తాండూర్ నియోజకవర్గంగా ఆధార్ సెంటర్లు సరిగ్గా లేకపోవడంతో ఈ పోస్టాఫీస్ వద్ద సోమవారం ఉదయం 4 గంటలకే చలిలో భారీ ఎత్తున జనాలు ఎగబడ్డారు. లోపలికి చొచ్చుకుపోయే ప్రయత్నం చేశారు. దాంతో జనాలపై ఆధార్ నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వారిని తరిమికొట్టే ప్రయత్నం చేశారు. ప్రజలు పెద్ద మొత్తంలో రావడంతో టోకెన్లు ఇచ్చారు. నాలుగు, ఐదు రోజుల డేట్లు వేసి ఇచ్చే టోకెన్ల కోసం కూడా ప్రజలు ఎగబడ్డారు. వృద్ధులు, చిన్నారులు సైతం ఇబ్బంది పడాల్సి వస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఇదిలా ఉంటే క్యూలో నిల్చున్నా ఆధార్ అప్‌డేట్ అవుతుందనే నమ్మకం లేకుండా పోయిం దని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాల సంఖ్యను పెంచాలని కోరుతున్నారు.

జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి శ్రీకారం

- సీఎం రేవంత్ సొంత జిల్లా మహబూబ్‌నగర్‌తో ముందడుగు
- కొత్త పెవిలియన్, డ్రెస్సింగ్ రూమ్స్, కార్యాలయం ప్రారంభం:హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు

హైదరాబాద్: తెలంగాణలో గ్రామీణ క్రికెట్ అభివద్ధికి సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్ నుంచే శ్రీకారం చుట్టామని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావు అన్నారు. రేవంత్ రెడ్డి మాజీ ఫుట్‌బాల్ ప్లేయర్ కావడంతో, క్రీడలపై సీఎంకు ఉన్న ఆసక్తిని గమనించి మహబూబ్‌నగర్ నుంచి జిల్లాల క్రికెట్ అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. సోమవారం జగన్‌మోహన్ రావు సహచర హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే వై.శ్రీనివాస్ రెడ్డితో కలిసి మహబూబ్‌నగర్‌లో హెచ్‌సీఏ నిధులతో నిర్మించిన స్టేడియంలో, సుమారు రూ.25 లక్షలతో పూర్తి చేసిన పలు అభివద్ధి పనులను ప్రారంభించారు.

ఈ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ కార్యాలయం, పెవిలియన్, డ్రెస్సింగ్ రూమ్‌లను లాంఛనంగా ప్రారంభించి, అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ హైదరాబాద్ స్థాయిలో జిల్లాల హెడ్ క్వార్టర్స్‌లోనూ స్టేడియాల నిర్మాణం, హెచ్‌సీఏ అకాడమీలను నెలకొల్పుతామన్నారు. ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులను వెలికి తీసి, వారికి రాష్ట్ర జట్టు తరపున ఆడేందుకు అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈనెల 25 నుంచి జరగనున్న భారత్-ఇంగ్లండ్ టెస్టు మ్యాచ్ పూర్తయిన తర్వాత జిల్లాల్లో క్రికెట్ అభివద్ధిపై మరింత ఫోకస్ పెడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జగన్‌మోహన్‌రావుతో పాటు హెచ్‌సీఏ కార్యదర్శి దేవ్‌రాజ్, ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, కోశాధికారి శ్రీనివాస్, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్, మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

గంజాయి సరఫరా ముఠా అరెస్ట్

336 కేజీల గంజాయి, డీసీఎం, మూడు సెల్ ఫోన్స్ స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎస్పీ చందనా దీప్తి



నవతెలంగాణ-నల్లగొండ టౌన్

గంజాయి రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. వారి నుంచి 336 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి డీసీఎంలో గంజాయిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో నాగార్జునసాగర్ విజయపూరి పోలీసు స్టేషన్ ఎస్ఐ సంపత్ సిబ్బందితో కలిసి ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద సోమవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు. కూరగాయల ట్రేలతో వచ్చిన డీసీఎంను తనిఖీ చేసే క్రమంలో వాహనం నుంచి నలుగురు వ్యక్తులు దిగి పారిపోతుండగా పట్టుకున్నారు. డీసీఎంలో ఉన్న 168 పాకెట్లలో సుమారు 336 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డీసీఎంను, మూడు సెల్‌ఫోన్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా, వారు మహారాష్ట్రకు చెందిన జ్ఞానోబా అమోల్ ఘోరే, గణపతి బసవరాజ్ సోనాల్, సంగమేశ్వర సదా శివ జంగనే, ఖయ్యూమ్ ఇషాకేగా చెప్పారు. జ్ఞానోబా అమోల్ ఘోరే డ్రైవర్‌గా పని చేసే సమయంలో నిజామాబాద్ జిల్లాకి చెందిన జయపాల్ పరిచయమయ్యాడు. జయపాల్ గంజాయి సరఫరా చేస్తుంటాడు. అదే క్రమంలో విజయనగరంలో గంజాయి తీసుకొని మహారాష్ట్రకు తీసుకెళ్లి అక్కడ తాను చెప్పిన వ్యక్తికి సరఫరా చేస్తే లక్ష రూపాయలు ఇస్తా అనిజ్ఞానోబా అమోల్ ఘోరేకి చెప్పాడు. అందుకు అంగీకరించిన జ్ఞానోబాతో పాటు ముగ్గురువెళ్లారు. అక్కడ నుంచి గంజాయ్ తీసుకుని వరంగల్ మీదుగా వెళ్తే పట్టుబడతామని గుంటూరు-మాచర్ల మీదుగా వస్తూ సాగర్ పోలీసులకు పట్టుబడ్డారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక దృష్టి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ చందనాదీప్తి చెప్పారు. ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి విక్రయాల గురించిగానీ, సేవించే వ్యక్తుల గురించి, సరఫరా చేసేవారి గురించి తెలిస్తే డయల్ 100 ద్వారా సమాచారం అందజేయాలని సూచించారు.

అమ్మకానికి కన్న పిల్లలు !

- డబ్బుల కోసం దారుణానికి సిద్ధమైన తండ్రి



నవతెలంగాణ - జడ్చర్ల

డబ్బుల కోసం కన్న తండ్రి ముగ్గురు పిల్లలను అంగట్లో అమ్మకానికి పెట్టాడు.. విషయం తెలిసి అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడం తో పిల్లలను రక్షించారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం తాడిపర్తి గ్రామంలో వెలుగుజూసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రఫీయొద్దీన్‌కు జడ్చర్ల పట్టణానికి చెందిన హబీబాతో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. కాగా రఫీ కుటుంబంతో జడ్చర్ల పట్టణంలోని గౌరీశంకర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య ఆస్తుల గొడవలు జరుగుతున్నాయి. కాగా ఆదివారం ఉదయం ముగ్గురు పిల్లలను తీసుకొని ఇంట్లో చెప్పకుండా హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. అక్కడ రూ.9 లక్షలకు పిల్లలను అమ్మకానికి పెట్టాడని, తనకు అత్తవారి ఇంటి నుంచి రావలసిన సొమ్ము ఆస్తి పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు చెప్పారు. భార్య హబీబా పోలీసులను ఆశ్రయించగా.. వారు రంగం లోకి దిగి రఫీ ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతను హైదరాబాద్ లో ఉన్నట్టు గుర్తించారు. పిల్లల ను రక్షించి తల్లికి అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తు న్నారు. రఫీ మాత్రం.. పిల్లలకు బట్టలు, చెప్పులు ఇప్పించేందుకు తీసుకెళ్లినట్టు చెబుతున్నాడు.

నల్లగొండ మున్సిపల్ చైర్మెన్ పీఠం కాంగ్రెస్ కైవసం

చైర్మెన్‌పై నెగ్గిన అవిశ్వాస తీర్మానం

- మున్సిపాల్టీలో కోమటిరెడ్డి మార్క్



నవతెలంగాణ- నల్లగొండటౌన్

నల్లగొండ మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డిరెడ్డిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. మొత్తం 48 మంది కౌన్సిలర్లు ఉండగా, 47 మంది ఓటింగ్‌కు కార్యక్రమానికి హాజరయ్యారు. అనుకూలంగా 41 మంది, వ్యతిరేకంగా ఐదుగురు ఓటు వేశారు. అవిశ్వాసం నెగ్గడంతో చైర్మెన్ సైదిరెడ్డి పదవిని కోల్పోయారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ గైర్హాజరు కాగా, స్వతంత్ర కౌన్సిలర్ పిల్లి రామరాజు తటస్థంగా ఉన్నారు. దీంతో నల్లగొండ మున్సిపాలిటీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోసారి మార్కు సాధించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ మందిరంలో ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. నల్లగొండ మున్సిపాల్టీలో మొత్తం 48 వార్డులు ఉన్నాయి. నాలుగు సంవత్సరాల కిందట జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి 20 మంది కౌన్సిలర్లు, కాంగ్రెస్ 20 మంది కౌన్సిలర్లు, బీజేపీ నుంచి ఆరుగురు, ఎంఐఎం నుంచి ఒకరు గెలుపొందారు. రెండు సంవత్సరాల కిందట అనారోగ్యంతో 26వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మృతిచెందారు. దీంతో ఆ వార్డు ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. మరో వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ బీఆర్ఎస్‌లో చేరడంతో ఆ పార్టీ బలం 22కి చేరింది. అప్పటి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఓటుతో చైర్మెన్ పీఠం బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు మున్సిపల్ వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో 9 మంది కౌన్సిలర్లు కోమటిరెడ్డి వెంకట రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వెంకటరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందగానే మరో ఆరుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఈ క్రమం లో కాంగ్రెస్ కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఇటీవల కలెక్టర్‌ను కోరారు. దాంతో సోమవారం అవిశ్వాస తీర్మానం పై ఓటింగ్ జరిగింది. ఈ సమయంలో కాంగ్రెస్‌కు ఆరుగురు బీజేపీ కౌన్సిలర్లతోపాటు బీఆర్ఎస్ కౌన్సిలర్ కూడా మద్దతు ప్రకటించారు. అవిశ్వాసం లో కాంగ్రెస్ నెగ్గడంతో మందడి సైదిరెడ్డి మున్సిపల్ చైర్మెన్ పదవి కోల్పోయారు. దీంతో కాంగ్రెస్ కౌన్సి లర్లలో ఒకరిని చైర్మెన్‌గా ఎన్నుకునే అవకాశం ఉంది.

బిజినెస్

ఫ్లిప్‌కార్ట్‌లో 7శాతం ఉద్యోగులపై వేటు..!



న్యూఢిల్లీ : ప్రముఖ ఈ-కామర్స్ వేదిక ఫ్లిప్‌కార్ట్ భారీగా ఉద్యోగులను తొలగించనుంది. పొదుపు చర్యల్లో భాగంగా వందలాది మందిని ఇంటికి పంపించడానికి కసరత్తు చేస్తుందని రిపోర్టులు వస్తున్నాయి. సిబ్బంది పనితీరు ఆధారంగా ఐదు శాతం నుంచి ఏడు శాతం ఉద్యోగులను తొలగించే యోచనలో ఉంది. ఏడాది కాలంగా కొత్త నియామకాలను నిలిపివేసింది. గత రెండేళ్లుగా వార్షిక పనితీరు ఆధారంగా ఉద్యోగులను తొలగిస్తూ వస్తుంది. వచ్చే మార్చి- ఏప్రిల్ నాటికి తొలగింపుల ప్రక్రియను పూర్తి చేసే పనిలో ఉంది. మింత్రా మినహా ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్‌లో 22 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇందులో నుంచి 1100-1500 మందిని ఇంటికి పంపించే ప్రక్రియను ప్రారంభించిందని సమాచారం. ఇప్పటికే స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ ద్వారా నిధులు సమకూర్చుకోవాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే పొదుపు చర్యలకు దిగుతోందని నిపుణులు భావిస్తున్నారు.

హ్యుందాయ్ రూ.6వేల కోట్ల పెట్టుబడులు



చెన్నరు : ప్రముఖ వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా భారీ పెట్టుబడులను ప్రకటించింది. తమిళనాడులో కొత్త ప్రాజెక్ట్‌ల కోసం మరో రూ.6,180 కోట్ల పెట్టుబడుల ప్రణాళికలను వెల్లడించింది. ఇందుకోసం తమిళనాడు 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ 2024' కార్యక్రమంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్టు వెల్లడించింది. ఈ మొత్తం గతంలో ప్రకటించిన పెట్టుబడులకు అదనమని వెల్లడించింది. వచ్చే పదేళ్లలో తమిళనాడులో రూ.20 వేల కోట్లతో విద్యుత్తు వాహనాల తయారీ, ఇవి ఛార్జింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయడంతోపాటు నైపుణ్య శిక్షణ కోసం పెట్టుబడులు పెట్టనున్నట్టు గతంలో ప్రకటించింది.

సెన్సెక్స్ 670 పాయింట్లు ఫట్

ముంబయి : అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల ప్రభావంతో భారత మార్కెట్లు భారీ నష్టాలు చవి చూశాయి. సోమవారం బీఎస్ఈ సెన్సెక్స్ 670 పాయింట్లు పతనమై 71,355కు పడిపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 198 పాయింట్ల నష్టంతో 21,513 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలకు తోడు ఈ వారంలో వెలువడనున్న టెక్ కంపెనీల త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. సెన్సెక్స్-30లో అదాని పోర్ట్స్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఒఎన్‌జిసి, హీరో మోటార్స్, పవర్ గ్రిడ్ సూచీలుగా అధికంగా లాభపడగా.. యుపిఎల్, ఎస్‌బిఐ, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, దివిస్ ల్యాబ్స్ సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

కేపీహెచ్‌బీలో కారు బీభత్సం

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- మద్యం మత్తులో బైకును ఢీకొట్టిన వ్యక్తి
- నిందితుడు మాజీ మంత్రి బంధువుగా అనుమానం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదరాబాద్ కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. ఓ వ్యక్తి తప్పతాగి కారులో రాంగ్ రూట్‌లో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కూకట్‌పల్లి ఏసీపీ శివ భాస్కర్ సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అగ్రజ్ రెడ్డి కార్తిక్, తేజతో కలిసి అర్ధరాత్రి 1:30 సమయంలో గచ్చిబౌలి నుంచి వారి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కేపీహెచ్‌బీ ఫోరంమాల్ చౌరస్తా వద్ద వారు రాంగ్ రూట్‌లో వేగంగా వెళ్తూ ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. దాంతో బైక్‌పై ఉన్న బన్సరీలాల్, గురుచంద్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారు నడుపుతున్న అగ్రజ్ రెడ్డికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా మద్యం తాగినట్టు నిర్ధారణయింది. అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కేసు దర్యాప్తు చేస్తున్నారు. అగ్రజ్‌రెడ్డి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బంధువు అని తెలుస్తోంది. విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ వెంకన్న, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఉన్నారు.

గ్రానైట్ క్వారీలతో కాలరాత్రులు

కొండలు, కొలనులు, జీవనోపాధికి ప్రమాదం

తమిళనాడులో మధురై ప్రజల ఇబ్బందులు



చెన్నై: తమిళనాడులోని మధురై లో గ్రానైట్ క్వారీలో అక్కడి ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. క్వారీల యజమానులు లాభార్జనే ధ్యేయంగా పని చేయటం, నియమ నిబంధనలను గాలికొదిలేయటం, అధికారుల పర్యవేక్షణ లోపించటం వంటి కారణాలు అక్కడి ప్రజలను ఆందోళనల్లోకి నెట్టివేస్తున్నాయి. "కొలనులు, బోరుబావులు ఎక్కువగా కలుషితం కావటంతో చాలా మంది గ్రామస్తులు కిడ్నీ వ్యాధితో బాధపడు తున్నారు. గ్రానైట్ క్వారీలు మూత పడిన తర్వాత క్రమంగా మరణాలు తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ, వ్యవసాయం ఇప్పటికీ దాదాపు అసాధ్యం. దీంతో చాలా మంది ఆ గ్రామాన్ని విడిచిపెట్టవలసి వచ్చింది" అని గ్రామస్తులు కొందరు తెలిపారు.

ఒక దశాబ్దం క్రితం కిడ్నీ వ్యాధితో పి.దురైరాజ్ మరణించారు. దీనికి కారణం ఇక్కడి గ్రానైట్ క్వారీ తవ్వకాలే. అతని భార్య ఇందిర (40) గ్రానైట్ క్వారీలపై ఆందోళన వ్యక్తం చేశారు. " జీవనోపాధి, ప్రియమైన వ్యక్తి యొక్క నష్టాల బాధ ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తున్నది. అతని మరణం తర్వాత నేను నా మేన కోడలు పుష్పవల్లితో కలిసి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఒట్ట కోవిల్ పట్టి వద్ద నివసించటానికి పాఠశాల కు వెళ్ళే తన ఇద్దరు కుమారులతో సరుగువలయపట్టిలోని తన వివాహ గృహాన్ని విడిచిపెట్టింది" అని తెలి పారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యం లోనే మధురైలోని యాజమాన్య ఇటీవల గ్రానైట్‌ల నిర్వహన కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. మేలూర్ తాలూకాలోని సెక్కిపట్టి, అయ్యపట్టి, తిరుచునై రెవెన్యూ గ్రామాలలోని నాలుగు ప్రాంతాల నుంచి బహుళ వర్ణ గ్రానైట్‌లను 20 సంవత్సరాల లీజుకు తీసుకోవటానికి టెండర్ దరఖాస్తులను ఆహ్వానిస్తూ మధురై కలెక్టర్ ఎం.ఎస్ సంగీత గతేడాది అక్టోబర్ 3న నోటిఫికేషన్ జారీ చేయటం గమనార్హం. ఇక్కడ జరిగినే మైనింగ్ కార్యకలాపాల కారణంగా ఇక్కడి ప్రజలపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు చూపాయనీ, ఇందిర వంటి బాధితులు ఇక్కడ వందల సంఖ్యలో ఉన్నారని స్థానికు లు తెలిపారు.

వీటి కారణంగా తాము అనేక కాలరాత్రులను గడుపు తున్నామనీ, ప్రకృతి వనరులతో పాటు తమ జీవనోపాధికీ ఇబ్బంది కలుగుతున్నదని ఇక్కడి ప్రజలు అంటున్నారు. కాబట్టి ఈ విషయాల ను దృష్టిలో ఉంచుకొని ఇక్కడి అధి కార యంత్రాంగా గ్రానైట్ క్వారీలను, వాటి తవ్వకాలను నియంత్రించాలని వారు కోరుతున్నారు.

కర్నాటక కాంగ్రెస్ నేత నివాసాలపై ఈడీ దాడులు

బెంగళూరు : మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా కర్నాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కె.వై నంజేగౌడ (61), ఆయనకు సంబంధించిన కొన్ని సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు చేసింది. ఈయన కోలార్ జిల్లాలోని మలూరు అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద దర్యాప్తులో భాగంగా కేంద్ర ఏజెన్సీ అధికారులు మలూరు, కోలార్‌లోని ఎమ్మెల్యే ప్రాంగణాన్ని, అతని అనుబంధ సంస్థలను సోదా చేశారు. అతను అధ్యక్షుడిగా ఉన్న కోలార్-చిక్కబళ్లాపూర్ జిల్లా కోఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్ (కోముల్)లో సిబ్బంది నియామకంలో జరిగిన అవకతవకలకు సంబంధించి కొన్ని స్థానిక పోలీసు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ యొక్క ఈడీ కేసు నమోదైంది. కోలార్‌లోని పాల సహకార సంఘం కార్యాలయం, ప్లాంట్‌లో కూడా సోదాలు జరుగుతున్నాయని సమాచారం.

పనికిరాని ప్రొటోకాల్‌తో ఇబ్బంది పెట్టారు..

(మొదటిపేజీ తరువాయి)

పార్టీకి తీవ్ర నష్టం కలిగించారు...' అంటూ నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని తాజా మాజీ ఎమ్మెల్యేలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిజామాబాద్ పార్లమెంటు స్థానంపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ అధిష్టానాన్ని... కార్యకర్తలు కలవకుండా కొందరు నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను స్వయంగా కార్యకర్తలను కలిసేందుకు జిల్లాకు వెళితే అడ్డంకులు సృష్టించారని వాపోయారు. తెలంగాణ ఉద్యమానికి అండగా నిలబడ్డ జిల్లాలో బీఆర్ఎస్ ఓడిపోవడానికి గల కారణాలపై ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆమె హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యేలు వారి వారి సొంత కార్యకర్తలకే ప్రభుత్వ పథకాల పథకాలు అందేలా చూశారనీ, దీంతో పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో నష్టం జరిగిందంటూ వాపోయారు. దళిత బంధు పథకాన్ని గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అమలు చేస్తే... ఎస్సీలందరికీ న్యాయం జరిగేదని స్పష్టం చేశారు. అలా చేసి ఉంటే వారందరూ ఎన్నికల్లో గులాబీ జెండాకు అండగా నిలిచేవారని తెలిపారు. కానీ ఆ పథకాన్ని కొందరికే ఇవ్వడంతో అసంతృప్తితో ఉన్న వారు పార్టీకి వ్యతిరేకమై, తీవ్ర నష్టం చేకూర్చారని పేర్కొన్నారు. అందువల్ల మాజీ ఎమ్మెల్యేలు ఇకనైనా తమ వ్యవహార శైలిని మార్చుకోవాలని హితవు పలికారు. వారు మారకపోతే అధిష్టానం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నేతలు సమిష్టిగా పని చేయాలని కవిత సూచించారు.

నేడు 'ఖమ్మం'పై సమీక్ష

పార్లమెంటు నియోజకవర్గాల సన్నాహక సమావేశాల్లో భాగంగా మంగళవారం ఖమ్మం ఎంపీ స్థానంపై సమీక్ష నిర్వహించనున్నారు. ఈ భేటీకి బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతోపాటు అక్కడి తాజా మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రస్తుత ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తదితరులు హాజరుకానున్నారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

కేసులో యావజ్జీవ శిక్ష పడిన 11మంది దోషులకు గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదిస్తూ, శిక్షాకాలాన్ని తగ్గించి ముందస్తుగానే విడుదలజేసింది. వారిని రెండు వారాల్లోగా జైలుకు వెళ్లి లొంగిపోవాలని సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో ఆదేశించింది.

శిక్ష తగ్గింపు ఆదేశాలను జారీ చేసే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదని సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేయడమే కాకుండా, దోషులతో ప్రభుత్వం కుమ్మక్కైన విషయాన్ని ఎత్తి చూపింది. శిక్ష తగ్గింపు ఆదేశాలను సమర్థించుకోవడానికి వాస్తవాలను అందజేయడంలో గుజరాత్ ప్రభుత్వం మోసానికి పాల్పడిందని ధర్మాసనం పేర్కొంది. నేరస్థులు మోసంచేసి శిక్షను తప్పించుకున్నట్టయితే, సమాజంలో శాంతి, భద్రతలు మిథ్యగా మారిపోతాయని సుప్రీం కోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదం ప్రాతిపదికనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు గుజరాత్ ప్రభుత్వం చెప్పిన విషయాన్ని పరిగణనలోకి తీసుకున్నట్టైతే.. ఈ పాపంలో కేంద్ర ప్రభుత్వానికి కూడా సమ వాటా వున్నట్లేనని సుప్రీంకోర్టు పేర్కొంది. నేరాల క్రూరత్వాన్ని, సమాజంపై వాటి విస్తృత



పర్యవసానాలను, చట్టబద్ధ పాలనను వేటినీ పరిగణనలోకి తీసుకోకుండా శిక్షను మార్చారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ప్రభుత్వాలనేవి రాజ్యాంగబద్ధమైన సంస్థలు. ప్రభుత్వాలు తమ అధికార పరిధులను, చట్టాన్ని, న్యాయ వ్యవస్థను ఉల్లంఘించేలా వ్యవహరించినట్టైతే, అది మన ప్రజాస్వామ్య ఉనికినే ప్రమాదంలో పడేస్తుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

ఈ తీర్పు న్యాయ వ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించింది : బృందా కరత్



బిల్కిస్ బానో కేసులో గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయడాన్ని ప్రతిపక్షాలు స్వాగతించాయి. ఈ తీర్పు న్యాయ వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని నిలిపాయని సీపీఐ(ఎం) నేత బృందాకరత్ పేర్కొన్నారు.

ఐద్వా హర్షం

తీర్పు పట్ల ఐద్వా హర్షం వ్యక్తం చేసింది. జైలు శిక్ష పూర్తి కాకుండానే 14 ఏళ్లకే దోషులను గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడాన్ని ఐద్వా ఆనాడే వ్యతిరేకించిందని పేర్కొంది. దోషి రాధేశ్యామ్ భౌతిక ఆధారాలను తొక్కిపట్టి సుప్రీం కోర్టును మోసగించారని, తద్వారా 2022 మేలో సానుకూలమైన ఆదేశాలు పొందారని, అవి, 11మంది దోషులను విడుదల చేయడానికి దారి తీశాయని కోర్టు పేర్కొంది.

వారంతా తిరిగి జైలుకు వెళ్లాల్సిందే...

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుపట్టింది. 'గుజరాత్ ప్రభుత్వం చట్టానికి విరుద్ధంగా పనిచేసింది' అని తీర్పులో స్పష్టంచేసింది. 'చట్టబద్ధ పాలనను అమలు చేయాల్సిన చోట కరుణ, సానుభూతిలకు చోటుండదు. దానిని పరిరక్షించడం కోర్టు ముఖ్య బాధ్యత' అని తీర్పు ఇచ్చింది. 'దోషుల మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చారు. అలాంటి పరిస్థితిలో 14 సంవత్సరాలు శిక్ష అనుభవించిన తరువాత వారిని ఎలా విడుదల చేశారు? మరి ఇతర ఖైదీల విషయంలో ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకోలేదు?' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసులో 11 మంది నిందితులకు సీబీఐ ప్రత్యేక కోర్టు 2008 జనవరి 21 వ తేదీన జీవిత ఖైదు విధించింది. అయితే 2022 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ దోషులకు రెమిషన్ మంజూరు చేస్తూ గుజరాత్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, సామాజిక సంఘాలు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నేరస్తులను హీరోలుగా చూడడం, వారిని సాదరంగా స్వాగతించడం వంటివి జనాల్లో తీవ్ర అసంతృప్తికి కారణమయ్యాయి. దోషుల విడుదల గురించి తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని బిల్కిస్ బానో పేర్కొన్నారు. దోషుల విడుదలను సవాల్ చేస్తూ.. తనకు న్యాయం చేయాలని ఆమె సుప్రీంకోర్టు ఆశ్రయించారు. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో బిల్కిస్ బానోతోపాటు, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ, టీఎంసీ నేత మహువా మొయిత్రా, జర్నలిస్ట్ రేవతి లాల్, లక్నో యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ రూప్ రేఖా వర్మలు పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్లను విచారించిన జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్‌లో తీర్పును రిజర్వ్ చేసింది. సోమవారం తీర్పునిచ్చింది.

తీర్పు హర్షణీయం : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

బిల్ కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమైందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు సోమవారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. బిల్‌కిస్ బానో కేసులో సుప్రీం కోర్టు సంచలన తీర్పు ఇచ్చిందని తెలిపారు. కేసులోని దోషులకు క్షమాభిక్ష మంజూరు చేస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసిందని పేర్కొన్నారు. గ్యాంగ్ రేప్, మర్డర్ కేసులో దోషులుగా ఉన్న 11 మందిని ముందుగానే జైలు నుంచి విడుదల చేయటాన్ని బిల్ కిస్ బానో సుప్రీంకోర్టులో సవాలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా వారి క్షమాభిక్షను రద్దు చేస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపట్ల మహిళాలోకం హర్షం వ్యక్తం చేస్తున్నదని తెలిపారు.

వీఆర్ఏల పెండింగ్ వేతనాలను చెల్లించాలి

- వారసులకు ఉద్యోగాలివ్వాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి జూలకంటి లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ)కు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారసులకు ఉద్యోగాలివ్వాలనీ, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి సోమవారం ఆయన లేఖ రాశారు. కొత్త రెవెన్యూ చట్టం ప్రకారం వీఆర్ఏలందరికీ పేస్కేల్ ఇస్తామనీ, వారసులకు ఉద్యోగాలిస్తామనీ, అర్హులైన వారికి పదోన్నతులు కల్పిస్తామంటూ గత ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. 80 రోజుల సమ్మె సందర్భంగా సీసీఎల్ఏ, రెవెన్యూ ఉద్యోగుల సమక్షంలో వీఆర్ఏ జేఏసీతో చర్చలు జరిపి 81, 85 జీవోలను విడుదల చేసిందని తెలిపారు. వీఆర్ఏల్లో డిగ్రీ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఇంటర్ చదివిన వారికి రికార్డు అసిస్టెంట్లుగా, పదో తరగతిలోపు చదివిన వారికి ఆఫీసు సబార్డినేట్లుగా రెవెన్యూ శాఖతోపాటు మున్సిపల్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, విద్యావైద్య తదితర శాఖల్లో ఉన్న ఖాళీల్లో సర్దుబాటు చేశారని వివరించారు. ఇంకా కొంత మంది మిగిలిపోయారని తెలిపారు. గతేడాది ఆగస్టు నుంచి వారు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కానీ వారికి ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. వారసులకు ఉద్యోగాలిస్తామన్న హామీపై ఇప్పటికీ మార్గదర్శకాలు ఇవ్వలేదని తెలిపారు. శాఖల్లో సర్దుబాటు చేయాల్సిన కొంత మంది వీఆర్ఏలను ఇతర జిల్లాలకు పంపించారని పేర్కొన్నారు. వీఆర్ఏలకు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇప్పించాలని కోరారు. వారసులకు, మరణించిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలిచ్చేందుకు మార్గదర్శకాలివ్వాలని తెలిపారు. మిగిలిపోయిన వారిని వివిధ శాఖల్లో ఉన్న ఖాళీల్లో సర్దుబాటు చేయాలని సూచించారు. ఇతర జిల్లాలకు బదిలీ చేసిన వారిని సొంత జిల్లాలకు మార్పులు చేయాలని కోరారు. మున్సిపాల్టీల్లో పీహెచ్ వర్కర్లుగా నియమించిన వారిని ఓఎస్‌లుగా పరిగణించేందుకు తగు చర్యలు తీసుకుని అధికారులను ఆదేశించాలని సూచించారు.

రాష్ట్ర ప్రగతిలో భాగస్వామ్యమవుతాం

సీఎంతో కోకో కోలా కంపెనీ ప్రతినిధుల చర్చలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర పారిశ్రామికాభివద్ధిలో పాలుపంచుకునేందుకు హిందుస్థాన్ కోకో కోలా బెవరేజెస్ కంపెనీ ముందుకొచ్చింది. సంస్థ పబ్లిక్ అఫైర్స్ చీఫ్ హిమాన్షు ప్రియదర్శని సారథ్యంలోని ప్రతినిధి బృందం సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సంప్రదింపులు జరిపింది. రాష్ట్రంలో దాదాపు రూ.3 వేల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టామనీ, సిద్ధిపేట జిల్లాలోని బండ తిమ్మాపూర్‌లో తాము తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ బాట్లింగ్ ప్లాంట్ నిర్మాణంలో ఉందని బృంద సభ్యులు సీఎంకు వివరించారు. తెలంగాణలో పెట్టుబడులతో పాటు సామాజిక అభివద్ధిలో తమ కంపెనీ భాగస్వామ్యమవుతుందని తెలిపారు. అందుకు తగిన విధంగా ప్రాజెక్టులను విస్తరిస్తామని వారు సీఎంకు తెలిపారు. పెట్టుబడులకు రక్షణ కల్పించటంతో పాటు పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తగిన సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి భరోసా ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులకు రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానం అమల్లో ఉంటుందని సీఎం అన్నారు.

కాళ్లతోనే కంప్యూటర్ ఆపరేటింగ్

- ప్రజాపాలనతో వికలాంగునికి ఉపాధి
- రెండు చేతులు లేకున్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు



నవతెలంగాణ–కాగజ్‌నగర్

పుట్టుకతోనే రెండు చేతులు లేవు. అయినా అతను ఎక్కడా అధైర్యపడలేదు. తానూ అందరితో సమానమయ్యాడు. తన కాళ్లనే చేతుల్లా మార్చుకున్నాడు.. ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం ప్రతి ఒక్కరినీ అభ్యర్థించాడు. దరఖాస్తులు చేసుకున్నాడు. అయినా ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. ప్రస్తుతం ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం కోసం మున్సిపల్ కార్యాలయంలో ఆపరేటర్లు అవసరం ఉండటంతో మున్సిపల్ కమిషనర్ అంజయ్యను కలిసి కంప్యూటర్ ఆపరేటర్‌గా చేరాడు. ఇదీ కుమురం భీం–ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణం చారిగాం రోడ్డుకు చెందిన జాకీర్ పాషా నేపథ్యం. ఇతను ఎంకాం పీజీడీసీఏ పూర్తి చేశాడు. ప్రస్తుతం కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాడు. కాళ్లతో దరఖాస్తులను చాకచక్యంగా కంప్యూటర్‌లో నమోదు చేస్తుండటంతో ప్రతి ఒక్కరూ ఆయన పనితనాన్ని చూసి మెచ్చుకుంటున్నారు.

28 మంది ఆపరేటర్ల నియామకం

కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు కోసం 28 మంది ఆపరేటర్లను నియమించినట్టు మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు.

ఈ క్రమంలో రెండు చేతులు లేని జాకీర్‌పాషా కలువడంతో అతనికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో విద్యార్హతలు చూసి కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమించినట్టు తెలిపారు. మొత్తం మున్సిపల్ వ్యాప్తంగా 16,807 దరఖాస్తులు వచ్చాయని, ఈ నెల 17 వరకు మొత్తం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 5,170 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు.

ఏపీలో అంగన్‌వాడీలపై ఎస్మా తగదు

- తక్షణమే వెనక్కి తీసుకోవాలి..వారితో సర్కారు చర్చించాలి
- స్కీమ్ వర్కర్ల అనుబంధ సంఘాల సమావేశంలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం సరిగాదనీ, జగన్ సర్కారు దాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలతో ఏపీ ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల స్కీమ్ వర్కర్ల అనుబంధ యూనియన్ల సమావేశం ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రేమపావని అధ్యక్షతన జరిగింది. అందులో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్వీ.రమ, పి.జయలక్ష్మి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ప్యారీజాన్ మాట్లాడారు. ఏపీలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు వారు మద్దతు తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఎస్మా జీవో నెంబర్ 2ను తక్షణమే రద్దు చేయాలనీ, ఇప్పటికైనా జగన్ ప్రభుతం తన విధానాన్ని మార్చుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ పథకాల నిర్వహణను ప్రయివేటు సంస్థలకు అప్పగించడాన్ని మానాలని సూచించారు. పథకాలను సంస్థాగతం చేయాలనీ, అందులో పనిచేసే కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్, ఉద్యోగ భద్రత, పీఎఫ్ తదిరత డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

కేంద్ర కార్మిక ఉద్యోగ ,రైతు సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ, స్కీం వర్కర్లందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బిల్ట్ మిల్లును పునరుద్ధరించాలి

ఫిన్ క్వెస్ట్, ఐటీసీ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ములుగు జిల్లా కమలాపురంలోని బల్లాపూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (బిల్ట్) కంపెనీ పునరుద్ధరణ ప్రక్రియను తక్షణమే చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీనియర్ అధికారులతో ఇదే అంశంపై సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయనప సమీక్ష నిర్వహించారు. మిల్లులో వస్త్రాల తయారీకి ఉపయోగించే కలప గుజ్జును తయారు చేస్తారు. 2014లోనే ఈ మిల్లు మూతపడింది. దీంతో దాదాపు 750 కార్మిక కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. వీరందరికీ ఉపాధి కల్పించటంతో పాటు స్థానికంగా ఉద్యోగ కల్పనకు వీలుగా ఈ మిల్లును తిరిగి తెరిపించేందుకు ముఖ్యమంత్రి చొరవ చూపారు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ప్రస్తుతం బిల్ట్ కంపెనీ ఆస్తులు ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధీనంలో ఉన్నాయి. ఆ కంపెనీ ఎండీ హార్దిక్ పటేల్, ఐటీసీ పేపర్ బోర్డ్స్ డివిజన్ సీఈవో వాదిరాజ్ కులకర్ణితో పాటు సంబంధిత అధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఫ్యాక్టరీని పునరుద్ధరించాలనే ఆలోచనను వారితో పంచుకున్నారు. ప్రభుత్వం తరఫున తీసుకోవాల్సిన చర్యలు, సాధ్యాసాధ్యాలను చర్చించారు. మిల్లును తెరిపించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఫిన్‌క్వెస్ట్ బృందాన్ని కోరారు. బిల్ట్ ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఐటీసీ కంపెనీ ఆసక్తి చూపుతోంది. ఫిన్ క్వెస్ట్ కంపెనీ ఐటీసీతో చర్చల ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఈ సందర్భంగా కోరారు.

మిల్లును పునరుద్ధరించే ప్రక్రియలో ఐటీసీకి అన్ని విధాలా ప్రభుత్వం తరుపున సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఐటీసీ చేపట్టిన ప్రాజెక్టులు, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపైనా ఈ సమావేశంలో చర్చించారు. సీఎంతో పాటు మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి, సీఎంఓ అధికారులు, ములుగు కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐకి బియ్యం పంపిణీని వేగవంతం చేయాలి..

- ఈ నెల 31వ తేదీలోగా లక్ష్యం పూర్తి చేయాలి.
- పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలి.
- జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో మంత్రి ఉత్తమ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత ఆహార సంస్థకు (ఎఫ్.సి.ఐ కి) బియ్యం పంపిణీని వేగవంతం చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎస్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పౌర సరఫరాల కమిషనర్ డిఎస్ చౌహాన్ తో కలిసి సోమవారం సచివాలయంలోని తన కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల సంస్థ, ఎఫ్ సీఐ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కస్టమ్ మిల్లింగ్‌ను వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, రైస్ మిల్లర్ల ద్వారా బియ్యం ఎఫ్ సీఐకి అందజేయాలని సూచించారు. పౌర సరఫరాల శాఖ నుంచి ఎఫ్‌సిఐకి పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ బియ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో అక్కడ కేంద్ర ప్రభుత్వ అధికారులు పెద్ద మొత్తంలో బియ్యం కేటాయింపులు అడిగారనీ, అయితే డెలివరీలలో పని తీరు తక్కువగా ఉందని ఫిర్యాదు చేశారని వివరించారు. పౌర సరఫరాల సంస్థ జనవరి 31 నాటికి 7.83 లక్షల మెట్రిక్ టన్నుల వానాకాలం బియ్యం, యాసంగి సీజన్‌కు 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరాలో ఆలస్యం జరుగకూడదని అధికారులను ఆదేశించారు. దీని కోసం తెలంగాణ మిల్లర్లందరూ రాబోయే రోజుల్లో దాదాపు 42 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని డెలివరీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

రైతుల నుంచి వరి ధాన్యాన్ని సేకరించి మిల్లర్లకు అందించేందుకు పౌరసరఫరాల సంస్థ రుణాలు తీసుకున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ పెట్టుబడిని తిరిగి పొందడం అనేది మిల్లర్లు అవసరమైనంత నాణ్యతలో ఎఫ్ సీఐకి బియ్యాన్ని పంపిణీ చేయడంపై ఆధారపడి ఉంటుందనీ, జాప్యం జరిగితే కార్పొరేషన్‌కు పెద్ద ఎత్తున నష్టాన్ని కలిగిస్తుందని తెలిపారు. గత 9–10 సంవత్సరాలలో రూ. 58,000 కోట్ల అప్పులు, రూ. 11,000 కోట్ల నష్టాల వలన సివిల్ సప్లైపై భారం పడిందని చెప్పారు. ఆలస్యం చేయడం వలన అదనంగా దాదాపు రూ. 3,000 కోట్ల వార్షిక వడ్డీ భారం పడనుందని అన్నారు. ఎఫ్‌సీఐకి నిర్ణీత పరిమాణంలో సీఎంఆర్ బియ్యాన్ని పంపిణీ చేయడంలో జాప్యం చేయడం వల్ల భవిష్యత్తులో తెలంగాణకు కేటాయింపులపై తీవ్ర పరిణామాలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు. ఎఫ్ సీఐకి సకాలంలో బియ్యం పంపిణీ చేసేందుకు విధానాలను మెరుగుపరచాలనీ, ప్రక్రియను క్రమబద్ధీకరించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. లక్ష్యం గడువుకు 21 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున, లక్ష్యాన్ని సాధించడానికి రోజు వారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన ప్రతిపాదించారు.

పీడీఎస్ బియ్యం నాణ్యత లోపించడంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్రాలు కిలో కు రూ.39కి కొనుగోలు చేసిన బియ్యాన్ని రీసైకిల్ చేసే కేసులను అత్యంత సీరియస్‌గా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఒక్కో బియ్యం బస్తాకు 4–5 కిలోల తక్కువ బియ్యం అందుతున్నట్లు రేషన్ షాపు యజమానుల నుంచి వచ్చిన ఫిర్యాదును కూడా మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రేషన్ షాపుల యజమానులు ఎందుకు నష్టపోవాల్సి వస్తుందని ప్రశ్నించారు. దీనిపై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పార్లమెంటు ఎన్నికల్లో 12కు తగ్గకుండా గెలవాలి : సీఎం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాలకుగాను 12కు తగ్గకుండా గెలిచేందుకు కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జిల్లాల ఇంచార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలతో ఆయన సమావేశమయ్యారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, మహబూబ్ నగర్, హైదరాబాద్ నేతలతో ఆయన భేటీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో కంటే ఎంపీ ఎలక్షన్లలో ఎక్కువ ఓట్లు సాధించేలా కృషి చేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 26 తర్వాత జిల్లాల్లో పర్యటిస్తాననీ, ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో తొలి సభ ఉంటుందని తెలిపారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక తొలి సభను ఇంద్రవెల్లిలో రేవంత్ రెడ్డి నిర్వహించిన విషయం తెలిసిందే. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలి బహిరంగ సభను ఇంద్రవెల్లిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. అక్కడ అమరుల స్మారక స్మృతివనానికి శంఖుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదిలాబాద్ నేతలకు సూచించారు. ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను ఆదుకుంటామని సీఎం ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి బాధ్యతలను ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్ మంత్రులకు అప్పగిస్తామనీ, సంక్షేమం, అభివృద్ధిలో అందరూ భాగస్వాములేనని భరోసానిచ్చారు. తాను గత సీఎంలా కాదని తేల్చి చెప్పారు. జనవరి 26 తర్వాత ఎ ప్రతి వారం మూడు రోజుల పాటు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటలవరకు ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని నేతలకు సూచించారు.

ఆరు గ్యారంటీల అమలుకు..

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిన మాట మేరకు ఎన్ని అవాంతరాలు ఎదురైనా హామీలను అమలు చేస్తుందని తెలిపారు.

కేటీఆర్‌లో అసహనం పెరిగింది: పొన్నం ప్రభాకర్

అధికారం కోల్పోవడంతో కేటీఆర్‌లో అసహనం, అసూయ పెరిగి ఇష్టా రాజ్యంగా మాట్లాడుతున్నాడని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. 32 మెడికల్ కాలజీలకు బదులు 32 యూట్యూబ్ చానళ్లను ఏర్పాటు చేస్తే గెలిచే వాళ్లమంటూ పరిపక్వత లేకుండా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఇంకా అధికారంలో ఉన్నామనే మైకంలో అవాకులు చెవాకులు పేలుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అప్పల పాలు చేసింది చాలక స్వేద పత్రాల పేరుతో అబద్దాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలనీ, లేకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ..

- ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్

నవతెలంగాణ– కామారెడ్డి


బిల్లులు మంజూరుకై ఓ వ్యక్తిని లంచం తీసుకుంటున్న ఎన్పీడీసీఎల్ ఏఈని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో సోమవారం జరిగింది. ఏసీబీ అధికారులు, బాధితుడు తెలిపినవ వివరాల ప్రకారం.. సదాశివనగర్ మండలం ముత్తునూరు గ్రామానికి చెందిన కుంట భైరవ.. సబ్ స్టేషన్‌లో తన వాహనాన్ని కిరాయికి తిప్పుకుంటున్నాడు. ఈ క్రమంలో సబ్ స్టేషన్‌లోని ఏఈ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నాయిని రాజు.. భైరవ.. బిల్లులు మంజూరు చేయాలంటే అతనికి రూ.12,500 లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో ఏసీబీ అధికారులను భైరవ సంప్రదించాడు. కాగా, సోమవారం రాజు రూ.12,500 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అతన్ని పట్టుకున్నట్టు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్, శ్రీనివాస్ తెలిపారు. ఇతని వద్దనే కాక, కామారెడ్డి బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఎవర్ గ్రీన్ జిరాక్స్ షాప్ యజమాని సంతోష్ వద్ద నుంచి రూ.9000, అంతకు ముందు రోజు మరో రూ.3500 తీసుకున్నట్టు అధికారులు చెప్పారు.

సంపాదకీయం

అర్థ జీవితాలు!

ఎంతో వెలుగుల భవితవ్యాన్ని చూడాల్సిన విద్యార్థులు అర్ధాంతరంగా జీవితాలను ముగించుకోవడం అత్యంత బాధాకరం. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రభుత్వ విద్యకు గండి కొట్టి, కార్పొరేటుకు పట్టం కట్టి, సమిష్టి భావన స్థానే వ్యక్తివాదానికి పాదులు తీసిన పరిణామాల అన్నింటి పర్యవసానమే ఇది. నాలుగు రోజుల కిందట బెంగళూరులో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడింది. దానికి కొద్ది రోజుల ముందు ఢిల్లీలో ఐఐటి విద్యార్థి రైలు కిందపడి, ప్రాణాలు తీసుకున్నాడు. నీట్, ఐఐటి వంటి కోర్సుల్లో సీట్ల కోసం శిక్షణ ఇచ్చే రాజస్థాన్‌లోని కోటా కోచింగ్ సెంటర్లలో ఆత్మహత్యలు పరిపాటి అయ్యాయి. ఒక్క 2023లోనే అక్కడ 26మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సిఆర్‌బి) సమాచారం ప్రకారం.. 2022లో దేశం మొత్తమ్మీద 13,044 మంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. నవ్వుతూ తుళ్లుతూ చదువుల పర్వాన్ని సాగించాల్సిన తరుణం నేటితరం విద్యార్థులకు ఎందుకని చీకటి కుహరంగా మారుతుంది? ఇరవై ఏండ్ల క్రితం ఇంతగా లేని ఆత్మహత్యలు ఇప్పుడెందుకు ఏడాదికి వెయ్యికి పైబడి చోటు చేసుకుంటున్నాయి? దేశంలో వేళ్లూనుకున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారమయం చేశాయి. సమాజ ఉత్థాన పతనాలను, చరిత్ర ఆటుపోట్లను వివరించి, ఆత్మస్థైర్యాన్ని పెంచే సామాజిక శాస్త్రాల బోధన అవసరమే లేదని తేల్చి పడేశాయి! తీవ్రమైన పోటీ, ఒత్తిడి గొప్ప ఫలితాలను ఇస్తాయన్న యాంత్రిక ధోరణిని విద్యార్థులపై మోపాయి. దీనికితోడు సందట్లో సడేమియాలా జొరబడుతున్న విద్య కాషాయీకరణ విద్యార్థుల్లో ప్రశ్నించే స్వభావాన్ని నిర్వీర్యం చేస్తోంది. నవోత్తేజంతో ఉరకలు వేయాల్సిన విద్యార్థిలోకం వీటన్నిటి మూలంగా నిస్తేజితమవుతోంది. ఒత్తిడిని తట్టుకోలేని, వైఫల్యాన్ని అంగీకరించలేని నీరసగళంగా మారుతోంది. కోటాలో ఆత్మహత్యల నేపథ్యంలో నియమించిన భవానీసింగ్ దేథా కమిటీ కూడా అదే విషయాన్ని నొక్కి వక్కాణించింది.

అత్యధిక ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో పిల్లలను నిరంతర ఒత్తిడితో నలిగేలా చేయడం తప్ప ఎక్కడా ఉత్తేజాన్నిచ్చే ఆటపాటల జాడ లేదు. సాధించి తీరాలనే పోటీ ఉపదేశాలు తప్ప వినోద వికాసాలకు విలువ లేదు. మార్కులూ ర్యాంకుల లెక్కలతోనే విద్యాసంస్థల మూల మూలలూ పిక్కటిల్లు తున్నాయి. ఇలాంటి ఊపిరి సలపని పీడన వాతావరణంలో నిర్దేశిత లక్ష్యాలను చేరలేదనో, చేరలేమనో విద్యార్థులు తల్లడిల్లి పోతున్నారు. బతకటానికి అనేక దారులు, అవకాశాలూ ఉన్నాయన్న భరోసా, సాంత్వన వారికి లభించకుండా పోతోంది.



సమాజంలో చదువులు ఎప్పటినుంచో ఉన్నప్పటికీ - ఈ ఇరవై ఏండ్లలోనే ఇలాంటి విపరీతాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిని లోతుగా విశ్లేషిస్తే- విద్య వైద్యం తదితర రంగాలకు నూతన ఆర్థిక విధానాలు చేసిన చేటు ఏమిటో అర్థమవుతుంది. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడం, కార్పొరేటు విద్యాసంస్థలు విచ్చల విడిగా విస్తరించే అవకాశాలు కల్పించటం, ప్రయివేటు, కార్పొరేటు చదువులతోనే భవిష్యత్తు వెలిగిపోతుంది అన్న భావనను పెంపొందించటం గడిచిన మూడు దశాబ్దాల్లో విపరీతంగా జరిగిపోయింది. లక్షల రూపాయలు పోసి పిల్లలను చదివిస్తున్న సగటు మధ్య తరగతి కుటుంబాల ఆకాంక్షలు పిల్లల మీద క్షణ క్షణం ఒత్తిడిని రాజేస్తున్నాయి. దీనికితోడు అత్యధిక ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో పిల్లలను నిరంతర ఒత్తిడితో నలిగేలా చేయడం తప్ప ఎక్కడా ఉత్తేజాన్నిచ్చే ఆటపాటల జాడలేదు. సాధించి తీరాలనే పోటీ ఉపదేశాలు తప్ప వినోద వికాసాలకు విలువ లేదు. మార్కులూ ర్యాంకుల లెక్కలతోనే విద్యాసంస్థల మూల మూలలూ పిక్కటిల్లుతున్నాయి. ఇలాంటి ఊపిరి సలపని పీడన వాతావరణంలో నిర్దేశిత లక్ష్యాలను చేరలేదనో, చేరలేమనో విద్యార్థులు తల్లడిల్లిపోతున్నారు. బతకటానికి అనేక దారులు, అవకాశాలూ ఉన్నాయన్న భరోసా, సాంత్వన వారికి లభించకుండా పోతోంది.

ఈ అసహజ, అమానవీయ చదువుల చిత్రాన్ని సమర్పించిన ఉదారవాద ఆర్థిక విధానాల చట్రాన్ని బద్దలు కొట్టాలి. అప్పుడే ఊపిరి సలపని చదువుల నుంచి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఉపశమనం లభిస్తుంది. దీనికోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి, యువజన సంఘాలూ, మేధావులూ పూనుకోవాలి. ప్రభుత్వాలు తక్షణం స్పందించి, ఇప్పటి వరకూ వివిధ కమిటీలు చేసిన సిఫార్సులను అమలు చేయాలి. ఆటలూ పాటలతో కూడిన చదువు, తలకు, తనకూ బరువు కాని చదువూ విద్యార్థికి అందించాలి. పిల్లల శక్తిని, ఆసక్తిని అంచనా వేసి, తదనుగుణమైన విద్యనే అందించటానికి తల్లిదండ్రుల వైపు నుంచీ ప్రయత్నం జరగాలి. గొప్ప గొప్ప చదువులు, స్థానాలూ, సాధనలూ అవసరమైనవే! కానీ, జీవితం వాటన్నిటికన్నా ముఖ్యమైనది. అందుకనే మన విద్యావ్యవస్థను ఆమూలాగ్రం పునర్నిర్మించుకోవాలి. చావులూ, సంక్షోభాలూ లేని చదువులు నాగరిక, మానవీయ సమాజానికి నాందీవాచకాలు.

డాలర్‌నే దేశ కరెన్సీగా మారిస్తే...?

అర్జెంటీనా కొత్త దేశాధ్యక్షుడు జేవియర్ మిలై ఒక కొత్త ప్రతిపాదన చేశాడు. తమ దేశ రిజర్వుబ్యాంకును ఏకంగా రద్దు చేసేసి అమెరికన్ డాలర్లనే తమ దేశ కరెన్సీగా ప్రకటించాలన్నదే అతగాడి ప్రతిపాదన. ఒక దేశపు కరెన్సీని డాలర్‌తో మారకం చేసే రేటును స్థిరంగా కొనసాగించడం వేరు. ఏకంగా దేశీయ కరెన్సీనే రద్దు చేసి డాలర్‌నే తమ కరెన్సీగా స్వీకరించడం వేరు. డాలర్‌తో స్థిర మైన మారకపు రేటు కలిగి వుండి, దేశానికి గనక స్వంత కరెన్సీ, స్వంత రిజర్వు బ్యాంక్ ఉంటే అప్పుడు ఆ దేశంలో దేశీయ కరెన్సీకి అదనంగా డిమాండ్ పెరిగినప్పుడల్లా ఆ మేరకు ఆ రిజర్వు బ్యాంక్ ముద్రించుకోవచ్చు. ఈ లోపు దేశీయ కరెన్సీ వాడకం నుండి డాలర్ల వైపు మారిపోకుండా కొన్ని నియంత్రణ చర్యలను కూడా తీసుకోవచ్చు. అలా చేస్తే కరెన్సీ మారకం రేటు స్థిరంగా కొనసాగుతుంది. కాని దేశీయ కరెన్సీని, రిజర్వు బ్యాంకును రద్దు చేసేసి ఏకంగా అమెరికన్ డాలర్లనే దేశీయ కరెన్సీగా వాడడం అంటే అది పూర్తి మార్పు.



ప్రభాత్ పట్నాయక్

ఈ తేడా ఏమిటో అర్థం కావడానికి ఒక ఉదాహరణ : ఒకానొక స్థాయిలో దేశ జిడిపి, ధరలు వడ్డీ రేట్లు నిలకడగా ఉన్నప్పుడు దేశంలో మొత్తం కరెన్సీకి డిమాండు 100 యూనిట్లు ఉందనుకుందాం. కాని అందుబాటులో ఉన్న కరెన్సీ 90 యూనిట్లే ఉందనుకుందాం. అప్పుడు రిజర్వు బ్యాంకు ఆ కొరవ 10 యూనిట్ల కరెన్సీని ముద్రించి విడుదల చేయవచ్చు. అలా చేసినందువలన డాలర్‌తో ఉన్న స్థిర మారకపు రేటు మారిపోదు. అదే డాలర్ నే దేశీయ కరెన్సీగా స్వీకరిస్తే ఏమౌతుంది? అప్పుడు ఒకానొక స్థాయిలో జిడిపి ఉండి, ధరలు, వడ్డీ రేట్లు స్థిరంగా ఉన్నప్పుడు దేశంలో 100 డాలర్ల కరెన్సీకి డిమాండ్ ఉందనుకుందాం. కాని అందుబాటులో 90 డాలర్ల కరెన్సీ మాత్రమే ఉందనుకుందాం. అప్పుడు అదనంగా కావలసిన 10 డాలర్లనూ మన దేశం ముద్రించలేదు కదా (దేశీయ రిజర్వు బ్యాంకు రద్దయిపోయింది కనుక). అది అమెరికన్ ఫెడరల్ రిజర్వు చేయవలసిన పని. అప్పుడు దేశం ముందు ఉన్న పరిష్కా రాలు- (అ) ఏదో ఒక విధంగా డాలర్లను సంపాదించడం, (ఆ) విదేశాల నుండి డాలర్లను అప్పు తెచ్చుకోవడం, అవసరమైతే దేశ పబ్లిక్ సంస్థలను అమ్మేయడం. ఈ రెండింటిలో ఏదో ఒకటి చేస్తేనే దేశ జిడిపి ఇప్పుడున్న స్థాయిలో కొనసాగుతుంది. ఈ రెండు పరిష్కారాలూ కూడదు అనుకుంటే అప్పుడు మన దేశ జిడిపిని మనదగ్గర లభిస్తున్న డాలర్ల మేరకు పరిమితం చేసుకోవాలి. రిజర్వు బ్యాంకును ఉపయోగించుకుని అవసరమైన అదనపు కరెన్సీని ముద్రించడం అనే పరిష్కారం ఇప్పుడు లేదు.

మరో విధంగా చెప్పాలంటే డాలర్‌నే దేశీయ కరెన్సీగా స్వీకరిస్తే మన విదేశీ రుణభారం పెరిగిపోతుంది. లేదా మన దేశ సంపదను విదేశాలకు అమ్ముకోవలసి వస్తుంది. అప్పుడు మన దేశ సంపద తరిగిపోతుంది. ఇలా జరగడానికి కారణం మనం ఆదాయం కన్నా ఎక్కువ ఖర్చు చేయడం కాదు (మన ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువ చేస్తే అప్పుడు విదేశీ చెల్లింపుల ఖాతాలో లోటు పెరుగుతుంది). మనకు చెలామణీ కోసం అవసరమైన కరెన్సీ కన్నా తక్కువ పరిమాణంలో కరెన్సీ అందుబాటులో ఉండడం వలన ఇలా జరుగుతుంది.

ఒకవేళ విదేశీ రుణ భారం పెరగకుండా ఉండాలంటే మన దేశ ఆర్థిక వ్యవస్థను కుదించుకోవలసి వుంటుంది. ఇదెందుకు జరుగుతుందో చూద్దాం. ఉదాహరణకు: దేశ ఆర్థిక వ్యవస్థ సమతూకంగా ఉందనుకుందాం (లోటూ లేకుండా, మిగులూ లేకుండా ఉండడం, విదేశీ రుణాలూ లేకుండా, విదేశీ కరెన్సీ నిల్వలూ లేకుండా ఉండడం). అప్పుడు దేశం నుండి సాగే ఎగుమతుల్లో 10 డాలర్ల మేరకు పెరుగుదల వచ్చిందనుకుందాం. దేశం దిగుమతుల విలువ జిడిపిలో 10 శాతంగా ఉందనుకుందాం. అప్పుడు దేశ జిడిపిలో 100 డాలర్లకు మించి పెరుగుదల ఉండడానికి వీలులేదు. (100 డాలర్ల మేరకు జిడిపి పెరిగితే దిగుమతులు 10 డాలర్లమేరకు పెంచుకోవచ్చు. ఎగుమతులవలన 10 డాలర్లు అదనంగా వచ్చాయి కనుక డాలర్ కు డిమాండ్ స్థిరంగా ఉంటుంది. ఒకవేళ దేశ ఆర్థిక వ్యవస్థలో 100 డాలర్ల కన్నా అదనంగా పెరుగుదల సాధించే అవకాశాలు ఉన్నా జిడిపి పెరుగుదలను 100 డాలర్లకే పరిమి తం చేయాలి. ఒకవేళ జిడిపి 200 డాలర్లు పెరిగితే అప్పుడు దిగుమతులు 20 డాలర్లు పెరుగుతాయి. కాని అదనంగా ఎగుమతుల ద్వారా వచ్చినవి 10 డాలర్లే. అప్పుడు డాలర్లకు కొరత ఏర్పడుతుంది. ఆ కొరత పూడ్చడానికి అప్పు చేయాల్సి వస్తుంది).అయితే దీనికీ ఒక సమస్య ఉంది. 100 డాలర్లమేరకు దేశ జిడిపిని పెంచుకోవాలంటే ఆ అదనపు పెరుగుదలకు తగినట్టు రిజర్వు కరెన్సీ ఏర్పాటు చేసుకోవాలి. జిడిపిలో రిజర్వు కరెన్సీ 10 శాతం ఉండాలి అనుకుంటే అప్పు డు అదనపు 100 డాలర్ల జిడిపి పెరుగుదలను ఇముడ్చుకోడానికి అదనంగా 10 డాలర్ల రిజర్వు కరెన్సీ కావాలి. ఎగుమతుల ద్వారా సంపాదించిన 10 డాలర్లు పెరిగే దిగుమతులకు చెల్లించడానికి సరిపోతాయి. మరి 100 డాలర్ల అదనపు జిడిపి పెరుగుదలకు అవసరమయే డాలర్లు ఎక్కడి నుంచి తేవాలి? అంటే విదేశీ రుణం తేవాలి. విదేశీ రుణం పెరగకూడదు అనుకుంటే 100 డాలర్ల జిడిపి పెరుగుదల గురించి మరిచిపోవాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ముడుచుకుని ఉండాల్సి వస్తుంది.

ఏదోవిధంగా జిడిపిలో వృద్ధి కావాలంటే అదనంగా సంపాదించిన 10 డాలర్లలో 5 డాలర్లను మాత్రమే దిగుమతులకోసం ఖర్చు చేసి తక్కిన 5 డాలర్లనూ జిడిపి వృద్ధికి కావలసిన రిజర్వు కరెన్సీగా ఉపయోగించాలి. అంటే అప్పుడు జిడిపి 50 డాలర్ల మేరకు మాత్రమే పెరిగే అవకాశం ఉంటుంది. కాని దేశానికి కావలసిన దిగుమతులు కుదించుకుపోతాయి. దేశీయ కరెన్సీనే ఉపయోగిస్తే అప్పుడు మన దేశంలో సంపద వృద్ధి ఎంత జరుగుతుందో అంతమేరకూ మన కరెన్సీని రిజర్వుబ్యాంకు ద్వారా ముద్రించుకోవచ్చు. ఆ వెసులుబాటు ఉంటుంది. అదే బలమైన కరెన్సీ కాబట్టి అమెరికన్ డాలర్లనే మన దేశీయ కరెన్సీగా ఉపయోగిద్దాం అనుకుంటే మనకు అదనంగా కావలసిన డాలర్లను అమెరికా ఎందుకు ముద్రిస్తుంది? అప్పుడు సంపద వృద్ధి బట్టి కరెన్సీ ముద్రణ అనే విధానం కాకుండా డాలర్ల లభ్యత బట్టి మన దేశ సంపద వృద్ధి అన్న విధానం అమలు చేయలవలసి వస్తుంది. లేదా మనకు అదనంగా కావలసిన డాలర్లను విదేశీ రుణాల ద్వారా తెచ్చుకుని దేశ సంపదను పెంచుకుందాం అనుకుంటే ఈ పెంచిన సంపద కాస్తా ఆ విదేశీ రుణాల చెల్లింపుకే సరిపోతుంది.

డాలర్‌ను దేశీయ కరెన్సీగా ఉపయోగించడం వలన జిడిపి వృద్ధి జరగకుండా ఆర్థిక వ్యవస్థ ముడుచుకుపోతుందని పైన వివరించడం జరిగింది. అలా ఆర్థిక వ్యవస్థ ముడుచుకుపోతే అప్పుడు పొదుపు చర్యలకు పూనుకోవలసి వుంటుంది. అంటే జీతాల కోత, పెన్షన్ల కోత, ఉపాధి లో కోత వంటివి అమలు చేయాల్సి వుంటుంది. ఇవేవీ చేయకూడదు అంటే జిడిపిలో వృద్ధి ఉండాలి. అంటే విదేశీ రుణం తీసుకోవాలి. అప్పుడు తాత్కాలికంగా ఈ కోతలను ఆపవచ్చు. కాని ఆ రుణాన్ని తిరిగి చెల్లించవలసి వచ్చినప్పుడు ఇప్పుడు ఆపే కోతలకు రెట్టింపు మోతాదులో సంక్షేమంలో కోతలు విధించాల్సివస్తుంది.

మరి ఇంత సమస్యాత్మకంగా ఉన్నప్పుడు దేశీయ కరెన్సీని కాదని, డాలర్లనే దేశీయ కరెన్సీగా స్వీకరించడం ఎందుకు ? అర్జెంటీనా విషయమే చూస్తే అక్కడ ద్రవ్యోల్బణం చాలా ఎక్కువగా, ఏడాదికి 150 శాతం చొప్పున ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ద్రవ్యోల్బణానికి ఒకే ఒక మందు. మార్కెట్‌లో డిమాండ్ తగ్గించడం. అంటే ఉద్యోగాలలో కోత లేదా జీతాలలో కోత విధించడం. ఈ రెండూ నేరుగా చేయకుండా జేవియర్ మైలీ దేశ కరెన్సీని రద్దు చేసి డాలర్‌నే దేశ కరెన్సీగా ప్రతిపాదిస్తున్నాడు. అలా మార్చినందు వలన కూడా మళ్ళీ పొదుపు చర్యలకే దిగాల్సి వుంటుంది. అంటే ఉద్యోగాలలో, జీతాలలో కోత. నేరుగా ఆ పని చేయకుండా డాలర్ ఆర్థిక వ్యవస్థను తెస్తానని చెప్పడం జేవియర్ మైలీ మోసకారితనానికి నిదర్శనం.



జేవియర్ మైలీ ప్రపంచంలో వివిధ దేశాల్లో గద్దెలను ఎక్కుతున్న నయా ఫాసిస్టు అధినేతల జాబితాలో తాజాగా చేరిన వ్యక్తి. నయా ఫాసిజం ప్రపంచంలో విజృంభించడానికి కారణం నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో ముదురుతున్న సంక్షోభం. ఈ సంక్షోభ కాలంలో బడా కార్పొరేట్లు నయా ఫాసిస్టులతో మిలాఖత్ అయి తద్వారా తమ పెత్తనాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నారు. కార్మికవర్గం మీద మరిన్ని దాడులకు పూనుకుంటున్నారు. ఐతే ఈ నయా ఫాసిస్టు పాలకులు ప్రస్తుత సంక్షోభం రూపాన్ని మార్చగలరేమో తప్ప సంక్షోభాన్ని నివారించలేరు. అంటే తీవ్రమయ్యే ద్రవ్యోల్బణం స్థానే నిరుద్యోగాన్ని తీవ్రతరం చేయగలుగుతారు. కార్మికుల ఆదాయాలను మరింత కుదించగలుగుతారు. అలా చేసినా ఆ తర్వాత కూడా ఈ సంక్షోభం మరింత ముదిరిపోతుంది.

ఇంత భారీ ద్రవ్యోల్బణానికి కారణం ఏమిటి? గత అధ్యక్షుడు మాక్రి (ఇతగాడూ మితవాద నాయకుడే) దేశం నుండి ప్రైవేటు పెట్టుబడి విదేశాలకు తరలిపోతున్నందువలన దానికి పర్యవసానంగా ఏర్పడిన విదేశీ చెల్లింపుల లోటును భర్తీ చేయడానికి పెద్ద ఎత్తున విదేశీ రుణాలను తీసుకున్నాడు. అంతే తప్ప దేశంలోని సంపద విదేశాలకు తరలిపోకుండా నియంత్రించే చర్యలు తీసుకోలేదు. అలా తీసుకున్న విదేశీ రుణాలను తిరిగి చెల్లించవలసిన సమయం వచ్చేసరికి మళ్ళీ విదేశీ చెల్లింపులలో లోటు పెరిగి పోయింది. దీని కారణంగా దేశీయ కరెన్సీ విలువ బాగా తగ్గించుకోవలసివచ్చింది. దాని వలన దిగుమతులకు ఎక్కువ ఖరీదు చెల్లించవలసి వచ్చింది. ఆ అదనపు ఖర్చు అంతిమంగా ప్రజలు విని యోగించే సరుకుల మీద పడింది. దాంతో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.

అసంఘటిత కార్మికులు పెద్ద సంఖ్యలో ఉంటే వారి వేతనాలు పెరిగే ధరలతో ముడిపడి వుండవు గనుక ధరలు పెరిగినా వారి వేతనాలు పెరగవు. కాని అర్జెంటినాలో కార్మికులందరి వేతనాలూ ధరల సూచికతో లింకు అయివున్నాయి. అందుచేత వారి వేతనాలు కూడా ధరల పెరుగుదలతోబాటు పెంచవలసి వస్తుంది. అంటే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయలేని స్థితి వచ్చింది. ఇప్పుడు పరిస్థితిని అదుపులోకి తేవాలంటే పెట్టుబడుల వలసలను నియంత్రించాలి. డాలర్‌కు అర్జెంటినా కరెన్సీకి మధ్య మారకపు రేటును స్థిరీకరించాలి. ఇది జరగాలంటే ఆ దేశ కార్పొరేట్లను నియంత్రించాలి. కాని అలా చేయకుండా కార్పొరేట్లు దేశం నుండి పెట్టుబడులను బైటకు తరలించుకుపోతూ వుంటే దానికి శిక్ష అక్కడి కార్మిక వర్గానికి వేయాలని సిద్ధపడుతోంది అర్జెంటీనా ప్రభుత్వం.

జేవియర్ మైలీ ప్రపంచంలో వివిధ దేశాల్లో గద్దెలను ఎక్కుతున్న నయా ఫాసిస్టు అధినేతల జాబితాలో తాజాగా చేరిన వ్యక్తి. నయా ఫాసిజం ప్రపంచంలో విజృంభించడానికి కారణం నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో ముదురుతున్న సంక్షోభం. ఈ సంక్షోభ కాలంలో బడా కార్పొరేట్లు నయా ఫాసిస్టులతో మిలాఖత్ అయి తద్వారా తమ పెత్తనాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నారు. కార్మికవర్గం మీద మరిన్ని దాడులకు పూనుకుంటున్నారు. ఐతే ఈ నయా ఫాసిస్టు పాలకులు ప్రస్తుత సంక్షోభం రూపాన్ని మార్చగలరేమో తప్ప సంక్షోభాన్ని నివారించలేరు. అంటే తీవ్రమయ్యే ద్రవ్యోల్బణం స్థానే నిరుద్యోగాన్ని తీవ్రతరం చేయగలుగుతారు. కార్మికుల ఆదాయాలను మరింత కుదించగలుగుతారు. అలా చేసినా ఆ తర్వాత కూడా ఈ సంక్షోభం మరింత ముదిరిపోతుంది.

సంక్షోభం ముదురుతున్న కొద్దీ అర్జెంటినా వంటి దేశాల నుండి జరిగే ఎగుమతులు మరింతగా ముడుచుకు పోతాయి. దేశంలో నిరుద్యోగం మరింత పెరుగుతుంది. వేతనాలు మరింత తగ్గుతాయి. దేశీయ కరెన్సీగా డాలర్లనే స్వీకరిస్తే అప్పుడు ఆర్థిక వ్యవస్థ రెట్టింపు వేగంతో ముడుచుకుపోయి సంక్షోభం మరింత తీవ్రతరమౌతుంది. ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడం ఒక్కటే ప్రస్తుత సమస్యకు పరిష్కారం. అది జరగాలంటే నయా ఉదారవాద ఆర్థిక విధానాల చట్రాన్ని అధిగమించాల్సిందే. ప్రత్యామ్నాయ విధానాలను చేపట్టవలసిందే.

(స్వేచ్ఛానుసరణ)

'టీఎస్ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రవేశపెట్టడం బాగుంది. మేం ఒత్తిడులకు గురయ్యామనడం అవాస్తవం. ఉద్యోగమన్నాక, ఎక్కువమంది ప్రయాణికులు ఎక్కినప్పుడు గట్టిగట్టిగా అరవాల్సి వస్తుంది. మహిళలు ఆధార్ కార్డు చూపిస్తున్నారు. దాని ప్రకారం టికెట్టు కొడుతున్నాం. ఒరిజినల్ ఆధార్‌కార్డు లేకుంటే చార్జ్ వసూలు చేస్తున్నం. ఇవన్నీ మాకు మామూలే. ఉచిత ప్రయాణం లేని సమయంలోనూ ఇలాంటివి జరిగిన సందర్భాలు ఉన్నాయి. చూసేవారికి, విన్న వారికి ఇలాంటివి కొత్తగా ఉండొచ్చు. జనం ఎక్కువమంది ఉన్నప్పుడు గొడవలు గాకుండా ఉంటాయా? చెప్పండి'... అని కండక్టర్లు చెబుతున్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం ఆర్టీసీలో అమలవుతున్న నేపథ్యంలో సోషల్ మీడియాలో విభిన్న కథనాలు వస్తున్నాయి. ఉచిత ప్రయాణం పెట్టడం వల్ల సీటు కోసం మహిళలు జుట్లు పట్టుకుని కొట్టుకుంటున్నారని, టాప్ ఎక్కి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారని ట్రోల్ చేస్తున్నారు. ఇలా రాష్ట్రంలో ఎక్కడో చోట జరిగిన సంఘటనలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజెప్పడం కోసం కొంతమంది గ్రూప్‌లలో పెడుతుండవచ్చు. దీన్నో భూతద్దంలో చూపెడుతూ ఉచిత ప్రయాణాన్ని తక్కువ చేసేందుకు కొంతమంది ప్రయత్నించడం మంచిదా? ఈ విషయమై కొంతమంది ఆర్టీసీ కండక్టర్లను, డ్రైవర్లను, తోటి ప్రయాణికులతో ముచ్చటించాను. "ఉచిత ప్రయాణం బాగుంది. ప్రభుత్వం నిర్ణయం హర్షించదగినది. పేద, మధ్య తరగతికి చెందిన ఎక్కువమంది మహిళలు ఉపయోగించుకుంటున్నారు. ఏదో ప్రత్యేకంగా కొన్ని బస్సులను కేటాయిస్తారని అనుకున్నాం. ఇలా అన్ని బస్సులలో కల్పిస్తారని మహిళలందరికీ పెడతారని ఊహించలేదు. ప్రభుత్వ స్కూళ్ల, కాలేజీలు, సాధారణ ప్రయివేటు విద్యాసంస్థల్లో చదువుకునే అమ్మాయిలకూ బాగుంది.." అని అంటున్నారు మహిళలు. "ఎక్కడోచోట జరిగిన వాటిని మీడియాలో అతిగా చూపిస్తున్నారు. ఇది ఆడవారిని తక్కువ చేయడమే. దీనిని నవ్వులపాలు చేయకండి. అదే మా విన్నపం." అని మహిళలు కోరుతున్నారు. 'బస్సు దిగి కిలోమీటర్ లోపలికి వెళ్లాలంటే.. ఆటో ఎక్కాల్సిందే ' అని మరికొంతమంది మహిళా ప్రయాణికులు అంటున్నారు.

మహాలక్ష్మి పథకం ప్రారంభించి నేటికి నెలరోజులైంది. ఈ



ఉచిత ప్రయాణం-ప్రేలాపనలు!

నెలరోజుల్లో ఇబ్బందులున్న మాట వాస్తవం. అదనపు బస్సులు నడపాలని, బస్సులేని గ్రామాలకూ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్లు ఉన్నాయి. కాని పథకమే సరికాదు అని కొంత మంది వైరల్ చేయడమే విచిత్రంగా ఉంది. ఈ పథకం లేనప్పుడు ప్రమాదకరంగా ప్రయాణించిన సందర్భాలు లేవా? జనంతో కిక్కిరిసిన బస్సులు ఉన్నాయి. ప్రతిరోజూ ఇలాంటి దృశ్యాలు ఉండేవి. పుట్‌బోర్డుపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురైనవారూ ఉన్నారు. పండుగలు, ఇతర శుభకార్యాల సమయాల్లో తప్ప ఆర్టీసీకి ఆదాయం వచ్చేది కాదు. ఇప్పుడు ప్రయాణీకులు ఆర్టీసీ బస్సును బాగా ఉపయోగించుకుంటున్నారని ఆర్టీసీ సంస్థనే వివరాలతో సహా వెల్లడించింది. బస్సుల కోసమే మహిళలు గంటల తరబడి వెయిట్ చేస్తున్నారనేది తప్పు.. ఆటోలు కూడా ఎక్కి వెళ్తున్నారు. కొన్నిచోట్ల జరిగిన వాటిని అంతటా ఆపాదించడం సరికాదు. గతంకంటే ఇప్పుడు రోజూ వారి ఆదాయం కొంత తగ్గిందని ఆటోవాలాలు చెబుతున్నారు. అందులో వాస్తవం లేకపోలేదు. దానికి సంబంధించి వారి కోసం ప్రభుత్వం తప్పకుండా ఆలోచన చేయాలి.

ఉచిత రవాణా కల్పించడం ఒక్క తెలంగాణలోనే కాదు. దేశంలోని కర్నాటక, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లోనూ ఉంది. కాకపోతే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో మాదిరిగా అమలవుతుంది. తెలంగాణలో రాష్ట్రమంతటా మహిళలకు వర్తింపజేసింది ప్రభుత్వం. ఈ ఉచిత రవాణా ప్రపంచంలోని లక్సెంబర్గ్ దేశంలో అక్కడ ప్రభుత్వం 29 ఫిబ్రవరి 2020న అమలు చేసింది. బస్సులు, రైల్వేల్లోనూ ప్రజలకు ప్రవేశపెట్టింది. ఆ తర్వాత మాల్టా దేశంలోనూ 2022 అక్టోబర్ 1 ప్రారంభించింది. మరికొన్ని దేశాలకు సంబంధించి ముఖ్యమైన పట్టణాల్లోనూ ఉచిత రవాణా సదుపాయాన్ని అక్కడ ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. దానిని అక్కడ ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు.న్యూఢిల్లీలో మహిళలకు ఈ పథకం బాగా ఉపయోగపడిందని అక్కడికి వెళ్లి వచ్చిన వారు చెబుతున్నారు. కర్నాటకలో ప్రవేశపెట్టినప్పుడు మహిళలను తప్పుగా చూపిస్తూ బీజేపీ హేళన చేసింది. తెలంగాణలోనూ ఇలాంటి వాటినే హైలెట్ చేస్తూ చూపిస్తున్నారు. లక్షలాది ప్రజలకు సంబంధించి రోజూ ఉపయోగించుకునే పథకంలో సమస్యలు ఉండటం సహజం. సమస్య ఉన్నప్పుడు అవసరమైన బస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. సమ స్యలు లేకుండా చేయాల్సింది ప్రభుత్వమే. కేంద్రప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు సంబంధించి లక్షల కోట్ల రూపాయల రుణాలను రద్దు చేసింది. ఉచితం అవసరమా? అని ప్రశ్నిస్తున్న బీజేపీ నేతలు.. పారిశ్రామిక వేత్తల రుణాల రద్దుపై ఎందుకు ప్రశ్నించడం లేదు. విగ్రహాల నిర్మాణానికి, గుడుల కోసం కోట్ల రూపాయలను మోడీ ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది.

బీజేపీయేతర ప్రభుత్వాలు ప్రజలకు ఉపయోగపడే పథకాలు ప్రవేశపెడ్తుంటే.. ఉచితంగా ఇవ్వడం కరెక్టు కాదంటారు. వాస్తవానికి ఉచిత రవాణా పథకం మహిళలకు ఉపయోగ పడిందా లేదా అన్నది ప్రశ్న. మహిళలు పథకాన్ని ఉపయోగించుకుంటున్నారన్నది వాస్తవం. ఇదే విషయమై సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ప్రస్తావించినప్పుడు.. సమస్యలు ఉన్నాయి వాటిని పరిష్కరిస్తాం.. పథకం మహిళలకు లబ్ది చేకూరిందా లేదా అన్న వరకే చూస్తున్నామని స్పష్టం చేశారు. ఒకదానివల్ల మరొకరు నష్టపోవాలనేది తమ ఉద్దేశం కాదన్నారు. ఆర్టీసీకి ఆదాయం ఎలా సమకూరుతుంది? ఆదాయమార్గాలేంటి? ఏ రకంగా సంస్థను బతికిస్తారు?.. వంటివి ప్రభుత్వం చూడగలదా లేదా భవిష్యత్తు నిర్ణయిస్తుంది.

- జీవిఎం, 9490099023

చిరస్మరణీయుడు కామ్రేడ్ ఎన్వీ భాస్కరరావు

కామ్రేడ్ ఎన్‌వి భాస్కర్‌రావును తలచుకుని కా,, సుందరయ్య సభలో కంటనీరు పెట్టుకున్నారు. మాటలు కొన్ని క్షణాలు ఆగటంతో పాటు కంటనీరు పెడ్తూనే, సర్దుకుని ఒక మాట అన్నారు. "అమరజీవి భాస్కరరావు నాకు సోదరుడి లాంటి వాడు, ఆడుకుంటున్న వయస్సులో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంవైపునకు, ఎర్రజెండావైపునకు ఆకర్షితుడయ్యాడు. ఉద్యమ ప్రస్థానంలో కొరియర్‌గా పనిచేశాడు." అంటూ ఆయన నిబద్ధత ఈ సభలో "కా॥భాస్కరరావు స్మారక భవనం" ఏర్పాటు ఒక అంశం అయితే, మరో అంశం కా॥భాస్కరరావు ఉద్యమ ప్రస్థానం, ఆనాటి సుందరయ్య మాటలు నన్ను ఎంతగానో ప్రభావితం చేయటంతో పాటు బాధ్యతను పెంచాయి. ఆ జ్ఞాపకాలు ఇప్పటికీ మెదలుతూనే ఉన్నాయి.



డి జి నర్సింహారావు
9490098580

భాస్కరరావు చిన్న వయస్సులో ఉండగానే తండ్రిని కోల్పోయారు. భాస్కరరావును తల్లి అతి గారాబంగా పెంచింది. పదహారేండ్ల వయస్సులోనే కమ్యూనిస్టు ఉద్యమంవైపు ఆకర్షితుడయ్యాడు. ఎర్రజెండా భుజానికెత్తుకున్నాడు. చదువుకు స్వస్తి చెప్పి ఉద్యమంవైపు దూకాడు. నిర్బంధకాలంలో కమ్యూనిస్టు అగ్రనాయకులకు కొరియర్‌గా పనిచేశాడు. చిన్నవయస్సులోనే గొప్ప పరిణితి కనపర్చాడు. వయసు పెరుగుతున్న కొద్దీ యువకుడిగా అనేక ఆలోచనల్లో మునిగిపోయేవారు. ఈ స్థితిని చూసి సహజంగానే బిడ్డ అందుకోలేని దశకు వెళ్తున్నట్లు గమనించి తల్లి తీవ్ర ఆందోళన చెందింది. ఆ తర్వాత కాలంలో అనేకమంది పెద్దలు ఆ తల్లి ఆందోళనను తగ్గించడానికి ప్రయత్నిస్తూ నచ్చచెప్పటమే కాక, నీ బిడ్డ చెడిపోవడంలేదు అని చెప్పారు. పెళ్లి చేస్తే కుదుటపడతాడని భావించి సక్కుబాయిని ఇచ్చి పెళ్లి చేసింది. అనంతరం హైదరాబాద్‌కు నివాసం మారింది. ఎర్రజెండా, కమ్యూనిస్టు ఉద్యమం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధునితో పరిచయం, ఉద్యమ ప్రస్థానం కొనసాగింది. అనంతరం న్యాయవాదిగా వృత్తి నిర్వహణ చేపట్టగా చివరగా కామ్రేడ్ సుందరయ్య ప్రత్యక్ష జోక్యంతో పార్టీ హైదరాబాద్ బాధ్యతలు చేపట్టడం ముఖ్యమైన ఘట్టాలు. భార్య సక్కుబాయి ఉపాధ్యాయురాలు. మహిళా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ముగ్గురు అమ్మాయిలు విద్యావంతులు. పిల్లల్లో కూడా కమ్యూనిస్టు చైతన్యం నింపారు.

1964, 1967 మితవాద, అతివాద చీలికల అనంతరం కమ్యూనిస్టు పార్టీని హైదరాబాద్‌లో పునర్నించటంలో భాస్కర్‌రావు ముఖ్యభూమిక పోషించారు. వీరితోపాటు పి.లక్ష్మీదాస్, ఎ.రాంరెడ్డి ఉద్యమంలో పాల్గొన్నారు. 1975 సం॥ ఎమర్జెన్సీకి ముందుగానే పార్టీ నగర ప్రథమ మహాసభ సంజీవరెడ్డినగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. కా॥సుందరయ్య పాల్గొన్నారు. పార్టీ నగర కమిటీ ఐదుగురు సభ్యులతో ఏర్పడింది. కామ్రేడ్స్ ఎన్‌వి భాస్కరరావు ప్రథమ కార్యదర్శిగా, సభ్యులుగా పి.లక్ష్మిదాసు, ఎం పూర్ణచంద్రరావు, ఆర్ రఘుపాల్, డిజి నర్సింహారావు ఎన్నికైనారు. ఆ తర్వాత జరిగిన రెండు, మూడు మహాసభలలో కూడా కార్యదర్శిగా ఉన్నారు. కార్యదర్శి బాధ్యతల్లో ఉండగానే 1984లో చనిపోయారు.

టియు, విద్యార్థి, యువజన, మహిళ, సాంస్కృతిక రంగాలు, ఆంతరంగిక నాయకత్వాన్ని అభివృద్ధి చేయటం, కార్యకర్తలకు రాజకీయ విద్యతో పాటు ప్రజా సమస్యలపై నిర్దిష్ట కార్యాచరణ, ప్రజాసంఘాల సభ్యత్వ చేర్పింపు, పార్టీ నిర్మాణ ఏర్పాట్లు జరిగాయి. పార్టీ కార్యకర్తల పోషణకోసం నిరంతరం నిధిని సేకరిస్తూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడం జరిగింది. ప్రత్యేకంగా 1970-80 మధ్యకాలంలో పబ్లిక్ సెక్టార్ పరిశ్రమలు, ఈసిఐఎల్, హెచ్ఎంటి, బిహెచ్ఇఎల్, ఐటిపిఎల్, హెచ్ఏఎల్, హెచ్ఎంటి బేరింగ్‌లో అప్పటికే రాజ్యం ఏలుతున్న ఐఎన్‌టియుసి, హెచ్ఎంఎస్, ఏఐటియుసిల రాష్ట్ర నాయకులు సంజీవరెడ్డి, భద్రి విశాల్ పిత్తె, కెఎల్ మహేంద్ర వంటి పాతుకు పోయిన నాయకులను ఎదుర్కోవడానికి ఆయా పరిశ్రమల్లో, కార్మికుల్లో స్థానిక నాయకులను ప్రత్యేకించి తయారు చేయడానికి ప్రాధాన్యతనిచ్చారు. వారికి అవసరమైన రాజకీయ చైతన్యం అందించడం కారణంగా సీఐటీయు నాయకత్వం ధైర్య సాహసాలను ప్రదర్శించి, బలోపేతమైన పోరాటాలు నిర్వహించి అనేక విజయాలతో ముందుకు సాగింది. ప్రత్యేకించి క్షేత్ర స్థాయికి దిగి అన్ని పారిశ్రామిక వాడల్లో తాను, తనతో పాటు కొత్తవారిని యూనియన్లకు నాయకులుగా తయారు చేశారు. హైదరాబాద్‌లో కార్మికోద్యమ నాయకుడు కా॥ ఎన్వీ.

ఎమర్జెన్సీ అనంతర కాలంలో జరిగిన పార్లమెంటు ఎన్నికలు (1977 నవంబర్), 1978 ఫిబ్రవరి అసెంబ్లీ ఎన్నికల్లో విస్తృతంగా క్యాంపెయిన్ నడిచింది. జరిగిన అన్ని పోరాటాలలో పార్టీ ముందు భాగాన నడిచింది. ఎమర్జెన్సీ ఉపసంహరణ అనంతరం జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో మనం జనతా పార్టీతో దేశవ్యాపితంగా ఎన్నికల సర్దుబాటు చేసుకున్నాము. ఆనాడు సర్దుబాటులో భాగంగా హైదరాబాద్ రాజధానిలో సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం సీపీఐ(ఎం)కు కేటాయించారు. అభ్యర్థిగా కా॥ఎన్‌వి భాస్కరరావును నిర్ణయించి ప్రకటించింది. సీపీఐ(ఎం) పార్టీగా మొదటిసారి ఎన్నికలో పోటీచేసాము. మూడు మాసాలపాటు వందలాదిమంది పార్టీ, ప్రజాసంఘాల కార్యకర్తలు, విద్యార్థులు, యువతీయువకులు ఒక్కటై, ఉమ్మడిగా ఉడుం పట్టులాగా రాత్రి పగలూ శ్రమించారు. 1978 ఫిబ్రవరి 25న ఓటింగ్, ఎన్నికల ఫలితాల వరకూ మొక్కవోని దీక్షతో కృషి చేసారు. మన పార్టీ అభ్యర్థి కేవలం 1760 ఓట్లతో ఓడిపోయారు. అపజయం పాలైనా మొట్టమొదటిసారి పోటీ చేసిన పార్టీ అభ్యర్థి భాస్కరరావుదే గెలుపని ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పని చేసిన కొంతమంది యువతీయువకులు కొన్ని నెలలపాటు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. అయినప్పటికీ చైతన్యం ప్రదర్శించారే తప్ప వెనుకడుగు వేయలేదు.



కా॥ ఎన్.వి.భాస్కరరావు

1977 నవంబర్‌లో దివిసీమ ఉప్పెన. ఆనాడు పార్టీ మొత్తం ఆపదలో ప్రజలకు చేయూతనివ్వాలని నడుం బిగించింది. కా॥సుందరయ్య నాయకత్వంలో, సుందరయ్యతో సహా మోకాలు లోతున నీటిలో సహాయచర్యలు చేపట్టింది. కా॥జ్యోతిబసు పర్యటించారు. బాధితుల సహాయార్థం పార్టీ కార్యదర్శి కా॥ఎన్‌వి భాస్కరరావు సారథ్యంలో పెద్దఎత్తున ఆర్థిక, వస్తు, బట్టలు, బియ్యం సేకరించి పెద్ద సంఖ్యలో పంపాలని నిర్ణయించింది. సికింద్రాబాద్, హైదరాబాద్ పట్టణాల బస్తీలు, వ్యాపారకేంద్రాలు వారం రోజులపాటు వందలాది కార్యకర్తల కృషితో రూ.3లక్షలు, 150 బస్తాల బియ్యం, పెద్ద ఎత్తున బట్టలు సేకరించి కా॥భాస్కరరావు నాయకత్వంలో 40మంది బృందం వెళ్ళి సహాయక చర్యలు చేపట్టింది.

పార్టీ నగర కార్యదర్శిగా, టియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా కా॥భాస్కర్‌రావు బాధ్యతలు నిర్వహించారు. నగరంలో పబ్లిక్ సెక్టార్ పరిశ్రమలు, బ్యాంక్, ఇన్సూరెన్స్ రంగాలతో పాటు, కేంద్ర ప్రభుత్వోద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల ఉద్యమాల బాధ్యతే కాకుండా, ప్రత్యక్షంగా ఇసిఐఎల్, బిహెచ్ఇఎల్, ఆర్ అండ్‌డి, హెచ్‌సిఎల్, ఏపి స్కూటర్స్, గవర్నమెంట్ ప్రెస్, ప్రయివేట్ రంగ పరిశ్రమల యూనియన్లను ప్రత్యక్షంగా చూసేవారు. టియు రాష్ట్ర కార్యదర్శిగా (టియు రాష్ట్ర కేంద్రం విజయవాడలో సుదీర్ఘకాలం ఉన్న కారణంగా) రాష్ట్ర బాధ్యతలు, లేబర్ కమిషనర్, రిప్రజెంటేషన్స్, జాయింట్ మీటింగులతో పాటు రాష్ట్రంలో వివిధ సందర్భాలలో అవసరాల కోసం జిల్లాలకు వెళ్తుండేవారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా, రాష్ట్ర పార్టీ అవసరాలు కూడా చూస్తుండేవారు. పారిశ్రామిక కేంద్రమైన హైదరాబాద్‌లో కార్మికోద్యమం నిర్మించాలన్న పార్టీ కర్తవ్యాన్ని నిర్వర్తించారు.

నాకు భాస్కరరావుకు ఫ్రెండ్షీ, ఎల్డర్లీ, గైడింగ్ ఫిగర్. భాస్కర్‌రావుకు ఆత్మాభిమానం, పట్టుదల ఎక్కువ. ఆందోళన ఉన్నా బయటపడేవారు కాదు. ఆయనతో కలిసి ఉన్న కాలం కన్నా దూరమైన కాలం 38 ఏండ్లు. అతి ఎక్కువ కాలం. ఆయన లేనికాలంలో, ఉన్నకాలంలో నాపై ఒకే రకమైన ప్రభావం ఉంది. ఎల్లప్పుడూ భాస్కరరావును మరచిపోలేను. అన్నివేళలా ఆయన నాకు స్ఫూర్తి. మరచిపోలేని అనుభూతి. అందుకే నా దృష్టిలో ఆయన చిరస్మరణీయుడు.

(నేడు ఎన్వీ భాస్కర్‌రావు 93వ జయంతి)

5
నవతెలంగాణ
కరీంనగర్
మంగళవారం | జనవరి 09, 2024 | www.navatelangana.com

ఇరిగేషన్ కార్యాలయంలో చోరీ

నవతెలంగాణ - తిమ్మాపూర్



మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఆదివారం దొంగలు పడ్డారు. ఎస్సై చేరాలు కథనం మేరకు.. ఎల్ఎండి కాలనీలో గల నీటిపారుదల శాఖ ప్రభుత్వ కార్యాలయం ఆదివారం గొళ్లాన్ని పగలగొట్టి సుమారు 5 కంప్యూటర్లతో పాటు వైఫై కనెక్టింగ్ డాటా, వివిధ సామాగ్రిని దొంగలించినట్లు తెలిపారు. సుమారు 2.5 లక్షల విలువ గల సామాగ్రి చోరీకి గురైనట్లు చెప్పారు. ఈ విషయమై కార్యాలయ సూపరిండెండెంట్ అంజిరెడ్డి సమాచారం అందించడంతో ఎస్సై చేరాలు కార్యాలయానికి చేరుకొని సిబ్బందితో కలిసి కార్యాలయంలో పరిశీలించారు. క్లూస్ టీం కు సమాచారం అందించడంతో సోమవారం వేలిముద్రలు సేకరించారు. అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా ఘటన స్థలాన్ని కరీంనగర్ రూరల్ ఏసిపి కరుణాకర్‌రావు, సిఐ స్వామి పరిశీలించారు.

కాంగ్రెస్ దూకుడు

పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా కో ఆర్డినేటర్ల కేటాయింపు

- మరికొన్ని రోజుల్లోనే అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సమావేశాలకు ప్లాన్
- ఇప్పటికే పలు స్థానిక సంస్థల్లో అవిశ్వాసాల ప్రయోగాలు
- కేడర్‌ను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ భరోసా సమావేశాలు
- ఎత్తులకు పైఎత్తులు వేసుకుంటున్న ఇరుపార్టీలు

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ దూకుడు పెంచింది. పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా నెల క్రితమే ఇన్‌చార్జులను నియమించిన హైకమాండ్ ఇప్పుడు అధికారికంగా వారినే కో ఆర్డినేటర్లుగా కేటాయించింది. మరికొన్ని రోజుల్లోనే అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సమావేశాలకు ప్లాన్ చేసుకుంటున్న తరుణంలో స్థానిక సంస్థల్లో అవిశ్వాస ప్రయోగాలతో క్షేత్రస్థాయిలో రాజకీయాలు వేడెక్కాయి. ఈ క్రమంలోనే కేడర్‌ను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ సమావేశాలు నిర్వహిస్తూ భరోసా కల్పిస్తుండగా... ఎటూ తేల్చుకోలేక పలువురు లోక్‌బాడీ లీడర్లు డోలాయమానంలో పడ్డారు.

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి



సమీపిస్తున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ అడుగులకు వేగం పెంచింది. ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ చైర్మెన్ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ హైకమాండ్ 25 మందిని నియమించింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కో ఆర్డినేటర్లను కేటాయించింది. అందులో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి ఎంపీ సెగ్మెంట్‌కు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని నియమించింది. ఇక మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆయా కాంగ్రెస్ శాసనసభ్యులు తమ కేడర్‌ను సన్నద్ధం చేసుకుంటున్నారు. మరికొన్ని రోజుల్లోనే ఆయా నియోజకవర్గాలవారీగా సమావేశాలు ఏర్పాటు చేసేందుకు హైకమాండ్ సిద్ధమవుతోంది. దీంతో స్థానిక సంస్థల నేతలను తమ పార్టీలో లాగే పనిలోపడ్డట్టు తెలుస్తోంది. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న చోట కొంత కష్టతరంగా ఉన్నా... కాంగ్రెస్ గెలిచిన అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రం ఇప్పటికే చేరికలను ప్రోత్సహిస్తోంది. కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలు మినహా పెద్దపల్లి ఎంపీ సెగ్మెంట్‌లోని అన్ని అసెంబ్లీ స్థానాలనూ కైవసం చేసుకున్న కాంగ్రెస్‌కు అక్కడ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు ఈజీయేనన్న భావనలో ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉండటం, ఇచ్చిన హామీలను సైతం అమలు చేసే దిశగా అడుగులు వేగం చేయడం తమకు కలిసొస్తుందనే ఆశలో ఉండటం గమనార్హం.

పలు స్థానిక సంస్థల్లో అవిశ్వాసాల ప్రయోగాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జమ్మికుంట, కోరుట్ల, పెద్దపల్లి మున్సిపలిటీల్లో అవిశ్వాస రాజకీయాలు వేడేక్కాయి. జమ్మికుంట పాలకవర్గం బలనిరూపనకు ఈనెల 25న అవిశ్వాస తీర్మానానికి కలెక్టర్ నోటీసులు జారీ చేయగా చైర్మెన్ రాజేశ్వర్‌రావు ప్రస్తుతం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. కౌన్సిల్‌లో ఇరువర్గాలకు చెరో 15 మంది సభ్యులు సమానంగాఉండటంతో ఎక్స్ అఫిషియో సభ్యుడు కీలకమైంది. అయితే హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన పాడి కౌశిక్‌రెడ్డి తనకు ఎక్స్ అఫిషియో సభ్యునిగా తన పేరు నమోదు చేయాలని కలెక్టర్‌కు దరఖాస్తు కూడా చేసుకున్నారు. ఈ ప్రక్రియ ఆలస్యమవుతున్న క్రమంలో మున్సిపల్ పాలకవర్గం సాధారణ సమావేశాన్ని నిర్వహించేందుకు సిద్ధంకాగా.. ఎమ్మెల్యేకు కౌన్సిల్ సభ్యునిగా ఆమోదం తెలిపినట్టుగా సమాచారం అందడంతో ఆ సమావేశం రద్దయింది. అయినప్పటికీ ఈనెల 25న జరగబోయే అవిశ్వాస తీర్మాన సమావేశంలో 16మంది సభ్యులతోమెజార్టీ ఉన్న తాము నెగ్గుతామని బీఆర్ఎస్ ఆత్మవిశ్వాసంతోఉండటగా.. చైర్మెన్ ఆస్పత్రిలో చేరడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కోరుట్ల మున్సిపాలిటీలో కూడా కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు హస్తం గూటికి చేరడంతో అక్కడి గులాబీపార్టీకి షాక్ ఇచ్చినట్టయింది.ప్రస్తుతం 8 మంది సభ్యులున్న కాంగ్రెస్‌కు, బీజేపీకి చెందిన నలుగురు, ముగ్గురు స్వతంత్రులు, ఎంఐఎంకు చెందిన మరో ఇద్దరు కౌన్సిల్‌సభ్యులను పార్టీలో చేర్చుకునేందుకు సిద్ధమయ్యారు. వారు చేరితే అవిశ్వాసానికి అవసరమైన బలం చేకూరే పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఇంకోవైపు సుల్తానాబాద్ మున్సిపాలిటీలోనూ చైర్మెన్ ముత్యం సునితరమేష్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా రెవెన్యూ కలెక్టర్ అరుణశ్రీకి అందించారు. 15 మంది కౌన్సిల్ స్థానాల్లో తొమ్మిది బీఆర్ఎస్ ఖాతాలో ఉండగా, ఆరు మాత్రమే కాంగ్రెస్ గూటిలో ఉన్నాయి. దీంతో ఒకపార్టీ నుంచి మరోపార్టీకి జంప్ అవుతున్న ఆ మున్సిపాలిటీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న విజయరమణరావు మాటవైపు తలొగ్గుతున్నారనే వార్తలు వస్తున్నాయి. ఇలా పలు మున్సిపల్, మండల పరిషత్‌లలో అవిశ్వాస తీర్మానాలకు ఉమ్మడి జిల్లాలో రంగం సిద్ధమవుతుండగా.. కేడర్‌ను కాపాడుకునే లపనిలో బీఆర్ఎస్ అధిష్టానం పడింది.

వైన్‌షాప్ అనుమతిని రద్దు చేయాలి

సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం



వినతిపత్రం అందిస్తున్న గుడికందుల సత్యం

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ గాంధీ రోడ్డులోని వైన్‌షాప్ అనుమతిని రద్దు చేయాలని, లేకుంటే మహిళలను ఐక్యం చేసి పోరాటం ఉధృతం చేస్తామని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. సోమవారం స్థానిక గాంధీ రోడ్డులోని మహిళలు బట్టల షాపులు నడిపే ప్రాంతంలో, అత్యధిక శాతం మహిళలు పర్యటించే షాపింగ్ దగ్గర వైన్ షాపుకు అనుమతి ఇవ్వడాన్ని నిరసిస్తూ గాంధీ రోడ్డులోని చిరు వస్త్ర వ్యాపారులు జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం మాట్లాడుతూ.. బట్టల వ్యాపారం చేసుకునే 80కుటుంబాలు 30 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నివసిస్తున్నారని తెలిపారు. అత్యధిక శాతం మహిళలే ఈ షాపులో కూర్చుంటున్నారని, ఎక్కువ శాతం మహిళలు కొనుగోలుకు వస్తారని అలాంటి ప్రాంతంలో వైన్ షాపు, సిట్టింగ్ రూమ్ ఏర్పాటు చేస్తే మందుబాబులకు అడ్డాగా మారి వ్యాపారాలు కొనసాగించలేరని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే అంగన్వాడీ కేంద్రం ఉందని, 100 మీటర్ల లోపు హనుమాన్ మందిరం ఉందని, ఇలాంటి ప్రాంతంలో వైన్ షాపులకు అనుమతి ఇవ్వకూడదన్నారు. నిబంధనలు తుంగలో తొక్కి, లంచాలకు ఆశపడ్డ అధికార యంత్రాంగం ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా వైన్ షాప్‌కు అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గతంలో కలెక్టర్‌కి వినతి పత్రాలు సమర్పిస్తే అనుమతిని నెల రోజుల పాటు ఆపారని, తిరిగి హైదరాబాద్ నుంచి అనుమతి తెచ్చుకున్నారని వ్యాపారస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వైన్ షాపు ఏర్పాటు చేస్తే తమ బట్టల షాపులు నడవయని అధికారులు పెద్ద మనసుతో ఆలోచించి అనుమతి రద్దు చేయాలని కోరారు. వైన్‌షాప్ యజమాని మొండిగా వ్యవహరించి అక్కడే షాప్ పెడితే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించి అనుమతి రద్దయేంత వరకు షాపు యజమానులకు మహిళలకు అండగా ఉండి పోరాడుతామని గుడికందుల సత్యం అన్నారు. స్థానిక కార్పొరేటర్ మెండి శ్రీలత మార్షల్ బట్టల వ్యాపారులకు మద్దతుగా పాల్గొని సంఘీభావం తెలియజేశారు. వైన్ షాప్ అనుమతి రద్దయ్యేంతవరకు ప్రజల పక్షాన ఉంటూ పోరాడతానని మార్షల్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో షాపు యజమానుల సంఘం అధ్యక్షులు వెంకటేశం, మహిళా సంఘం నాయకురాలు కవిత, సీపీఐ(ఎం) నగర కమిటీ సభ్యులు కొంపల్లి సాగర్, పుల్లెల మల్లయ్య, 80 మంది వస్త్ర వ్యాపారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ రోడ్డులో మద్యం దుకాణం పెట్టవద్దు..

కలెక్టరేట్ వద్ద పెట్రోల్ పోసుకుని నిరసన

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం



పెట్రోల్ పోసుకుంటున్న అశోక్

కరీంనగర్ పట్టణంలోని కలెక్టరేట్‌లో ప్రజావాణిలో గాంధీ రోడ్డులో వైన్స్ షాప్ రద్దు చేయాలని కందుల వెంకటేష్ ఆధ్వర్యంలో 20 మంది అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ క్రమంలో కలెక్టరేట్ ఎదుట వెంట పెట్రోల్ బాటిల్ తీసుకుని వచ్చారు. జనావాసం ఎక్కువగా ఉండే ప్రదేశంలో వైన్స్‌కు ఎలా అనుమతి ఇచ్చారని, ఇట్టి దాన్ని రద్దు చేయకపోతే ఆత్మహత్యాయత్నం చేసుకుంటామని మీడియాతో మాట్లాడారు. ఎన్నిసార్లు చెప్పినా దుకాణం తొలగించటం లేదని గాంధీ చౌక్ బట్టల షాప్ యాజమానుల సంఘం సెక్రెటరీ వెంగలదాస్ అశోక్ తనతో పాటు తెచ్చిన పెట్రోల్ శరీరంపై పోసుకోగా ఒకటో పట్టణ పోలీస్ వారు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ - ఇల్లందకుంట

ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులను సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఘనంగా సన్మానించారు. బదిలీ అయిన వారిలో ప్రధానోపాధ్యాయుడు విడుపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రణీతదేవి, సంతోష్ కుమార్, శంకర్ ఉన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్, ఉపాధ్యాయులు చంద్రమౌళి, ప్రభాకర్‌రెడ్డి, రామలక్ష్మి, కిషన్, రవికుమార్, రమేష్, సుజాత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, ఇతర అధికారులు

నవతెలంగాణ - శంకరపట్నం

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నవతెలంగాణ పత్రిక తెలియజేస్తుందని శంకరపట్నం మండల తహసీల్దార్ జోగినిపల్లి అనుపమ అన్నారు. సోమవారం మండల పాత్రికేయుడు దేవునూరి రవీందర్ ఆధ్వర్యంలో నవతెలంగాణ దినపత్రిక 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐలు లక్ష్మారెడ్డి, అరుణ, సీనియర్ అసిస్టెంట్ ప్రీతి, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

మాజీ ఎంపీ వినోద్ కుమార్

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండల కేంద్రంలోని వెంకటేశ్వర మణికంఠ ఆలయ అభివృద్ధికి తనవంతుగా విరాళం అందజేసి కృషిచేస్తానని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయ 9వ వార్షికోత్సవంలో భాగంగా మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. అన్నదాన ట్రస్ట్ ఏర్పాటుకు భక్తులను ప్రోత్సహించి 18లక్షలకు పైగా విరాళాలు వచ్చేందుకు కృషి చేసిన అయ్యప్ప భక్తులకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మిసాంబయ్య, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్‌లు కొత్త గంగారెడ్డి, చీకట్ల రాజశేఖర్, ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నవతెలంగాణ - గంగాధర



గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి రాజు తనిఖీ చేశారు. దుకాణాలలో గల పురుగు మందులు, ఎరువులను, గోదాములలో నిలువ చేసిన ఎరువులు పురుగు మందుల పరిశీలించి శాంపిల్ సేకరించి పరీక్షల నిమిత్తం పంపారు. స్టాక్ పరిశీలించి క్రయ, విక్రయ బిల్లుల రశీదులు పరిశీలించారు.

మృతుడి కుటుంబానికి బియ్యం పంపిణీ

నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని కాట్నపెల్లి గ్రామానికి చెందిన బండారి సంపత్ తల్లి అనారోగ్యంతో మరణించగా సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు మల్లన్న పల్లె కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ కుటుంబానికి బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజు, సంపత్, వినోద్, సంపత్, మహేష్, జనార్ధన్, నవీన్, అంజనేయులు, లక్ష్మయ్య, విగ్నేష్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ - గంగాధర

గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో మాజీ ఎంపీటీసీ పెరుక మల్లారెడ్డి స్మారక క్రికెట్ పోటీలను ఎంపీపీ శ్రీరాం మధుకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెరుక శ్రవణ్ కుమార్, గంగాధర సింగిల్ విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, బీజేపీ నాయకులు తూం నారాయణ పాల్గొన్నారు.

ఎంపీ సంజయ్.. ఐదేండ్లలో ఐదు కొత్తలు తీసుకురాలేదు

- నేను ఎంపీగా ఉన్నప్పడే 2014లో కరీంనగర్ కు రైల్వే ప్రాజెక్టు తెచ్చిన
- కోట్లాడి కరీంనగర్ స్మార్ట్ సిటీ కోసం రూ.వెయ్యి కోట్లు తెచ్చా..
- కాంగ్రెస్ ఇచ్చిన 420హామీలు అమలు చేసేంతవరకూ ఊరుకునేది లేదు
- కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినిపల్లి వినోద్‌కుమార్



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

నవతెలంగాణ - కొడిమ్యాల

'కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ తన ఐదేండ్ల కాలంలో ఈ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఐదు కొత్తలు కూడా కేంద్రం నుంచి తేలేదు. కనీసం రైల్వే ప్రాజెక్టులు, నవోదయ విద్యాలయాలూ తీసుకురాలేదు. నేను ఎంపీగా ఉన్నప్పుడు 2014లోనే కరీంనగర్ రైల్వేప్రాజెక్టులు తీసుకొచ్చిన. కరీంనగర్ స్మార్ట్‌సిటీ కోసం కొట్లాడి రూ.వెయ్యి కోట్లు సాధించాను.' అని కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని కొడిమ్యాల మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే సుంకెరవిశంకర్‌తో కలిసి సోమవారం ముఖ్య కార్యకర్తలతోసమావేశమైన ఆయన మాట్లాడారు. తెలంగాణ రాక ముందు నీళ్ల, విద్యుత్ కోసం రైతులు ఇబ్బంది పడేవారని, రాష్ట్రం ఏర్పాటయ్యాక 7778 మెగావాట్లు ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 26వేలకు పెంచామని గుర్తు చేశారు. సమైక్యపాలనలో ఎక్కడ చూసిన రక్తపాతాలు జరిగేవని,యువకులను నక్సలైట్ల పేరుతో కాల్చి చంపేవారన్నారు. సాగునీళ్ల లేక రైతులు ఆత్మహత్యలు చేసుకునేవారని పేర్కొన్నారు. తరువాత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పరిస్థితులను మొత్తం రూపుమాపామని వివరించారు. ఈ ఏడాది డిసెంబర్ వరకు సీఎం రేవంత్ రెడ్డి 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని..ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు వారం రోజుల ముందుగానే రైతుబంధు కోసం రూ.7700కోట్ల నిధులను సమకూర్చి పెడితే ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. బంగారు పళ్లెంలో పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పగించామని, రాబోయే కాలంలోరాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలందరికి పార్టీ అండగా ఉంటుందని.. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. సమావేశంలో ఎంపీపీ స్వర్ణలత,పీఏసీఎస్ చైర్మన్ రాజనరసింగరావు, ఏఎంసీ చైర్మన్ నరేందర్, సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు కష్టారావు, పూడూర్ ఏఎంసీ చైర్మన్ రవిందర్ రెడ్డి, ఆర్బీఎస్ జిల్లా కోఆర్డినేటర్ అంజనికుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేష్, నాయకులు నాగి శేఖర్, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జమ్మికుంట 6వ వార్డు కౌన్సిలర్‌పై ప్రజావాణిలో ఫిర్యాదు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మున్సిపల్ 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేష్ స్థానిక హౌజింగ్ బోర్డ్ కాలనీలోని జిమ్ పక్కన ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించుకొని అందులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇల్లు నిర్మిస్తున్నాడని మాజీ వార్డు సభ్యుడు రవిచందర్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు గతంలో మండల రెవెన్యూ అధికారి, మున్సిపల్ కమిషనర్, కరీంనగర్ జిల్లా కలెక్టర్, మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ వరంగల్ ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. నేటి వరకు ఈ అక్రమ కట్టడం పైన ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సోమవారం మరోసారి ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోనట్లయితే ఈ నెల 11న జమ్మికుంటలోని గాంధీ చౌరస్తాలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నానని రవిచందర్‌రెడ్డి తెలిపారు.

శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో 'పిరమిడ్ మెడిటేషన్'



నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పిరమిడ్ మెడిటేషన్ ట్రెనింగ్ నీ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. పిరమిడ్ మెడిటేషన్ ట్రెనర్ కే. హరీష్ కుమార్, మెడిటేషన్ మాస్టర్ మెడిటేషన్ క్లాస్ తీసుకున్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ ఓ.మధు, డాక్టర్ డి.సతీష్ కుమార్, పాలనాధికారి పారువెల్ల రామారావు, మీడియా ఇన్‌చార్జి గొంటి రమేష్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ప్రదానం



నవతెలంగాణ - హుజురాబాద్ : స్పందన సేవా సొసైటీ ఆధ్వర్యంలో హుజురాబాద్‌లో రోలింగ్ పాలిషింగ్, డ్రై క్లీనింగ్‌లలో శిక్షణ పొందిన మహిళలకు సోమవారం నాబార్డ్ అధికారులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాబార్డ్ ఏజీఎం జయ ప్రకాష్ మాట్లాడుతూ... మహిళలు ఈ శిక్షణ పొందడం ద్వారా ఆర్థికంగా ఎదుగుతారని వారి కుటుంబాన్ని పోషించుకోవడానికి ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. స్టైఫండ్ చెక్కులను కూడా అందజేశారు. కార్యక్రమంలో స్పందన సేవా సొసైటీ సభ్యులు గౌతమి, కోఆర్డినేటర్ సునీల్, ట్రెనర్ పులుగు లతరెడ్డి పాల్గొన్నారు.

'వాగేశ్వరి'లో మూడు రోజుల వర్క్‌షాప్ ప్రారంభం

నవతెలంగాణ - తిమ్మాపూర్



మాట్లాడుతున్న టాస్క్ ట్రెనర్

మండలంలోని రామకృష్ణ కాలనీ వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సిఎస్సి (ఏఐ, ఎమ్ఎల్) రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రోగ్రామింగ్ ఎసెన్షియల్స్ ఇన్ పాయితాన్ అనే అంశంపై టాస్క్ ఆధ్వర్యంలో మూడు రోజుల వర్క్ షాప్‌ను ప్రారంభించినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. టాస్క్ ట్రెనర్ రత్నప్రియ వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, సిఎస్సి విభాగాధిపతి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్.చంద్రమౌళి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో అక్షర స్కూల్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ - రామడుగు



కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో అక్షర స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 32వ అంతరాష్ట్రీయ ఓపెన్ చాంపియన్‌షిప్ కరాటే 2024కప్‌లో మండలంలోని గోపాలరావుపేట అక్షరస్కూల్ విద్యార్థులు పలు పతకాలు, చాంపియన్‌షిప్ ట్రోఫీని సాధించినట్లు కరస్పాండెంట్ మినుకుల మునిందర్ తెలిపారు. కటాస్‌లో ఆర్.దీక్షారెడ్డి, ఆర్.శ్రీనిధి, బి.సాత్విక, బి.శ్రీనిధి గోల్డ్ మెడల్ సాధించారు. పి.దివ్య, యం.శివబిందు, డి.సిద్ధార్థ సిల్వర్ మెడల్, కె.వేణు, ఇ.శ్రీజ బ్రాంజ్ మెడల్ సాధించారు. నాన్‌చాక్‌లో విభాగంగా ఇ.హర్షిత గోల్డ్ మెడల్, వి.వివేక్ సిల్వర్ మెడల్ సాధించారు. ఆ విద్యార్థులను రామడుగు ఎస్ఐ అభినందించారు.

ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి స్టాఫ్ బాల్ పోటీలకు విద్యార్థిని


విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-చొప్పదండి

ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి స్టాఫ్ బాల్ పోటీలకు చొప్పదండి జడ్పీహెచ్ఎస్ బాలుర విద్యార్థిని ఎంపికైనట్టు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ తెలిపారు. ఈనెల 10న రాజస్థాన్‌లోని బికన్నూరులో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి (అండర్ 17) స్టాఫ్ బాల్ పోటీలలో పాల్గొంటున్న విద్యార్థిని బుర్ర వైష్ణవి (9వ తరగతి) డిసెంబర్ 23 నుంచి 25వ వరకు నిర్మల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి స్టాఫ్ బాల్ పోటీలలో కరీంనగర్ జిల్లా జట్టు నుండి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర జట్టుకు ఎంపికైట్టు పేర్కొన్నారు. తల్లిదండ్రులు బుర్రరవి, బుర్ర లావణ్యలను పాఠశాల ప్రధానో పాధ్యాయులు రాజిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్‌కృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ మమతా, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

గోదావరిలో ఇసుక దోపిడీ

- నదిలో ఇసుక తోడేస్తున్న అక్రమార్కులు
- అభివృద్ధి పనుల పేరిట తరలింపు
- కొరవడుతున్న ఉన్నతాధికారుల పర్యవేక్షణ

నవతెలంగాణ-ధర్మపురి

జగిత్యాల జిల్లా ధర్మపురి పరిధిలోని గోదావరి నదిలో ఇసుక మాఫియాకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. మూడు పువ్వులు ఆరుకాయలు అన్నట్టుగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణా కొంత మందికి కాసుల వర్షం కురిపిస్తుండగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అడిగేవారు.. అడ్డుకునే వారు లేక పోవడంతో ఇష్టారీతిన ఇసుక తవ్వేస్తూ లక్షల్లో దండుకుంటున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు నామాత్రంగా చర్యలతో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోలేక పోతున్నారు.


గోదావరిలో ఇసుక లోడు చేసుకుంటున్న ట్రాక్టర్లు





గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 30 కిలోమీటర్ల దూరం నుంచి బ్యాక్ వాటర్ నిల్వ ఉండడంతో ఇసుక తీయడం వీలు కాలేదు. ప్రస్తుతం ఆరేపల్లి నుంచి దమ్మన్నపేట వరకు 10 కిలో మీటర్ల బ్యాక్ వాటర్ తగ్గడంతో గోదావరిలో ఇసుక దోపిడీ అక్ర మార్కులు చేస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాలైన దొంతపూర్, జైన, రాజారం, దమ్మన్నపేట, ధర్మపురి ప్రాంతాలల్లో ఇసుక అక్రమ రవాణా దారులు రహస్య స్థలాలలో ఇసుక డంపులను ఏర్పాటు చేసుకున్నారు. కానీ రెవెన్యూ, మైనింగ్ శాఖల, అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. పోలీ సులు అప్పుడప్పుడు పెట్రోలింగ్ చేస్తున్నా అక్రమార్కులు చిక్కడం లేదు. ఇసుక ట్రాక్టర్లకు ముందు వెళ్తు పోలీసు ఉంటే డ్రైవర్లకు సమాచారం ఇస్తున్నారు.

ఎటువంటి అనుమతులు లేకుండా గోదావరి నుంచి తీసిన ఇసుకను స్థానికంగా కొన్ని రహస్య స్థావరాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ నుంచి జగిత్యాల తదితర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ధర్మపురి గోదావరి పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక రవాణా చేస్తు ట్రిప్పుకు రూ.4వేల నుంచి 5వేల వరకు సొమ్ము చేసుకుంటున్నారు. మీడియాలో కథనాలు వచ్చినప్పుడు మాత్రమే కొంత ఇసుక రవాణా అగినట్టు కనిపిస్తుంది. కానీ మళ్లీ యథావిధిగా దందా కొనసాగిస్తున్నారు.

ట్రాక్టర్ల స్పీడుతో బెంబేలెత్తుతున్న ప్రజలు

ఉదయం వేళల్లో ధర్మపురి నుంచి నేరెళ్ల వరకు వాకింగ్ చేస్తున్న వారు ఇసుక ట్రాక్టం స్పీడ్ డ్రైవింగ్‌తో ఇబ్బందులు పడు తున్నారు. ఇసుక రవాణాపై అధికారుల దృష్టికి తీసు కెళ్లినా చర్యలు లేవని పలువురు పేర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధుల అండదండలతోనే ఇసుక దందా సాగుతోందనే విమర్శలు వ్యక్తమౌతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇసుక మాఫియా అక్రమ రవాణాపై సమీక్షించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇప్పుడు పర్మిషన్ ఇవ్వలేదు..

గత ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధిత నిర్మాణాలకు కలెక్టర్ ద్వారా ఆర్డర్స్ ఉండడంతో కొంత పర్మిట్ ఇవ్వడం జరిగింది. కానీ ఇప్పుడు ఎలాంటి పర్మిట్లు ఇవ్వడం లేదు.

-కృష్ణ చైతన్య, తహసీల్దార్ ధర్మపురి

మృతుడి కుటుంబానికి పరామర్శ


నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం


నివాళులర్పిస్తున్న జువ్వాడి కృష్ణారావు

ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపుర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కొమ్ముల తుకారం అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మృతదేహంపై కాంగ్రెస్ జెండాను కప్పారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. వెంట కొమ్మిరెడ్డి లింగారెడ్డి, అల్లూరి మహేందర్ రెడ్డి, కాస ప్రశాంత్ పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం


నర్సింగరావుతో నాయకులు

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బీఆర్ఎస్ రైతు నాయకుడు ఐలాపురం భూమరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గుజ్జుల రమేష్ కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ పథకాలు పేద ప్రజలకు సంజీవని లాంటివి అని అన్నారు. ఆయనతో పాటు జెట్టి లింగం అల్లూరి మహేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ భూస రాజేశ్వర్, అలాల వెంకటరెడ్డి, షేక్ మొహమ్మద్, సురేందర్‌రెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న కళ్యాణం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



మండలంలోని యమపూర్ గ్రామంలో వెంకటేశ్వర ఆలయంలో గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వ ర్యంలో నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ తలారి మనిషా ఆనంద్ పాల్గొని అర్చకులు మాధ వాచారి నేతత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎమ్మెల్యేను కలిసిన ముంపు గ్రామ నిర్వాసితులు

నవతెలంగాణ-వేములవాడ రూరల్


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న నిర్వాసితులు

వేములవాడ అర్బన్ మండలం సంకపల్లి గ్రామానికి చెందిన ముంపు గ్రామ నిర్వాసితులు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి తమకు రావలసిన నష్టపరిహారం త్వరగా ఇప్పించ గలరని కోరారు. గ్రామంలో 45 ఇండ్లకు నష్టపరిహారం రావాల్సి ఉందని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పండుగ పరశురాం చింతపల్లి శ్రీనివాసరావు, నిర్వాసితులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఐఎం 2024 ఛాంపియన్ షిప్ గెలుచుకున్న అల్ఫోర్స్ విద్యార్థులు

నవతెలంగాణ-కరీంనగర్



హైదరాబాద్‌లోని శివ శివాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వారు నిర్వహించిన స్టేట్ లెవెల్ మేనేజ్‌మెంట్ మీట్ సమన్వయ్ 2024లో ఓవరాల్ ఛాంపి యన్‌షిప్‌ను స్థానిక ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు గెలుచుకున్నారు. 5,6వ తేదీలలో వివిధ అంశాలలో జరిగిన పోటీలలో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు అడ్వెంచర్స్, బిజినెస్ క్విజ్, ర్యాపిడ్ ఫైర్ తదితర అంశాలలో ప్రతిభ కనబరిచారని, దీంతో పాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌తో పాటు క్యాష్ ప్రైజ్ గెలుచుకున్నారని తెలిపారు. ఈ వేడుకలలో హీలియం బెలూన్స్‌ని గాలిలో ఎగురవేసి కేక్ కట్ చేసి కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి అభినందించారు. ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.విజయలక్ష్మి, జి.చంద్ర శేఖర్‌రెడ్డి, మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకులు శ్రీనివాస్, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెకు రాని బస్సు



నవతెలంగాణ-ఎండపల్లి

ఆర్టీసీ బస్సు చేరని గ్రామాలు ఈ రోజుల్లో కూడా అనేకం ఉన్నాయి. ప్రతి గ్రామానికి బస్సు నడిపించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. రోడ్డు మార్గం ఉన్నా, కొన్ని గ్రామాలకు బస్సు నడపడంలో ఆసక్తి కనబర్చడం లేదు. బస్సు నడపాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు

ఎండపల్లి మండల పరిధిలోని కొండాపూర్, జగదేవుపేట గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పల్లెవెలుగు బస్సులు మారుమూల పల్లెలకు కాకుండా జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకే పరిమిత మవుతున్నాయి. దీంతో కొండాపూర్, జగదేవుపేట గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, రైతులు జిల్లా కేంద్రం జగిత్యాల, కరీంనగర్‌తో పాటు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు.

కాలినడకనే శరణ్యం...

మండంలంలోని గ్రామాలకు బీటీ రోడ్డు లేకపోడంతో ఆర్టీసీ బస్సు ఆ గ్రామాలకు వెళ్లడం లేదు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఎనిమిది మీటర్ల చొప్పున కాలినడకన వస్తున్నారు. ఆర్టీసీ బస్సు నడవకపోవడంతో ప్రయివేట్ వాహనాలను ఆశ్రయి స్తున్నారు. ప్రయివేట్ వాహనాల్లో రాకపోకలు నిర్వహించడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. అత్యవసర సమయాల్లోనైతే నానా అవస్థలు పడావల్సిన పరిస్థితి ఉందని ప్రయాణీకులు వాపోతున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అల్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కోరుతున్నారు.

ఏండ్లు గడుస్తున్నా బస్సు రావడం లేదు..



గ్రామానికి రవాణా సౌకర్యం లేదు. జగిత్యాల వెళ్లాలంటే మా గ్రామం నుంచి చర్లపల్లి వరకు వెళ్లాలన్న 2 కిలోమీటర్ల దూరం. కరీంనగర్‌లో ఆస్పత్రికి వెళ్లాలంటే ఎండపల్లి మండల కేంద్రానికి 7 కిలోమీటర్లు నడవాల్సి పరిస్థితి. అధికారులు మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి.

-లింగపల్లి లక్ష్మణ్ , ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఏడు కిలో మీటర్లు నడుస్తున్నాం..



మా గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఏడు కిలో మీటర్లు నడవాల్సిందే.. ఎండపల్లి నుంచి కొండాపూర్ గ్రామాల మధ్య ఉన్న కల్వర్ట్ మరమ్మతు నిర్మాణం చేపట్టి, మా ఊరికి బస్సు సౌకర్యం కల్పించాలి.

-ప్రమోద్ గౌడ్, గ్రామస్తులు

రెండు సంవత్సరాల నుంచి రావడం లేదు..



రెండు సంవత్సరాల క్రితం మా గ్రామానికి చెర్లపల్లి నుంచి జగదేవ్‌పేట, అక్కడి నుంచి కొండాపురం గ్రామానికి బస్సు వచ్చేంది. కానీ ప్పుడు రోడ్డు బాగా లేకపోవడంతో మా ఊరికి బస్సు రావడం లేదని అధికారులు అంటున్నారు. రోడ్లు మరమ్మతులు చేపట్టి, బస్సు సౌకర్యం కల్పించాలి.

-ఇప్పల నాగరాజు, వార్డు సభ్యులు కొండాపూర్

అల్ఫోర్స్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



నవతెలంగాణ-జగిత్యాల టౌన్

సంక్రాంతి పండుగ చాలా విశిష్టమైనదని, ప్రత్యేకంగా రైతులు శ్రేయస్సును సూచిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని శివవీధి, కృష్ణనగర్‌లోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్లో అట్టహాసంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మహావిష్ణువు, గౌరీ మాత విగ్రహాలకు పూలమాలవేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక, పండుగలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు వివిధ రంగురంగుల సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి పండుగ వాతావరణం రెట్టింపు చేశారు. పల్లె వాతావరణం కన్నులకు కట్టే విధంగా ఏర్పాటు చేసినటువంటి పోలం పిండి వంటలు తయారీ, నాటు వేయడం గంగిరెద్దుల ఆటలు బసవన్న చేష్టలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్యాల: సంక్రాంతి పండుగ కాంతిని వెదజల్లే పండుగ, ఇతర ఆడపడుచులకు చాలా ప్రత్యేకమైన పండుగని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని స్థానిక మల్యాల క్రాస్ రోడ్డులో గల అల్ఫోర్స్ టెక్నో స్కూల్‌లో వేదమంత్రాలతో ఆల్ఫోర్స్ మకర సంక్రాంతి ఉత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నరేందర్ రెడ్డి విచ్చేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీమహావిష్ణువు, గౌరీ మాత విగ్రహాలకు పూజ కార్యక్రమాలు జరిపి వేడుకలను చాలా గొప్పగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ ఎదురుగా ఉండే తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడ.?

నవతెలంగాణ-కరీంనగర్


మాట్లాడుతున్న సర్దార్ రవీందర్ సింగ్

కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని తొలగించడం జరిగిందని, తొలగించిన తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడ ఉందో ఎవరికి అంతుపట్టడం లేదని మాజీ మేయర్ రవీందర్ సింగ్ అన్నారు. కరీంనగర్ తారక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రతి ఉద్యమకారుడు తెలంగాణ తల్లికి దండ వేసి దండం పెట్టుకున్న తర్వాతనే ఉద్యమంలో భాగస్వాములు అయ్యారన్నారు. స్వయంగా రాష్ట్ర మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేసి ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం అది అని తెలిపారు. కరీంనగర్ నగరంలో ఎక్కడ ఉందో ఆంధ్ర అధికారులు ఎక్కడ దాచిపెట్టినారో సమాధానం చెప్పాలన్నారు. ఒకేరోజు పనుల ప్రారంభించిన ఇందిరా గాంధీ విగ్రహం తెలంగాణ చౌక్‌లో ప్రారంభమైంది అదే రోజు పనులు ప్రారంభించిన తెలంగాణ తల్లి విగ్రహం పనులు ఎందుకు పూర్తి అవడం లేదు అని అన్నారు. దీనిలో ఎవరి కుట్ర ఉంది కాంగ్రెస్, బీజేపీ కుట్రలు ఏమైనా ఇందులో ఉన్నాయా అధికారులు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆంధ్ర అధికారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా పాలన అధికారిని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. సమావేశంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, మేకల చంద్రశేఖర్ యాదవ్, తివారి, తూల భాస్కరరావు, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆరు నెలల మెస్ బిల్లులు పెండింగులో ఉన్నాయని, మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ ప్రభు త్వం బిల్లులు చెల్లించి సంక్రాంతిని సంతోషంగా జరుపుకోనివ్వాలని ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేపట్టి, కలెక్టరేట్ ఆఫీసులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూతారి రాములు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న ఆరు నెలల పెండింగ్ వేతన బిల్లులు ఇంత వరకు అందలేదని, నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కూడా సమస్య పరిష్కరించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు అలాగే నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతున్న తరుణంలో మెస్ చార్జీలు ఒక విద్యార్థికి 25 రూపాయలు పెంచాలన్నారు. ప్రభుత్వం కోడిగుడ్డుకు రూ.5 రూపాయలు ఇస్తే మార్కెట్లో ఏడు రూపాయలు పెట్టి కొనవలసి వస్తుందన్నారు. ఈ గుడ్లను వారంలో మూడు సార్లు పెట్టాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, వంట కార్మిక సంఘ నేతలు మునుగోరి హనుమంతు, వెన్న మహేష్, చుక్క లక్ష్మీరాజం, సంగారం భూమయ్య, చొప్పరి గంగాధర్, కొంకా భాగ్య, కూనా సరస్వతి, చెన్నవేణి దశరథం, బెక్కం లత, అగ్గిమల్ల రాధ, రజియా, లక్ష్మి, గంగు, భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గారం సర్పంచ్, పాలకవర్గాన్ని సస్పెండ్ చేయండి

- నిధుల దుర్వినియోగానికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోండి
- జగిత్యాల కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గాన్ని తక్షణమే సస్పెండ్ చేయాలని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, వీడీసీ కోర్ కమిటీ కో చైర్మన్ పెద్ధనవేని రాగన్న ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీలో భారీగా నిధులు దుర్వినియోగం జరిగాయని, పలు సార్లు విచారణ జరిపినా అధికారులు 11 చలాన్‌ల ద్వారా రూ.4,58,924.రికవరీ కూడా చేశారని పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగానికి సహకరించి తప్పుడు, దొంగ తీర్మానాలు చేసిన వార్డు సభ్యులను, పంచాయతీ కార్యదర్శిని, బాధ్యులైన సంబంధిత అధికారులను కూడా వెంటనే సస్పెండ్ చేసి ఇలాంటి ఘటనలు మరెక్కడా జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు అవినీతికి పాల్పడే ఇలా నిర్లక్ష్యం చేస్తున్నట్లు మాకు అనుమానంగా ఉందని వారు ఆరోపించారు. దుర్వినియోగం అయిన మొత్తం సొమ్ము తగు వడ్డీతో సహా రికవరీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఈ నెల 2న గత పంచాయతీ కార్యదర్శి మహబూబ్ పాషాను మాత్రమే సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్‌ల హయాంలో యావత్ తెలంగాణ రాష్ట్రంలోనే జీపీలో ఇంత భారీ మొత్తం నిధుల దుర్వి నియోగం బయట పడడం, బాధ్యులు నాలుగేండ్లుగా సస్పెండ్ కాకుండా ఉండడం,ఈ ఘటన అధికారుల, జిల్లా ఉన్నతాధికారుల ప్రవర్తానా, వారి పని తీరు పలు విమర్శలకు, పలు అనుమానాలకు కూడా తావిస్తోందన్నారు.

విద్యుత్ బకాయిల్లో నిర్లక్ష్యం వద్దు

నవతెలంగాణ-హుజూరాబాద్

విద్యుత్‌శాఖలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను వసూలు చేయడంలో నిర్లక్ష్యం వద్దు అని కరీంనగర్ ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలో విద్యుత్‌శాఖ అధికారులు, ఉద్యోగులతో సమీక్షించారు. హుజురాబాద్ డివిజన్‌లో ఉన్న విద్యుత్ బకాయిల వసూలు విషయంలో సంబం ధిత ఉద్యోగులు అశ్రద్ధ చూపరా దన్నారు. ఈ సమావేశంలో డీఈ లక్ష్మారెడ్డి, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు వీరాచారి, శ్రీనివాస, రవీందర్, ఆంజనేయులు, సంపత్‌రెడ్డి, కుమార స్వామి పాల్గొన్నారు.

గురుకులాల పెండింగ్ బిల్లులను చెల్లించాలి

నవతెలంగాణ-చొప్పదండి

చొప్పదండి సాంఘిక సంక్షేమశాఖ గురుకుల కళాశాలలో పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలిక గురుకుల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సంబోజీ శేఖర్, ప్రధాన కార్యదర్శి సానాది వెంకటేష్, కోశాధికారి బూత్కూరి శంకర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కోరారు. సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ప్రజావాణికి 184 ఫిర్యాదులు

నవతెలంగాణ-కరీంనగర్


దరఖాస్తు చేస్తున్న అర్జీదారులు

జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం దిశగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా 184 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 184 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.

జాతీయ స్థాయి క్రీడలతో ఖ్యాతి

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్


విద్యార్థిని అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొనడం ద్వారా ఖ్యాతి లభిస్తుందని, పోటీ పరీక్షలకు ఎంతగానో ఉపకరిస్తుందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన సందర్భంగా అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ..జాతీయ క్రీడా అయిన హాకీ పట్ల ప్రతి ఒక్కరు ఆసక్తి ప్రదర్శించాలన్నారు. ఇటీవల కాలంలో హైద్రాబాద్‌లోని జిమ్ఖ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర హాకీ అసోసియేషన్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి ఎంపిక పోటీలలో పాఠశాలకు చెందిన ఎ.కృతిక్ పటేల్ 4వ తరగతి, అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడమే కాకుండా త్వరలో రాజస్థాన్‌లో నిర్వహింపబడే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు వార్తలపై ఫిర్యాదు

నవతెలంగాణ-కరీంనగర్

రెండు సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై దిష్టి బొమ్మ దహనం చేసిన ఫోటోను సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసినట్టు తప్పుడు వార్తను సోషల్ మీడియాలో వే టు న్యూస్ పేరు మీద పోస్టు చేసిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు టౌన్ ఏసీపీకి, టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగే విధంగా పోస్టు చేసిన వారిని వెంటనే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సమద్ నవాబ్, శ్రవణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, ఖిరొద్దీన్, ముక్క భాస్కర్, షేక్ శేహెన్షా, అష్రఫ్, దండి రవీందర్, పోరండ్ల రమేష్, షబానా మహమ్మద్, హనీఫ్ తదితరులున్నారు.

సీనియర్ జర్నలిస్టును పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



నవతెలంగాణ - వేములవాడ రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వేములవాడ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు పాశం భాస్కర్‌రెడ్డిని సోమవారం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదం జరిగిన తీరును, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట సీనియర్ జర్నలిస్టు రేగుల దేవేందర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, పుట్టపాక లక్ష్మణ్, కొలిపాక నర్సయ్యతో పాటు జర్నలిస్టులు శ్రీనివాస్, రవి, శ్రీకాంత్, స్వామి, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- సిరిసిల్ల జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

నవతెలంగాణ - సిరిసిల్ల

ముంపు గ్రామాలలోనీ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని, జిల్లాలో ప్రజల జీవనోపాధికి కుటీర, ఇతర పరిశ్రమలను ఏర్పాటుకు అధికారులు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధిపై సిరిసిల్లలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధికారులు తమ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వాటి ప్రగతి, పెండింగ్ అంశాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్త సంవత్సరం కొత్త ఆలోచనలతో కొత్త ప్రభుత్వం కొలువుతీరిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలుకు ప్రజా పాలనకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నామని తెలిపారు. ఆరు గ్యారంటీలను 100రోజుల్లో అమలు చేస్తామని సీఎం ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారనీ చెప్పారు. ప్రజాప్రతినిదులు, ప్రభుత్వ అధికారుల సహకారం ప్రజా భాగస్వామ్యంతో జిల్లా అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రైతులు నష్టపోకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రతీ గ్రామంలో వరి ధాన్యం నిల్వలకు ఒక గోదాం ప్రతిపాదన తేవాలన్నారు. ఎంతో ఖర్చును వెచ్చించి మిషన్ భగీరథ ద్వారా తాగునీటి నీ సరఫరా చేస్తున్నా దానిని ప్రజలు తాగేందుకు ఇష్టపడడం లేదన్నారు. గ్రామాల్లో కళజాతాలు, వీడియో డాక్యుమెంటరీల సహాయంతో క్షేత్ర స్థాయిలో మిషన్ భగీరథ నీటి పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని చెప్పారు. వచ్చే సంక్రాంతి నుంచి జిల్లాలో ముదిరాజులు, గంగపుత్రులలోని మహిళలను భాగస్వామ్యం చేసి ప్రతి గ్రామం నుండి ఒక మత్య సహకార మహిళా సొసైటీ ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వ సూచించారు. రుద్రంగి, వీర్నపల్లి, బండలింగంపల్లిలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణానికి వీలుగా స్థలాలను గుర్తించాలన్నారు. శ్వాస కోశ సమస్యలు వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా జిల్లాలో అటవీ నర్సరీల్లో కోనో కార్పస్ మొక్కలను పెంచవద్దని చెప్పారు. ఇప్పటికే నాటిన మొక్కల స్థానంలో ప్రత్యామ్నాయ మొక్కలను నాటే విషయం పరిశీలించాలని సూచించారు. ప్యాకేజీ - 9 పెండింగ్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి ఆయకట్టుకు సాగునీరు అందించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మోత్కు రావు పేట - చందుర్తి రోడ్డు కు అటవీ అనుమతులు , సహా అన్ని ప్రతిబంధకాలు తొలగినందున వెంటనే రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని ప్రభుత్వ సంబంధిత ఇంజనీర్లు ఆదేశించారు. మూల వాగు పై నిర్మిస్తున్న వేములవాడ -తిప్పాపూర్ వంతెనను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఎర్ర చెరువు,పటేల్ చెరువు రిజర్వాయర్ గా మార్చి గ్రావిటీ ద్వారా గ్రావిటీ ద్వారా నీటి సరాఫరాపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ జిల్లాను అన్ని విధాలుగా అభివృధి చేసేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు ఎన్.ఖీమ్యా నాయక్, పూజారి గౌతమి, ఆర్డీఓలు ఆనంద్ కుమార్, మధుసూదన్, ప్రత్యేక ఉప కలెక్టర్ బి.గంగయ్య, జెడ్పీ సీఈఓ గౌతమ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆది శ్రీనివాస్

రైతులకు నాణ్యమైన సేవలు అందించండి...

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

నవతెలంగాణ - వేములవాడ రూరల్

సిరిసిల్ల విద్యుత్ సహకార సంస్థ అందిస్తున్న సేవలు బాగున్నాయని, రైతుకు అందించే సేవలు కూడా నాణ్యమైనవిగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో సెస్ కార్యాలయాన్ని పునరుద్ధరించగా సోమవారం ఆయన కార్యక్రమానికి హాజరై ప్రారంభించి మాట్లాడారు. నూతన పాలకవర్గం పాలనను గాడిలో పెట్టినప్పటికీ అవకతవకాలు తప్పిదాలపై కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రభుత్వపరంగా సెస్‌కు కావాల్సిన సహాయ సహకారాలు అందించడానికి తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని వారికి చెప్పారు. బోరు బావుల వినియోగం కూడా పెరిగిందని తద్వారా విద్యుత్ వినియోగం పెరిగినందున రైతులకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సబ్ స్టేషన్ల ఏర్పాటు కూడా అవసరమని ఇందుకు అవసరమైన ప్రతిపాదనలన్నీ సిద్ధం చేస్తే తాను ప్రభుత్వం నుండి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఎండి రామకృష్ణ, డీఈ శ్రీనివాస్, ఏడీలు శ్రీధర్, రమేశ్, సెస్ డైరెక్టర్లు నామాల ఉమా, రేగులపాటి హరిచరణ్‌రావు, ఆకుల దేవరాజం, ఆకుల గంగారం, సుధాకర్, కౌన్సిలర్లు అన్నారం ఉమారాణి, బింగి మహేశ్, సెస్ వినియోగదారుల ప్రతినిధి వెంకట్ యాదవ్, ఏఈ సిద్ధార్థ, నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

నవతెలంగాణ - సిరిసిల్ల

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో స్పందించి సత్వర పరిష్కారం చూపాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్లు పి.గౌతమి, ఎన్.ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన 12 ఫిర్యాదులను, వినతులను ప్రజల నుంచి స్వీకరించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని, తిరస్కరించిన పక్షంలో అందుకు గల కారణాలను అర్జీదారుడికి తెలియజేస్తూ లిఖితపూర్వక వివరణ అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు ఆనంద్ కుమార్, మధుసూధన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పేదలు ఇల్లు కట్టుకోవడానికి ఇసుకకు అనుమతి ఇవ్వాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇల్లు కట్టుకునే పేద ప్రజలకు ఇసుక చేరాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మటి నర్సయ్య సోమవారం అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ పేదలు ఇల్లు కట్టుకుంటే ఇసుక అందుబాటులో ఉంటుందని అన్నారు. రెవెన్యూ అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు ఎన్ని ట్రిప్పులకు పర్మిషన్లు ఇచ్చిన అభ్యంతరం లేదన్నారు. అలాగే పోలీసులు కూడా పేద ప్రజలకు ఇసుక చేరేటప్పుడు ఎలాంటి ఇబ్బంది కలగజేయవద్దన్నారు. ఇసుక డంపులు, టిప్పర్ల ద్వారా జరిగే సరఫరాను అరికట్టాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శులు వంగ గిరిధర్‌రెడ్డి, లింగం గౌడ్, మండల ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపిటిసి కొత్తపల్లి దేవయ్య, సూడిది రాజేందర్, ఎండి రఫీక్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నవతెలంగాణ - వేములవాడ రూరల్ : నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై వేములవాడ ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్ ఆధ్వర్యంలో స్పెషల్ తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్ అమర్చాలని దిలీప్ కోరారు. నెంబర్ ప్లేట్ లేకున్నా నెంబర్ ప్లేట్ సరిగ్గా లేకున్నా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలకు అక్కడే ఉన్న ఓ షాప్ నుండి నెంబర్ ప్లేట్ తీసుకువచ్చి అమర్చారు.

ముచ్చర్లలో భారత్ సంకల్ప యాత్ర

నవతెలంగాణ - గంభీరావుపేట : గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామంలో భారత్ సంకల్ప యాత్రను సోమవారం నిర్వహించారు. కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహనా కార్యక్రమాన్ని ఎల్ఈడీ తెరపై వీక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వంగ స్వప్నరవీందర్‌రెడ్డి, గాదం లింగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుప్రజ, సీహెచ్ఓ రమేష్, గ్రామ సెక్రటరీ శ్రీధర్, ఏఈఓలు పాల్గొన్నారు.

జిల్లాలో 'మిషన్ 80' సూపర్ సక్సెస్

- కలెక్టర్ ప్రత్యేక చొరవతో అమలు
- ప్రభుత్వ ఆస్పత్రులలో 80 శాతం పెరిగిన ప్రసవాలు
- 6 నెలల క్రితం కేవలం 56 శాతమే..
- పేదలపై తగ్గిన ఆర్థిక భారం

నవతెలంగాణ - సిరిసిల్ల



జిల్లా ఆస్పత్రిలో గర్భిణులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జిల్లా, ఏరియా ఆస్పత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంస్థాగత ప్రసవాల సంఖ్యను 80శాతానికిపైగా పెంచాలన్న లక్ష్యంతో 6 నెలల క్రితం కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేకంగా చేపట్టిన మిషన్ 80 సూపర్ సక్సెస్ అయ్యింది. ప్రభుత్వ ఆస్పత్రులలో సంస్థాగత డెలివరీతో పాటు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం ద్వారా పేదలపై ఆర్థిక భారాన్ని తగ్గించడం, అనారోగ్యం బారిన పడకుండా చూడడం ఈ మిషన్ 80 ముఖ్య ఉద్దేశం. జిల్లాలో గత సంవత్సరం జులై 1న ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

లక్ష్య సాధన కోసం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. హై రిస్క్ కేసుల తప్ప మిగతా కేసులను మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన సదుపాయాలు పెంచడంతో పాటు, వైద్యులను ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారు. మరో వైపు ఏఎన్ఎం, ఆశాలు గర్భిణులకు ఏఎన్‌సి చెకప్‌లు చేయించేలా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాలు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ఏఎన్ఎంలు, ఆశాల ద్వారా వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సదుపాయాల వివరాలను తెలియజేశారు. సాధారణ ప్రసవం వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణులకు తెలియజేస్తూ, సుఖ ప్రసవానికి అవసరమైన వ్యాయామాలను సిబ్బంది దగ్గరుండి చేయించారు.

మాతృసేవాతో మరింత చేరువ...

ప్రత్యేక డ్రెస్‌కోడ్‌తో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి, జిల్లా ఆస్పత్రితో పాటు వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మాతృసేవా కార్యక్రమాన్ని అమలు చేస్తూ గర్భిణులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా అన్ని సేవలను అందిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎన్ క్వాస్ సర్టిఫికెట్ వచ్చేలా కృషి చేస్తూ ఆస్పత్రుల బలోపేతం చేస్తున్నారు. ఫలితంగా గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరిగింది.

ప్రభుత్వ ఆసుపత్రులలో 80శాతం పెరిగిన డెలివరీలు

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో అమలు చేస్తున్న మిషన్ 80 మంచి ఫలితాలను ఇస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రులలో సంస్థాగత ప్రసవాలు సగటు కేవలం 50శాతంలోపే ఉండగా ఫిబ్రవరి నెలలో 54 శాతం, జూన్ నెలలో 63 శాతం పెరిగింది. జులైలో 71శాతం, అక్టోబర్ , నవంబర్‌లో 77 శాతం చేరుకోగా డిసెంబర్ -2023లో 80శాతానికి చేరుకుంది.

కలెక్టర్ ప్రత్యేక చొరవతోనే...

డాక్టర్ సుమన్ మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి, రాజన్న సిరిసిల్ల జిల్లా



జిల్లాలోని జిల్లా, ఏరియా ఆస్పత్రితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంస్థాగత ప్రసవాల సంఖ్యను 80శాతానికిపైగా పెంచాలన్న లక్ష్యంతో 'మిషన్ 80' చేపట్టారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి నిరంతర పర్యవేక్షణ, ఓ వైపు క్షేత్ర సిబ్బందితో గర్భిణులను, వారి కుటుంబ సభ్యులను ఆ దిశగా చైతన్యం చేయడం, మరో వైపు ప్రభుత్వ ఆస్పత్రులలో మౌలిక సదుపాయాలు పెంపుదలతో లక్ష్యానికి చేరువయ్యాం. గత నెల 80 శాతం ప్రసవాల లక్ష్యం చేరుకున్నాం. పేదలపై ఆర్థిక భారాన్ని తగ్గించడం, అనారోగ్యం బారిన పడకుండా చూడగలిగాం.

ధర్నాలతో దద్దరిల్లిన సిరిసిల్ల కలెక్టరేట్

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన
- సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల నిరసన



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



నిరసన వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నాలతో దద్దరిల్లింది. సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్నం భోజన కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు వేరువేరుగా ధర్నాలు నిర్వహించి నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. నాలుగు నెలల నుండి పెండింగ్ బిల్లులు, వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 20వ తేదీ నుండి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మధ్యాహ్న భోజన కార్మిక జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, పంతం రవి, జుబేదా, రాజవ్వ, సాయిలు, మనమ్మ, లక్ష్మి నరసవ్వ, రాజేశ్వరి,సునీత, లక్ష్మి, మైసవ్వ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం మిషన్ సదుపాయాన్ని కల్పించి ప్రతి నెల రూ.5000 చెల్లించాలన్నారు. ప్రమాద బీమా 10 లక్షలు ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న కార్డులు తొందరగా మంజూరు చేయాలన్నారు. కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అధ్యక్షుడు గాజుల పోశెట్టి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, బొల్లె బాబు రాజన్న,శీలం నరసయ్య, కార్మికులు పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఆరు నెలల శిక్షణకు ట్రైనీ ఐపీఎస్



నవతెలంగాణ - సిరిసిల్ల : ఆరు ప్రాక్టికల్ నెలల శిక్షణకు 2022 బ్యాచ్ రాహుల్‌రెడ్డి ఐపీఎస్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లాకు కేటాయించగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వద్ద రిపోర్ట్ చేశారు. 2022 బ్యాచ్ తెలంగాణకు చెందిన రాహుల్‌రెడ్డి బి.టెక్ పూర్తి చేసి సివిల్ సర్వీసెస్ ద్వారా తెలంగాణ క్యాడర్ ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆరు నెలల పాటు వివిధ విభాగాల్లో ఆయన ప్రాక్టికల్ శిక్షణ పొందనున్నారు.

బాధిత కుటుంబానికి నందికొండ ట్రస్ట్ సహాయం



నవతెలంగాణ - గన్నేరువరం : గునుకుల కొండాపూర్ పరిధిలో చొక్కల ఎంకవ్వ, ఊట్ల పోచవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాలను నందికొండ ట్రస్టు నిర్వాహకులు నందికొండ తిరుపతిరెడ్డి, సభ్యులు, నాయకులు పరామర్శించి 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. గ్రామ సర్పంచ్ లింగంపల్లి జ్యోతి, బాలరాజు, మానకొండూర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ తాళ్లపల్లి రవికుమార్ గౌడ్, నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, శ్రీనివాస్, మల్లయ్య, సంపత్, మహేష్ పాల్గొన్నారు.

సిరిసిల్ల జిల్లాలో 7 పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్

తక్కువ సమయంలో ఎక్కువ ఆస్పత్రులు చేజిక్కించుకున్న జిల్లాగా రాజన్న సిరిసిల్లకు ప్రత్యేక గుర్తింపు

పీహెచ్‌సీలకు మూడేండ్లలో రూ.9లక్షల చొప్పున కేంద్ర నిధులు



తంగళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నవతెలంగాణ - సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎన్ క్వాస్ సర్టిఫికెట్ లభించింది. తక్కువ సమయంలో ఎక్కువ ఆస్పత్రులు ఎన్ క్వాస్ సర్టిఫికెట్ చేజిక్కించుకున్న జిల్లాగా రాజన్న సిరిసిల్లకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు లభించింది. నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్ సెంటర్ (ఎన్‌హెచ్ఎస్ఆర్సీ) నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను చేరుకుంటే ఎన్ క్వాస్ సర్టిఫికెట్ వస్తుంది. దీనికి మూడేండ్ల వ్యాలిడిటీ ఉంటుంది. ఆస్పత్రి అభివృద్ధికి కేంద్రం నుంచి ప్రతి సంవత్సరం రూ.3 లక్షల చొప్పున 9 లక్షలు రానున్నాయి.తద్వారా మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. ఇదివరకే కోనరావుపేట, తంగళ్ళపల్లి, బోయినిపల్లి, కొదురుపాక, పిఎస్‌నగర్ అర్బన్, నేరెళ్ళ, విలాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ లభించింది. ఆ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు ధ్రువపత్రాలు అందాయి. లింగన్నపేట, హన్మాజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి ఎన్‌క్వాస్ పనులు పూర్తి అయ్యాయి. జిల్లాలో ఒక్క అంబేద్కర్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత్రమే మిగిలి ఉంది. ఫలితంగా మౌలిక వసతులు పెరిగాయి. విలువైన వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఓపీ, ఐపీ, సర్జికల్ ఇలా అన్ని విభాగాల్లో నాణ్యత పెరిగింది. జిల్లాలో 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పటికే ఎన్‌క్వాస్ లభించడం, మిగతా 2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎన్‌క్వాస్ పనులు పూర్తి కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ సంపూర్ణ సహకారం వల్లే...

డాక్టర్ సుమన్ మోహన్ రావు జిల్లా వైద్యాధికారి రాజన్న సిరిసిల్ల జిల్లా

జిల్లా కలెక్టర్ సహకారం వల్లే ఇప్పటి వరకూ జిల్లాలోని 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ వచ్చింది. ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ వచ్చిన ఆస్పత్రులకు మూడేండ్లలో ప్రభుత్వం నుంచి తొమ్మిది లక్షల రూపాయలు అదనంగా రానున్నాయి. తద్వారా పేద ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందే సౌలభ్యం కలగనుంది.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకమని, రాబోయే రోజులలో ఎస్ఎస్‌సీలో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడులలలో విద్యను అభివృద్ధి చేసే కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉన్నదని, ఉపాధ్యాయులకి స్నేహపూర్వకముగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దొర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రమానాథ్‌రెడ్డి, నాయకులు పూరెల్లి రవీందర్, పురం వాసుదేవరావు, మాల్లారపు పురుషోత్తం, విక్కుర్తి అంజయ్య, నూగూరి దేవేందర్, పార్వతి తిరుపతి, బూస రాజేందర్, రామచంద్రం, భాస్కర్, కదిరి శ్రీనివాస్, రాంబాబు, రహ్మాన్ పాల్గొన్నారు.

సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే..

సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్



నవతెలంగాణ - సిరిసిల్ల

ప్రజల వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుండి 3గంటల వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తామని సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 12 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్పీతో ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు



కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ ఉపేందర్

నవతెలంగాణ - సిరిసిల్ల

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామనిపట్టణ సి.ఐ ఉపేందర్ హెచ్చరించారు. 10రోజుల్లో సిరిసిల్ల పట్టణ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 18 మందికి ఒక రోజు జైలు శిక్ష, 3000 రూపాయల జరిమాన, ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష, 3000 రూపాయల జరిమానా, 19మందికి 3000 రూపాయల జరిమాన విధిస్తూ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు పట్టణ సి.ఐ ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తులకు తాగి వాహనాలు నడిపడం వల్ల జరిగే అనర్థాల గురించి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా వస్తువులు అందజేత



నవతెలంగాణ - బోయినిపల్లి

బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వార్డ్ సభ్యులు క్రీడాకారులకు ఆట వస్తువులు అందజేశారు. నాయకులు బాలమల్లు, పటకుల శ్రీనివాస్, వెంకటేష్, అజెయ్, పరుశురాం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-గోదావరిఖని:
ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్ రామగుండం భూ నిర్వాసితుల, ప్రభావిత ప్రాంతమైన రామగుండం కార్పొరేషన్ 5వ డివిజన్‌లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని సోమవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మొహ్మద్ రహీం వినతి పత్రాన్ని సమర్పించారు. గోదావరి నదిపై కరకట్ట నిర్మించాలని, బ్యాక్ వాటర్ వచ్చే కాలువలను డైవర్షన్ చేయాలని, స్థానిక టీవీఎస్ షోరూం నుంచి ఓసీపీ-4 రోడ్డు వరకు 40 ఫీట్ల విస్తరణ చేసి రోడ్డుకు ఇరువైపులా ఎల్ఈడీ లైటింగ్ ఏర్పాటు చేయాలని, ఎన్టీపీసీ ప్లాంట్ నుంచి వచ్చే వృధా నీటి కాలువ మల్కాపూర్ రోడ్డు బ్రిడ్జీ కాకతీయ కాలేజీ వద్ద ప్రమాదకరంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని, కాలువ వద అడ్డంగా గోడలు నిర్మించి, బ్రిడ్జీ నిర్మించాలని, తదితర సమస్యలపై ఈ వినతి ద్వారా విన్నవించారు.


కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు రహీం

విద్యుత్ సమస్యలపై విద్యుత్ శాఖ డీఈ పరిశీలన

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ పరిధిలో ఉన్న పలు విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సూపరిండెంట్ ఇంజనీర్ సుదర్శనం ఆదేశాల మేరకు డీఈ శివరాములు సమస్యలను పరిశీలించారు. అతి త్వరలోనేలో ఓల్టేజ్ సమస్యలు పరిష్కారం చేసి అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి వినియోగ దారులకు ఎలాంటి సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందిస్తామని డి అన్నారు.



సమస్యలపై ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు రామగుండం నగర పరిధిలో ఎదురవుతున్న పలు ప్రధాన సమస్యలపై ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ సోమవారం వినతి పత్రాన్ని సమర్పించారు. సుందిళ్ళ నుంచి గోదావరిఖని వరకు కరకట్ట నిర్మించాలని, విఠల్ నగర్ మల్టిగ్రేడ్ మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించాలని, గోదావరి బ్రిడ్జిపై ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, నగర పాలక సంస్థ ద్వారా ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని, ఆర్ఎఫ్‌సీఎల్‌లో జెడ్ఎల్‌డీ ప్లాంట్ ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయాలని, అదేవిధంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌ను రుడాగా మార్చాలని విజ్ఞప్తి కలెక్టర్‌కు అందించిన వినతిలో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ విన్నవించారు.



ప్రణాళిక ప్రకారం 10వ తరగతి పరీక్షలకు సిద్ధం కావాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
నవతెలంగాణ-గోదావరిఖని:
విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో ప్రతిరోజు కొంత సమయం ప్రణాళిక ప్రకారం చదువుకొని 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రామగుండం మండలంలోని మల్యాలపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. జడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. విద్యార్థులకు సులువైన సబ్జెక్టులు, కష్టమైన సబ్జెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు ప్రతిరోజు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు ప్రశాంతంగా ఉండాలని టెన్షన్ పడాల్సిన అవసరం లేదని, ప్రతిరోజు పాఠశాల యంత్రాంగం ఉదయం చేసే వేకప్ కాల్‌తో లేచి కొంత సమయం చదువుకోవాలని, అనంతరం వ్యాయామం, యోగా చేసి, పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-గోదావరిఖని:
గోలివాడ గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం నీటిలో కొట్టుకు వచ్చి లభ్యమైనట్లు అంతర్గాం ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, నీలి రంగు టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, సుమారు 5.4 ఎత్తు ఉన్నాడని, చమన ఛాయా రంగు, నెరసిన గడ్డం, గుండ్రని ముఖంతో ఉన్నాడని మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామని, ఆచూకి తెలిసినట్లయితే రామగుండం సీఐ 8712656257, అంతర్గాం ఎస్ఐ 8712656527 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.



పెండింగ్ బిల్లులను ఇప్పించాలని ఎమ్మెల్యే వినతి

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్
చాలా కాలం నుంచి పెండింగ్ బిల్లులు రాక సర్పంచ్‌ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని అప్పుల పాలయ్యామంటూ వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని సోమవారం మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే విజయ రమణారావుకు సుల్తానాబాద్ మండలంలోని సర్పంచ్‌లు వినతిపత్రం అందజేశారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు గర్రెపల్లి సర్పంచ్ వీరగోని సుజాత రమేష్ గౌడ్, గొల్లపల్లి సర్పంచ్ సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి బండారి రమేష్, కట్నపల్లి సర్పంచ్ మోరపల్లి మోహన్ రెడ్డి, కోదురుపాక సర్పంచ్ సాగర్ రావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ అభివృద్ధి పనులు చేసి సంవత్సరాలు గడుస్తున్న బిల్లులు రాకపోవడంతో అప్పుల పాలై సర్పంచులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అభివృద్ధి పనుల కోసం తెచ్చిన అప్పులకువడ్డీ భారం పెరిగి ఎక్కువ అవుతుందని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కల్వల శ్రావణ్ కుమార్, గుజ్జేటి దేవమ్మ వెంకన్నకోడం సురేఖ, లోకిని కోమల, మొలుగురి వెంకటలక్ష్మి అంజయ్య గౌడ్,కొలిపాక అరుణ జ్యోతి పెద్దన్న, ఏరుకొండ రమేష్, పాల్గొన్నారు.



అభివృద్ధిలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

నవతెలంగాణ -సుల్తానాబాద్ రూరల్
గ్రామాల అభివృద్ధికి మండలంలోని ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి కృషి చేయాలని అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం వహించేస్తే సహించేది లేదని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సోమవారం సుల్తానాబాద్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు అధ్యక్షతన నిర్వహించగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి పథంలో పయనించాలంటే ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి చెందుతాయని అందుకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని గ్రామాలలో అన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ మినిపాల స్వరూప, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి,ఎంపీడీవో శశికళ తోపాటు మండలంలోని సర్పంచ్‌లు ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు పలువురు పాల్గొన్నారు.



పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-జూలపల్లి
జూలపల్లి మండలంలో ఉన్న పలు సమ స్యలపై జూలపల్లి ఉపసర్పంచ్, ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పుల మహేష్ ఎమ్మెల్యే విజయరమణరావుకు సోమవారం రోజునవినతి పత్రాన్ని అందించారు. జూలపల్లి మండలంలో వ్యవసాయ ఆధారిత మండలం కావున చివరి దశకు ఎస్సారెస్పీ నీరు అందే విధంగా చూడాలని, జూలపల్లి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి 30 పడకల ఆసుపత్రిగా 24 గంటలు వైద్య సదుపాయం అందించే విధంగా ఉండాలని, పోటీ పరీక్షల అభ్యర్థులకు గ్రంథాలయం సరిగా లేక అద్దె భవనాల కొనసాగుతుందని, సొంత భవనాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే పెద్దపల్లి నుంచి చొప్పదండికి వెళ్లే బస్సును మరొకటి ఏర్పాటు చేసి మండల ప్రజల కష్టాలను తీర్చాలని మహేష్ కోరారు.


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న మహేష్

కమ్యూనిటీ భవన స్థలం కబ్జా

- బీఆర్ఎస్ హయాంలో ఆక్రమణ
- బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్
- అభ్యంతరాలు పట్టించుకోని అధికారులు
- న్యాయం చేయాలని బాధితుల ఆందోళన

నవతెలంగాణ, రామగుండం :
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ పరిధిలోని ఒక కమ్యూనిటీ భవనానికి సంబంధించిన స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించుకున్నారని,ఎన్నికలకు కొద్ది రోజుల ముందే బినామీ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 1980 నుంచి సింగరేణికి సంబంధించిన సుమారుగా 6గుంటల స్థలం 45 డివిజన్‌లోని చొప్పరి కనుకయ్య, పుణ్యాల రాజయ్య స్వాధీనంలో ఉంది. పుణ్యాల రాజయ్య గోదావరిఖనిలో సింగరేణి ఉద్యోగం చేస్తూ కొద్దికాలం బదిలీపై భూపాలపల్లికి వెళ్లగా ఆ మధ్య కాలంలో రాజయ్యకు చెందిన పాత ఇంటిని ఆక్రమణదారులు కూల్చివేసి స్థలాన్ని కబ్జా చేశారు. దాంతో పాటు ఆ స్థలానికి ఆనుకొని ఉన్న ఇంకొంత జాగను కబ్జాదారులు ఆక్రమించే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. దీనిపై సింగరేణి, మున్సిపల్ అధికారులు, కలెక్టర్‌కు సైతం 2019లో ఫిర్యాదు చేశారు. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వద్దని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు సోమారపు సత్యనారాయణ, కోరుకంటి చందర్ వద్దకు వెళ్లి బాధితులు తమ సమస్యను విన్నవించారు. ఆ స్థలాన్ని ఆక్రమణ దారుల చేతుల్లోకి వెళ్లనీయకుండా అక్కడ కమ్యునిటీ భవనంతో పాటు గ్రంథాలయం నిర్మించాలని తీర్మానం చేశారు.

ఫిర్యాదులు చేసినా..
సింగరేణితో పాటు కలెక్టర్,ఎమ్మెల్యేలకు సైతం బాధితులు ఫిర్యాదు చేసినా స్థానిక మున్సిపల్ అధికారులు అవి ఏవీ పట్టించుకోకుండా 2022లో ఆస్థలానికి ఇంటి నెంబరు జారీ చేశారు. దాని ఆధారంగా 2023లో ఆక్రమణదారులు బినామీల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించారు. రాజకీయ నాయకుల ఒత్తిడితోనే అధికారులు ఈ చర్యకు పాల్పడినట్లు బాధితులు వాపోతున్నారు. సింగరేణిలో ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి పట్టాలు జారీ చేయని అధికారులు పైరవీకారులకు మాత్రం రాత్రికి రాత్రే వెలసిన నిర్మాణాలకు ఇంటి నెంబర్లు జారీ చేయడాన్ని తప్పు పడుతున్నారు. కనీస విచారణ లేకుండా అధికారులు ఇలాంటి చర్యలకు దిగడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు.


గోడపై రాసిన ఇంటి నెంబరు


స్థలాన్ని కాపాడాలని ఆందోళన చేస్తున్న బాధితులు

ఏడేళ్లుగా పోరాటం చేస్తున్నాం..

- చొప్పరి శ్రీనివాస్



1980 నుంచి మా తండ్రి చొప్పరి కనుకయ్య పేరు మీద ఉన్న ఈ స్థలాన్ని కొంతమంది రాజకీయ నాయకుల అండతో కబ్జా చేశారు. దీనిపై అధికారులకు సైతం ఫిర్యాదు చేశాం. ఈ స్థలం అందిరికీ ఉపయోగపడేలా కమ్యునిటీ భవనం, గ్రంథాలయం నిర్మించాలని భావించాం. ఇద్దరి ఎమ్మెల్యేల సమక్షంలో తీర్మానం సైతం చేశాం. అయినా కబ్జాదారులు అవి ఏవీ పట్టించుకోకుండా బెదిరింపులకు సైతం పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మరింత భయాందోళనకు గురిచేశారు. ఆ స్థలంపై విచారణ జరిపించి న్యాయం చేయాలని, ప్రజా అవసరాల నిమిత్తం దానిని కేటాయించాలని అధికారులకు విన్నవిస్తున్నాం.

పాత ఇంటిని కూల్చివేశారు..

- పుణ్యాల రాజయ్య



1982 నుంచి ఈ స్థలంలో నా ఇల్లు ఉండేది. ఉద్యోగరీత్యా భూపాలపల్లికి బదిలీపై వెళ్లగానే కబ్జాదారులు ఆ పాత ఇంటిని కూల్చివేశారు. స్థానికుల కోరిక మేరకు సామూహిక అవసరాలకు ఆ స్థలాన్ని వినియోగించాలని ఎమ్మెల్యేల సమక్షంలో తీర్మానం చేసినా కొంతమంది అక్రమంగా ఆ స్థలాన్ని ఆక్రమించారు. అధికారులు సైతం వారికే మద్దతుగా ఇంటి నెంబరు ఇచ్చారు. గతంలో అధికారంలో ఉన్న నాయకులు, అధికారులు మమ్మల్ని మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేశారు. ఎమ్మెల్యే, అధికారులు ఆ స్థలాన్ని తిరిగి ఇప్పించి మాకు న్యాయం చేయాలి.

ప్రణాళికాబద్ధంగా ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-గోదావరిఖని:
ప్రభుత్వ కార్యాలయాలలో వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించే దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని, ప్రణాళిక బద్ధంగా ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కారం అయ్యే విధంగా అధికారులు విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. సోమవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రజల అర్జీలను స్వీకరించారు. ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు ప్రజావాణి కార్యక్రమం కోసం ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహించాలని, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తు వివరాలు సదరు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఒక దరఖాస్తు ప్రజల నుంచి రెండోసారి రాకుండా, సదరు దరఖాస్తు పరిష్కారం అయ్యే విధంగా అధికారులు విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కమిషనర్ సిహెచ్ నాగేశ్వరరావు, తహసీల్దార్ కుమార స్వామి, సంబంధిత వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

మానవ విలువలు, మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన

నవతెలంగాణ-ఓదెల:
ఓదెల మండలంలోని కస్తూరిభా బాలికల విద్యాలయంలో సోమవారం రోజున స్పెషల్ ఆఫీసర్ జ్యోతి అధ్యక్షతన విలువలు మూఢ నమ్మకాల నిర్మూలన అంశంపై భారతీయ నాస్తిక సమితి రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి పొత్కపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి విద్యార్థి దశయే పునాది అన్నారు. విద్యార్థి దశలో ఎవరైతే లక్ష సాధనకు కృషి చేస్తారో లక్ష్యాన్ని సాధించడం సులభతరమవుతుందన్నారు. భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇప్పటికీ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు నమ్మడం దురదృష్టకరమన్నారు. విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడుతూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.



దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే
నవతెలంగాణ-జూలపల్లి
దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం జూలపల్లి మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం రోజున ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ నివేదికలో గతంలో జరిగిన వరి మొక్కజొన్న పంటలవి నష్టపరిహారం అందలేదని తేలుకుంట ఎంపిటిసి శ్రీనివాస్ తెలిపారు. తేలుకుంటలో ఆరోగ్యశాఖ ఏఎన్ఎం త్వరగా భర్తీ చేయాలని తెలుకుంట సర్పంచ్ సొల్లు పద్మ అడిగారు, వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కాలిని భర్తీ చేస్తామని డాక్టర్ సంపత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణరావు, జడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, ఎంపీడీవో వేణుగోపాలరావు, తహసీల్దార్, బషీరుద్దీన్, ఎంపీవో కిరణ్, ఏఈ అశోక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే.

ఎమ్మెల్యేను సన్మానించిన సర్పంచ్‌లు

నవతెలంగాణ -సుల్తానాబాద్ రూరల్
పెద్దపెల్లి ఎమ్మెల్యేగా ఎన్నికై మొదటిసారి మండల సర్వసభ్య సమావేశానికి విచ్చేసిన చింతకుంట విజయ రమణారావును సుల్తానాబాద్ మండలంలోని సర్పంచ్‌లు గజమాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ బాలాజీ రావు, జడ్పీటీసీ స్వరూప రాణి, సింగిల్ విండో చైర్మన్ సందీప్ రావు, సర్పంచులు వీరగోని సుజాత రమేష్ గౌడ్, బండారి రమేష్, మోహన్‌రెడ్డి, సాగర్‌రావు, గుజ్జేటి దేవమ్మ వెంకన్న, కొలిపక రుణ జ్యోతి పెద్దన్న పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న సర్పంచ్, నాయకులు

పాలన సౌలభ్యం కోసమే నూతన భవనాల ఏర్పాటు

ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు
నవతెలంగాణ -సుల్తానాబాద్ రూరల్
పాలన సౌలభ్యం కోసమే నూతన గ్రామపంచాయతీ భవనాలను నిర్మించుకోవడం జరుగుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామంలో నూతనంగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు 20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని 10 లక్షల నలభై వేలతో నిర్మించిన ఈ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే విజయ రమణారావు, స్థానిక ఎంపీపీ బాలాజీ రావు జడ్పీటీసీ స్వరూప రాణి ప్రకాష్ రావు సర్పంచ్ మోహన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలకు చెందిన ప్రజలకు సూపరిపాలన అందించడానికి సౌలభ్యం కోసం నూతన భవనాల అవసరం ఎంతైనా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శేఖర్ గౌడ్, ఎంపీటీసీ,తిరుపతి రెడ్డి,సతీష్ రావు,పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖని స్పెక్ట్రా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు క్రియేటివ్ కరాటే ఆర్గనైజేషన్ హన్మకొండ వారి ఆధ్వర్యంలో పరకాలలో నిర్వహించిన 32వ కరాటే ఛాంపియన్షిప్‌లో కరాటే మాస్టర్ మొండయ్య ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో గాలిపెల్లి జోసెఫ్, దాసరి చరిత్‌లు పాల్గొని బంగారు పథకాలు సాధించారు. అదేవిధంగా కుసుమ అఖిల్ వెండి పథకాన్ని సాధించారు, ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, కరాటే మాస్టర్‌ను పాఠశాల కరస్పాండెంట్ నృతని సాయిలీల, డైరెక్టర్ శ్యాంలు అభినందించారు.

సూపర్‌వైజర్ రమేష్ మృతిపై అనుమానాలున్నాయి

సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మెండె శ్రీనివాస్

నవతెలంగాణ-గోదావరిఖని:
కాలు విరిగినందుకు ట్రీట్మెంట్ చేస్తే ఫలితం మరణమా అని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మెండె శ్రీనివాస్ ప్రశ్నించారు. గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మచ్చ రమేష్ అనే సూపర్ వైజర్ యువ కార్మికుడు చనిపోయిన దానిని ఉద్దేశించి మాట్లాడారు. కాసిపేట 2వ గని మచ్చ రమేష్ సీనియర్ మైనింగ్ సర్దార్‌కు ఈనెల డిసెంబర్ 22న గనిలో ప్రమాద వశాత్తు కాలుకు దెబ్బ తగిలిందని, ఆసుపత్రికి పంపగా కాలు విరిగిందని, గోదావరిఖనికి ట్రీట్మెంట్ నిమిత్తము పంపి డిసెంబర్ 22 నుంచి చికిత్సలు చేస్తూ ఉన్నారని, కానీ అతను సడెన్‌గా ఎక్స్‌రే సమయంలో స్ట్రోక్‌తో చనిపోయాడని చెబుతున్నప్పటికీ అతనికి అందించిన చికిత్సపై పలు సందేహాలు వెల్లువెత్తుతున్నాయని, కాలు విరిగిన ట్రీట్మెంట్ తో దాదాపు 20 రోజుల వరకు ఆస్పత్రిలో ఉంచుకొని వాడిన మందుల వల్లే చనిపోయాడని అనుమానం తలెత్తుతుందని ఆరోపించారు. గత రెండు మూడు సంవత్సరాలుగా సీఐటీయూ ఎల్1 మందులు వాడవద్దని, ఆసుపత్రులలో సరైన స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలని, వైద్య పరికరాలను సైతం మంచివి ఏర్పాటు చేయాలని ఆందోళనలు చేస్తున్నప్పటికీ నిధుల కొరతతో యాజమాన్యం పట్టించుకోకపోవడం మూలంగానే యువ కార్మికుడు చనిపోయాడని విమర్శిం చారు. కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు అన్నం శ్రీనివాస్, జే.మల్లేష్, రవితేజ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెండె శ్రీనివాస్

దళిత బంధు రెండో విడత లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
దళితులు పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు రెండో విడత లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం గోదావరిఖని పట్టణంలోని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ముందుగా జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో దళిత బంధు లబ్ధిదారులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారని, దళితుల జీవితాలలో వెలుగులు నింపే దళిత బంధు లబ్ధిదారులకు తక్షణమే ప్రోసీడింగ్ అందజేసి రుణాలు మంజూరు చేయాలని సీనియర్ జర్నలిస్టు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ, సభ్యుడు బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంపల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శి, మంతెనలింగయ్యలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.


కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది, లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని ఉమెన్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలో మీల్స్‌ఆన్ వీల్స్ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది అధ్యక్షుడు లయన్ కంకణాల ముకుంద రెడ్డి జన్మదినం సందర్భంగా ఉచిత నిత్య అన్న ప్రసాద వితరణ గోదావరిఖని శతాబ్ది ఎల్సీ గోదావరిఖని ఉమెన్ వారిచే నిర్వహించారు. అదేవిధంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది, ప్లాన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని ఉమెన్ ఆధ్వర్యంలో పీకే రామయ్య కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాల 100 మంది పిల్లలకు బ్యాగులు పంపిణీ సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది ప్రెసిడెంట్ కంకణాల ముకుంద రెడ్డి, సెక్రటరీ బాలస్వామి స్వామి గౌడ్, ట్రెజరర్ దేవినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మొక్కు చెల్లించుకునేందుకు పాదయాత్ర

నవతెలంగాణ-ముత్తారం:
మంథని నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విజయం సాధిస్తే కాలినడక వేములవాడ వచ్చి మొక్కు చెల్లించుకుంటానని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య మొక్కుకున్నారు. మొక్కుకున్న విధంగానే మంథని ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భారీ మెజారిటీతో గెలిచి, మంత్రి అయిన సందర్భంగా మొక్కును చెల్లించుకునేందుకు సోమవారం ముత్తారం మండలంలోని అడవీ శ్రీరాంపూర్ గ్రామంలో గల తన ఇంటి నుంచి కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య కాలినడక పాదయాత్రగా సోమవారం వేములవాడకు బయలు దేరి వెళ్లారు.


కాలినడకన వెళ్తున్న మద్దెల రాజయ్య

పేద విద్యార్థికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఓడేడు గ్రామానికి చెందిన బేతి రాకేష్ తండ్రి ఓదెలు మృతి చెందగా, ఆ పేద విద్యార్థికి పంజా ఆనంద్ జయ దంపతులు 2వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌కె.లాయక్ అలీ, అధ్యాపబృందం పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆనంద్ జయ దంపతులు

వాసవి క్లబ్ 2024నూతన కమిటీ ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్
వాసవి క్లబ్ సుల్తానాబాద్‌కు నూతన అధ్యక్షుడిగా అక్కనపల్లి సత్యనారాయణ. ప్రధాన కార్యదర్శిగా కొమరవెల్లి రమేష్. కోశాధికారిగా పుల్లూరి రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వనిత క్వీన్స్ క్లబ్ అధ్యక్షురాలుగా జేసెట్టి సుమా ప్రధాన కార్యదర్శిగా కొమరవెల్లి అరుణ, కోశాధికారిగా తొడుపునూరి కవిత, ప్రమాణ స్వీకారం చేశారు. వీరితోపాటు ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎల్లంకి రాజన్న, వాసవి క్లబ్ రీజన్ చైర్మన్‌గా అల్లంకి లింగమూర్తి జోన్ చైర్మన్‌గా వై.సంపత్ కుమార్ ఎన్నుకోబడ్డారు.



వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ సేవ అవార్డులు

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్
2023 సంవత్సరంలో చేసిన సేవలను అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి గుర్తించి డిస్ట్రివి 107ఏ రీజియన్3 చైర్‌పర్సన్ ఎల్లంకి రాజన్న, అధ్యక్షుడు కాసం సత్యనారాయణ లకు ఉత్తమ సేవ పురస్కార్ అవార్డును ప్రధానం చేశారు. ఎమ్మార్ వైశ్య భవన్ కరీంనగర్‌లో 2024 నూతన క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవ సభలో గవర్నర్ కొండ చంద్రశేఖర్ అవార్డులను అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది అని మా యొక్క సేవలను గుర్తించిన అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి గవర్నర్ కొండ చంద్రశేఖర్,అంతర్జాతీయ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ ప్రధాన కార్యదర్శి అప్పుల శ్రీధర్, ట్రెజరర్ అక్కినపల్లి నాగరాజు, రీజియన్ చైర్‌పర్సన్ ఎల్లంకి రాజన్న, జోన్ చైర్ పర్సన్ అల్లంకి లింగమూర్తి పాల్గొన్నారు.



ఆర్జీ-2 లో కోవిడ్‌పై అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ
సోమవారంఆర్జీ-2 ఏరియా జనరల్ మేనేజర్ ఆదేశాల మేరకు సింగరేణి వైద్య ఆరోగ్యశాఖ వారు ఏరియా హాస్పిటల్ ఆర్జీ-1 పర్యవేక్షణలో కోవిడ్‌పై ఆరోగ్య సంరక్షణ,జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్జీ-2 ఏరియా ఆరోగ్య అధికారి డా. కె.పద్మ ఓసీపీ-3 కృషిభవన్ ఉద్యోగులందరికీ వివరిస్తూ కోవిడ్ కోసం తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, కోవిడ్ సమయంలో సరైన ఆహారం, సాధారణ వ్యాయామం, పని ప్రదేశంలో పనిచేసేటప్పుడు శానిటైజర్ తీసుకెళ్లాలన్నారు. ఏదైనా ఇబ్బంది ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు.


మాట్లాడుతున్న ఏరియా ఆరోగ్య అధికారి

కార్మికుల శ్రమను దోచుకుంటున్న కేంద్రం

రైల్వే ఉద్యోగుల రిలే దీక్ష
ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్
నవతెలంగాణ, రామగుండం:
కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల శ్రమను దోచుకుంటూ, షేర్ మార్కెట్లలో పెట్టుబడుల రూపంలో పెడుతున్నారని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ రీజినల్ సెక్రటరీ ఓవై స్వామి ఆరోపించారు. సోమవారం రామగుండంలో రైల్వే స్టేషన్ పరిధిలో ఓల్డ్ పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని చేపట్టిన రిలే దీక్షలో ఆయన మాట్లాడారు. కొత్త పెన్షన్ విధానంతో కార్మికులు, వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్‌ను విధానం అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో పాత పెన్షన్‌ను కోరుకునే అన్ని సంఘాల ఆధ్వర్యంలో రైలురోకోకు పిలుపునిస్తామన్నారు. యూనియన్ బ్రాంచి చైర్మన్ రామారావు మాట్లాడుతూ కార్మికుల శ్రమ దోపిడీ నశించాలన్నారు. కార్మికుల జీతాల నుంచి కట్ చేస్తున్న 10 శాతం పీఎఫ్‌కు ప్రభుత్వం 14 శాతం కలిపే మొత్తాన్ని కార్మికులు డ్రా చేసుకునే అవకాశం లేని కొత్త విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రిలేదీక్షల్లో జాన్‌మోజెస్, వీరన్న, కత్తుల రాజ్‌కుమార్, అరవింద్ గౌడ్, వినోద్‌కుమార్, రజినీకాంత్, ఆనంద్ రాథోడ్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

నవతెలంగాణ-హాజీపూర్



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలల్లో భాగంగా ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందిపుచ్చుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆట పాట నిర్వహించారు. మున్సిపాలిటీ రోడ్డు, మార్కెట్‌లో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు లావుడ్యా రమేష్, కొప్పర్తి రవీందర్, గొడిసెల కృష్ణ, బీర్పూరి శ్రీనివాస్, మామిళ్ళ లక్ష్మణ్, రాంటెంకి రాజా, తిరుపతి, సల్లూరి కృష్ణ, వడకపురం రవి, రాజేష్, సంతోష్, సంధ్య, నిరోషా, నాగలక్ష్మి, సమీరా పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి అందరి లక్ష్యం కావాలి

నవతెలంగాణ-జన్నారం



గ్రామాల అభివృద్ధి అందరి లక్ష్యం కావాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారని అందులో భాగంగానే వికాస భారత్ క్యాలెండర్‌లను సోమవారం పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జక్కు భూమేష్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం వాహనంపై ఉన్న స్క్రీన్ థియేటర్ పై కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కు భూమేష్, ఈవో రాహుల్, వార్డు సభ్యులు రమేష్ గంగన్న, లెక్కల మల్లయ్య, ఐకేపీ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 గనిలో ప్రమాదానికి గురై గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో వైద్య చికిత్సలో నిర్లక్ష్యంతో మృతి చెందిన మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్ కార్మికుని కుటుంబానికి న్యాయం చేసే వరకు పోరాడుతామని ఏఐటీయూసీ మందమర్రి, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శులు సాలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్ అన్నారు. గత నెల 22న గనిలో విధులు నిర్వహిస్తుండగా మైనింగ్ సర్దార్ మచ్చ రమేశకు గనిలో జారి పడి ఎడమ కాలు మడమ వద్ద ఫాక్చర్ కావడంతో చికిత్స కోసం గోదావరి ఖని ఏరియా ఆస్పత్రికి తరలించారని, సరైన చికిత్స అందక మృతి చెందాడన్నారు. మైన్ యాక్సిడెంట్‌గా పరిగణించి రూ.కోటి రూపాయాల నష్ట పరిహారం, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సుభాష్ చంద్రబోస్, జోగు కేతన్, గోదారి లింగమూర్తి పాల్గొన్నారు.

భీమన్నకు గిరిజనుల ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-జన్నారం

ఆదివాసీ గిరిజన తెగకు చెందిన మాడవి వంశస్థుల ఆరాధ్య దైవం బీమన్న దేవునికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కొత్తపేట గ్రామపంచాయతీలో గల కోలంగూడా గ్రామంలో త్రిర్యాని మండల్ డోలి జెండాగూడ గ్రామం నుంచి భీమన్న దేవున్ని దాదాపు మూడు రోజుల నుంచి కాలినడకన వచ్చి కోలంగూడ గ్రామంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదిమ కొల్లం గిరిజన జాతి వారు మాడవి సాంప్రదాయం ప్రకారంగా కొత్తకోడల పరిచయ కార్యక్రమం ఆ గ్రామంలో (మాడవి గుమ్ము, శాంత) నూతన వధూవరులు సాంప్రదాయ బద్దంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుల పెద్ద మాట్లాడుతూ తమ కుల దైవం భీమన్నకు ప్రత్యేక పూజలు చేయడం ద్వారా తమ పంట పొలాలు బాగా పండి, ఆయురారోగ్యాలతో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడవి కుల పూజారి మాడవి బాపూరావు, మాడవి ఝాడు, ఆత్రం బొజ్జు, మాణిక్ రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బూత్ స్థాయి కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక బిజోన్ సెంటర్ పోచమ్మ బస్తీ 18వ వార్డులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా బూత్ నెం 58, 73కి సంబంధించిన కాంగ్రెస్ బూత్ స్థాయి కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అనంతరం పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు మాట్లాడుతూ అన్ని వార్డులలో కాంగ్రెస్‌ను బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు ఉపయోగపడేలా బూత్ ఇన్‌ఛార్జీలు, కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలని కోరారు. అలాగే బూత్ ఇన్‌ఛార్జీలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తూ ప్రజల సమస్యలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, కాంగ్రెస్ నాయకులు, అబ్దుల్ అజీజ్, మహంకాళి శ్రీనివాస్ 18వ వార్డ్ ఇన్‌ఛార్జి కృష్ణకాంత్ (కిట్టు), 3వ వార్డ్ ఇన్‌ఛార్జి రాంసాయి, గొల్ల మల్లేష్, యువ నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రామంలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయిస్తాం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రధాన కూడలిలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయిస్తామని సర్పంచ్ జాడి గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వార్డు మెంబర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలో మిగిలిపోయిన పనులన్నీ త్వరగా పూర్తి చేస్తామన్నారు. డ్వాక్రా మహిళల కోసం, ప్రత్యేక భవనం ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో మిగిలిన అన్ని రోడ్లకు సిసి రోడ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి లావణ్య, ఉప సర్పంచ్ ఆసునూరి పద్మ, వార్డు మెంబర్లు, చిందం చంద్రయ్య, జాడి వెంకట్, జాడి లక్ష్మి, జునుగురి లక్ష్మి పాల్గొన్నారు.

ఆరుతడి అంతంతే..!

- యాసంగిలో తగ్గిన వరి సాగు
- కడెం నీటి విడుదల చేయకపోవడమే కారణం
- సాగునీటి విషయంలో రైతుల ఆందోళన



నవతెలంగాణ-జన్నారం



మండలంలో ఈ ఏడు యాసంగి వరి సాగు సగానికి సగం తగ్గింది. గత సంవత్సరం మండలంలో మొత్తం 34 గ్రామాల్లో 29 గ్రామపంచాయతీల రైతులు 9వేల ఎకరాలల్లో వరి సాగు అయితే ఈ ఏడు యాసంగిలో రైతులు 6700 ఎకరాల్లో వారి నారు వేసుకున్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో రైతులు వరి నాటు వేస్తున్నారు. దాదాపు ఇప్పటివరకు 1700 ఎకరాలు వరి నాటు మాత్రమే పూర్తయిందని వ్యవసాయ శాఖ అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. ఈ సాగు కూడా కేవలం పంపులు, బోరు బావులు పైనే ఆధారపడి రైతులు సాగు చేసుకుంటున్నాట్లు అధికారులు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 165 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మూడు ఎకరాల వరకు పెసరు 2 ఉలవలు ఒక ఎకరం జొన్న పంటలను వేశారు. కడెం ప్రాజెక్టు నుంచి ఈ యాసంగికి నీరు విడుదల చేసి ఉంటే, ఈ ఏడు కూడా దాదాపు తొమ్మిది వేల ఎకరాల్లో వరి సాగు అయ్యేదని అందుకు అంచనాలు వేశామని అధికారులు తెలిపారు. కానీ కడెం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల కాకపోవడమే యాసంగిలో సాగు తగ్గడానికి కారణమని తెలుస్తోంది.

జిల్లా వ్యాప్తంగా పరిస్థితి..

మొత్తం మంచిర్యాల జిల్లా 18 మండలాల్లో, యాసంగి పంట సాగు మందకొడిగా సాగుతోంది. సీజన్ ఆరంభమై రెండు నెలలు గడిచినా సాగుకు సరిపడా నీరు అందుతుందో లేదో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో రైతుల్లో అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలో వరి వేయాలో.. ఆరుతడి పంటలు సాగు చేయాలో తేల్చుకోలేకపోతున్నారు. గతేదాది నిండుకుండలా ఉన్న గోదావరి ఈ ఏడు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల డ్యామేజీతో ఖాళీ అయింది. ఈ క్రమంలో వరిసాగుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు.

ఇప్పటి వరకు 62 శాతం సాగు

యాసంగి సీజన్ అక్టోబర్ చివరి నుంచి ప్రారంభమ వుతుంది. డిసెంబర్, జనవరి వరకు వరి సాగుకు అనుకూలం. యాసంగి వరి సాగు అంచనా 98,860 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 61,683(62 శాతం) సాగైంది. ఇంకా 13,285 మొలక(నర్సరీ) దశలోనే ఉంది. ఫిబ్రవరి మొదటి వారం వరకు నాట్లు కొన సాగేలా ఉన్నాయి. ఆరుతడి పంటల సాగు సైతం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. వానాకాలంలో వేసుకున్న పత్తి ఏరేందుకు, వరి కోతలకు కూలీల కొరత ఎదురవుతోంది. ఈ కారణంగా కూడా రైతులు వరి సాగుకు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

సాగు నీటిపై ఆందోళన

యాసంగిలో అధికంగా వరి సాగవుతుంది. ఇప్ప టికే వరినాట్లు పూర్తికావాల్సి ఉండగా వానాకాలం పంటలు ఆలస్యం కావడంతో దాని ప్రభావం యాసంగి సాగుపై పడింది. యాసంగిలో 95 శాతం దొడ్డు రకం వరిసాగు చేస్తారు. వరి తర్వాత మొక్క జొన్న, శనగ, కంది పంటలు సాగవుతాయి. జిల్లా నీటి వనరులు కడెం ప్రాజెక్టు డెడ్ స్టోరీజీ చేరడంతో ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించారు. గూడెం ఎత్తిపోతల పథకం నుంచి డిస్ట్రిబ్యూటరీ 30 నుంచి 42 వరకు 2 టీఎంసీల నీటిని 90 రోజులు వారబందీ పద్ధతిలో 15 వేల ఎకరాలకు మాత్రమే అందిస్తు న్నారు. దీంతో వరి సాగుకు రైతులు వెనుకాడుతు న్నారు. బోర్లు, బావులు ఉన్నవారు మాత్రం మొక్క జొన్న సాగు చేస్తున్నారు.



సీఎంఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

వరిధాన్యం సీఎంఆర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమారెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డీఎస్.చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మిల్లులకు చేరుకొని పట్టించిన ధాన్యాన్ని సీఎంఆర్ డెలివరీస్ కింద భారత ఆహార సంస్థకు ఇవ్వవలసిన ధాన్యాన్ని సకాలంలో అందించాలని తెలిపారు. జిల్లాల వారిగా మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా తప్పనిసరిగా మిల్లింగ్ చేసి సకాలంలో పంపించాలని, సీఎంఆర్ ప్రక్రియలో రీసైక్లింగ్ బియ్యం రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలు, నూతన రేషన్ కార్డులు, పెన్షన్‌ల కొరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని తెలిపారు. రేషన్‌కార్డు దరఖాస్తుకు సంబంధించి వివరాలు నమోదు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, కుటుంబం పెద్ద అయినప్పుడు వారి నుంచి 2/3 దరఖాస్తులు వచ్చినట్లయితే తప్పనిసరిగా పరిశీలించి సరైన వివరాలు కలిగిన దరఖాస్తులు పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో డిసెంబర్ 28, 2023 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు అందిన అన్ని దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 17వ తేదీ లోగా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా దరఖాస్తులో పొందుపరిచిన సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. ఈ విధానంపై తహసీల్దార్లు, మున్సిపల్ వార్డు అధికారులు, ఎంపీడీఓలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్, సబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

పశుమిత్రలకు కనీస వేతనం చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్



నవతెలంగాణ-నస్పూర్

పశుమిత్రులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. సోమవారం పశు మిత్ర వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పశు మిత్రల సమస్యలు పరిష్కరించాలని పశుమిత్ర వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి, కోశాధికారి నాగమణి, లావణ్యలతో కలిసి కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ ద్వారా గత ప్రభుత్వం శిక్షణ ఇచ్చిందని, గత 8 ఏళ్లుగా గ్రామాల్లో రైతులకు ఉన్న పశువులు అనారోగ్య బారిన పడితే వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం ఎలాంటి వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం ఆలోచించి మాకు న్యాయం చేయాలని, కనీస వేతనాలు, పీఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పశుమిత్రల సమస్యలు పరిష్కరించడంలో గత రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పశు మిత్రల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఆందోళన పోరాటాలు చెపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సరోజ, శ్యామల, సరిత, రమ్య, శైలజ, శారదా, స్వప్న, జ్యోతి, రజిత పాల్గొన్నారు.

ఇంటింటా హనుమాన్ చాలీసా నిత్య పారాయణం

నవతెలంగాణ-లక్సెట్టిపేట

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటా హనుమాన్ చాలీసా నిత్య పారాయణం సోమవారం నిర్వహించారు. 3670వ రోజు కాంగ్రెస్ నాయకులు బొప్పు సతీష్ ఇంట్లో నిర్వహించారు. అయోధ్య అక్షింతల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మికత పెరుగుతుందని అన్నారు. అదేవిధంగా హనుమాన్ చాలీసా భక్త బృందానికి రూ.5016 అందజేశారు. గాంధీ నగర్ కాలనీ వాసులు, మహిళలు అయోధ్య అక్షింతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి జడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి, గడ్డం శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో డిసెంబర్ 28, 2023 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, ఈ నెల 6 నుంచి 17వ తేదీలోగా స్వీకరించిన దరఖాస్తుల వివరాలను పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు నమోదు విధానంపై తహసీల్దార్లు, మున్సిపల్ వార్డు అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచే సమయంలో వార్డుల వారిగా దరఖాస్తు సంఖ్య నమోదు చేసిన అనంతరం కులం, పుట్టిన తేదీ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా ఇతర వివరాలతో కూడిన ఆన్‌లైన్ ఫారంను ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తుఫారములో ఉన్న ప్రకారంగానే నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. డాటా ఎంట్రీ చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఒక్కరు నిబద్ధతతో పని చేసి ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలకు విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-జన్నారం

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని స్లేట్ ఎక్సలెంట్ సీబీఎస్సీ స్కూల్ 8వ తరగతి చదువుతున్న విద్యార్థి బొమ్మిడి రిషి వర్మ ఎంపిక అయ్యాడు. ఇటీవల ఆసిఫాబాద్‌లో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచినందుకు ఈనెల 16 నుండి 18 వరకు నిజామాబాద్ లోని ఆర్మూర్ మండలంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనటువంటి విద్యార్థిని ప్రిన్సిపాల్ యేసు మరియా, అడ్మినిస్ట్రేషన్ రజిత, పీఈటీలు సంతోష్, నాగేష్, రమేష్, నాగలక్ష్మి అభినందించారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి రాములుతో కలిసి ప్రజావాణి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వంలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ 10 రోజుల లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రాష్ట్ర స్థాయిలో జిల్లాకు చెందిన సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లయితే సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు కార్యచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. సుమారు 70 దరఖాస్తులు అందాయని, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు లూయిస్ బ్రెయిలీ జయంతి

నస్పూర్: కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి కె.చిన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, దివ్యాంగ సిబ్బంది, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

లోక్‌సభ స్థానాల బీజేపీ ఇన్‌చార్జుల ప్రకటన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ, ఒక ఎంపీ, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇన్‌చార్జులుగా నియమితులైన వారిలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్ (ఆదిలాబాద్), రామారావు పవార్(పెద్దపల్లి), ధన్‌పాల్ సూర్యనారయణ గుప్తా (కరీంనగర్), ఆలేటి మహేశ్వర్‌రెడ్డి (నిజామాబాద్), కె.వెంకట రమణారెడ్డి రెడ్డి(జహీరాబాద్), పాల్వాయి హరీశ్‌బాబు (మెదక్), పైడి రాకేశ్‌రెడ్డి(మల్కాజిగిరి), టి.రాజాసింగ్(హైదరాబాద్), ఎంపీ, డాక్టర్ కె.లక్ష్మణ్(సికింద్రాబాద్), ఎమ్మెల్సీ ఎ.వెంకటనారాయణరెడ్డి(చేవెళ్ల), మాజీ ఎమ్మెల్సీలు ఎన్.రామచంద్రరావు(మహబూబ్‌నగర్), మారం రంగారెడ్డి(నాగర్ కర్నూల్), పొంగులేటి సుధాకర్‌రెడ్డి(ఖమ్మం), మాజీ ఎంపీ గరికెపాటి మోహన్‌రావు(మహబూబాబాద్), మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి (వరంగల్), మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి(నల్లగొండ), ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్(భువనగిరి) ఉన్నారు.

ఈటలతో విబేధాల్లేవ్

- బీఆర్ఎస్ ఎంపీలు నాతో టచ్‌లో ఉన్నారు : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ పార్టీ నేత ఈటల రాజేందర్‌తో తనకు ఎలాంటి విబేధాల్లేవనీ, కలిసికట్టుగా ముందుకెళ్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ చెప్పారు. ఈటల అభిప్రాయాలనూ నాయకత్వం గౌరవిస్తున్నదని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ మావోయిస్టు నయీమ్ డైరీపై విచారిస్తే బీఆర్ఎస్ నేతల గుట్టురట్టు అవుతుందని చెప్పారు. నయీమ్ ఆస్తులు ఎక్కడ పోయాయనే దాన్ని వెలికి తీయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు అధికారమిస్తే ఆరు గ్యారెంటీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆరు లక్షల కోట్ల రూపాయల అప్పును ఎలా తీరుస్తారని అడిగారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన డ్రగ్స్ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం బయటకు తీయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థుల చావుకు కారణమైన గ్లోబరినా సంస్థపైనా విచారణ చేయించాలని కోరారు.తనతో బీఆర్ఎస్ ఎంపీలు టచ్‌లో ఉన్నారని బాంబ్ పేల్చారు. ఓడిపోయినా కేటీఆర్‌కు అహంకారం మాత్రం తగ్గలేదని విమర్శించారు.

భారత్‌కు ఎర్ర సముద్రం సెగ

ఎగుమతుల్లో 30 బిలియన్ డాలర్లు తగ్గొచ్చు



> ఎర్ర సముద్రంలో నెలకొన్న అలజడి భారత్‌ను ఆందోళనకు గురి చేస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్న ఎగుమతుల్లో 30 బిలియన్ డాలర్ల వరకు క్షీణించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇటీవల ఎర్ర సముద్రంలో కార్గో ఓడలకు వచ్చే బెదిరింపులతో షిప్పింగ్ రేట్ల పెరుగుదలకు దారితీయడంతో పాటుగా ఎగుమతిదారులు ఎగుమతులను నిలిపివేసే అవకాశాలు మెండుగా ఉన్నాయని న్యూఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్ ప్రాథమికంగా అంచనా వేసింది.

న్యూఢిల్లీ : గత ఆర్థిక సంవత్సరం మొత్తం 451 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. ఈ ఏడాది 6.7 శాతం తగ్గుదల చోటు చేసుకోవచ్చని అంచనా వేసింది. "ఎర్ర సముద్రంలో సంక్షోభం భారత వాణిజ్యంపై ప్రభావం చూపుతుంది. ఇది మరింత పతనానికి దారితీయవచ్చు" అని రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్ డైరెక్టర్ జనరల్ సచిన్ చతుర్వేది పేర్కొన్నారు. కాగా.. ఎర్ర సముద్ర సంక్షోభం దేశ ఎగుమతులపై ఎలాంటి ప్రభావం చూపవచ్చనేది ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రపంచంలోని అతిపెద్ద షిప్ బ్రోకర్ అయిన క్లార్క్‌సన్ రీసెర్చ్ సర్వీసెస్ లిమిటెడ్ ప్రకారం.. సూయజ్ కెనాల్ గుండా ప్రయాణిస్తున్న నౌకల సంఖ్య డిసెంబర్ మొదటి సగం సగటుతో పోలిస్తే జనవరి 3వ తేది నాటి వారంలో 44 శాతం తగ్గింది.

యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతుగల హౌతీ మిలిటెంట్లు ఇటీవలి ఎర్ర సముద్రం గుండా ప్రయాణిస్తున్న నౌకలను క్షిపణులతో లక్ష్యంగా చేసుకుంటున్నారని వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఎర్ర సముద్రం ద్వారా ఐరోపా, ఈస్ట్ కోస్ట్, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికన్ దేశాలకు భారత్ సరుకు రవాణ చేస్తోంది. ఎర్ర సముద్రం గుండా రవాణా చేసే దేశ ఎగుమతుల్లో నిలుపుదల అయ్యాయని భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోకి వచ్చే ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ పేర్కొన్నారు. ఆసియా నుండి ఉత్తర ఐరోపాకు 40 అడుగుల కంటైనర్‌లో వస్తువులను రవాణా చేసే వ్యయాలు 173 శాతం పెరిగాయన్నారు. ఆసియా నుండి ఉత్తర అమెరికా తూర్పు తీరం వరకు ధరలు 40 అడుగుల కంటైనర్‌కు 55 శాతం పెరిగి 3,900 డాలర్లకు చేరుకున్నాయన్నారు. భారత్ సాధారణంగా ఎర్ర సముద్ర మార్గాన్ని ఉపయోగించి పెట్రోలియం ఉత్పత్తులు, తృణధాన్యాలు, రసాయనాలతో సహా అనేక రకాల వస్తువులను ఎగుమతి చేస్తుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ సమయంలో ఎగుమతులు 6.5 శాతం పతనమయ్యాయి. అధిక గ్లోబల్ రవాణ ఛార్జీలు, బీమా రేట్లు ద్రవ్యోల్బణాన్ని పెంచే అవకాశాలున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నా కుటుంబసభ్యులపై తీన్మార్ మల్లన్న అసత్య ఆరోపణలు

- పరువు నష్టం దావా వేస్తా : బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తన కుటుంబ సభ్యులపై తీన్మార్ మల్లన్న అసత్య ఆరోపణలు చేస్తున్నారనీ, ఆయనపై పరువు నష్టం దావా వేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తన సతీమణి నీలిమ ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం పొందారని తెలిపారు. 1992లో ఆమె ప్రభుత్వ ఉద్యోగం సాధించారనీ, 2015లో డివిజనల్ ఇంజినీర్‌గా పదోన్నతిలోకి వచ్చిందని తెలిపారు. ఆరు నెలలు డిప్యూటేషన్‌పై సచివాలయంలో పని చేసి 2020 నవంబర్ 19 వీఆర్ఎస్ తీసుకున్న నీలిమ వామపక్ష విద్యార్థి సంఘం నాయకురాలిగా కూడా పని చేశారని గుర్తుచేశారు.

అనురాగ్ విద్యాసంస్థల్లో ప్రతి నెల ఐదున జీతాలు ఇస్తున్నట్టు పల్లా ఈ సందర్భంగా తెలిపారు. ప్రజావాణీలో తీన్మార్ మల్లన్నపై ప్రజలు ఫిర్యాదులు చేసినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మల్లన్న సోదరుడు, ఇంటిలిజెన్స్ అధికారులు తమ విద్యాసంస్థలకు వచ్చిన బెదిరిస్తున్నారని ఆరోపించారు. జనగామలో తనపై ఓడిన అభ్యర్థి ప్రభుత్వ అధికారులను బెదిరిస్తున్నాడని తెలిపారు.

ఆటోడ్రైవర్లకు నెలకు రూ.15 వేలు జీవనభృతి : మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్

ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేలు జీవనభృతి ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలన మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలన్నారు. ఆర్టీసీ సర్వీసులను తగ్గించడం సరికాదని విమర్శించారు. ఇంటలిజెన్స్ అధికారులు ఫోన్లు ట్యాప్ చేస్తున్నారనీ, గోదావరి పరివాహక ప్రాంత నేతలకు ప్రాణ హానీ ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తను హత్య చేశారని వివరించారు. తుంగతుర్తిలో బీఆర్ఎస్ కార్యకర్తతో పాటు ఆయన భార్యపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారని తెలిపారు.

ఫిబ్రవరి 9 నుంచి 19 వరకు హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్‌ను ఫిబ్రవరి 9 నుంచి 19 వరకు నిర్వహించాలని సంబంధిత కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. సోమవారం హైదరాబాద్‌లోని బుక్ ఫెయిర్ కార్యాలయంలో అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బుక్ ఫెయిర్ నూతన కార్యదర్శిగా ఆర్.వాసు బాధ్యతలు చేపట్టారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఎన్టీఆర్ స్టేడియంలోనే బుక్ ఫెయిర్ ఉంటుందని తెలిపారు. పుస్తక ప్రియులు, పాఠకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి పి రాజేశ్వరరావు, మాజీ కార్యదర్శి శృతికాంత్ భారతి, ఉపాధ్యక్షులు నారాయణ రెడ్డి, కోయ చంద్రమోహన్, సహాయ కార్యదర్శి శోభన్ బాబు, జనార్ధన్ గుప్తా, కవి యాకూబ్, శ్రీకాంత్, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఇది 36వ హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్ కావడం గమనార్హం.

కుక్కల దాడిలో బాలుడు మతి

నవతెలంగాణ - మాక్లూర్

కుక్క దాడితో బాలుడు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం కల్లేడ గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 25వ తేదీన గ్రామానికి చెందిన నిషన్(5) అనే బాలుడు ఆడుకుంటూ ఉండగా ఓ కుక్క దాడి చేయటంతో బాలుడిని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్యం చేయించారు. కాగా, బాలుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు.



కల్లుగీత కార్మికులకిచ్చిన హామీలు అమలు చేయాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం కల్లు గీత కార్మికులకిచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించినట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వానికి కమిటీ తరుపున శుభాకాంక్షలు తెలిపారు. ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు. వాటితో పాటు కల్లుగీత కార్మికులకు ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. తాళ్లు ఎక్కే క్రమంలో ప్రమాదం జరిగి వందలాదిమంది కాళ్లు చేతులు విరగడం, నడుము పడిపోవటంతో పాటు ఎంతో మంది చనిపోతున్నారని పేర్కొన్నారు. ఏడాదికి సుమారు 550 మంది చెట్టుపై నుంచి జారి పడుతున్నారనీ, వీరిలో 180 మంది చనిపోతున్నారని తెలిపారు. సరాసరి రెండు రోజులకు ఒకరు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్దసంఖ్యలో మరేవృత్తిలోనూ ప్రమాదాలు జరగటం లేదని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగి భూములకు విపరీతంగా ధరలు పెరగటంతో తాటి, ఈత చెట్లను నరికి వేస్తున్నారని పేర్కొన్నారు. రోజు రోజుకు వనాలు తరిగిపోతున్నాయని పేర్కొన్నారు. లిక్కర్, బెల్టు షాపుల వల్ల కల్లు అమ్మకాలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ఏరియాలో సొసైటీలు రద్దు కావడంతో అక్కడి గీత కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంశాలు..

- వృత్తిలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి. సేఫ్టి మోకులు ఇవ్వాలి.
- ప్రమాదానికి గురై చనిపోయిన వారి కుటుంబాలకు, శాశ్వత వికలాంగులకు రూ.10 లక్షలు, తాత్కాలిక వికలాంగులకు లక్ష చొప్పన ఎక్స్‌గ్రేషియాను నెల లోపు ఇవ్వాలి. మెడికల్ బోర్డు విదానం తొలగించాలి. వృత్తిలో ఎక్కడ ప్రమాదం జరిగినా వర్తింప జేయాలి.
- బెల్టు షాపులను పూర్తిగా నిషేదించాలి. కల్లులోని పోషకాలను, ఔషద గుణాలను ప్రభుత్వమే ప్రచారం చేసి మార్కెట్ సౌకర్యం కల్పించాలి.
- గీత కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ ఎలాంటి షరతులు లేకుండా 50 ఏండ్లు నిండిన ప్రతి గీత కార్మికునికి చేయూత పథకం ద్వారా రూ.4వేలు ఇవ్వాలి.
- కల్లుగీత కార్మికులందరికి వృత్తికి ఉపయోగ పడే ద్విచక్ర వాహనాలు ఇవ్వాలి.
- ఎజెన్సి ఏరియాలో కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అక్కడి గీత కార్మికులకు వర్తింప చేయాలి.
- రాష్ట్ర బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయించి టాడి కార్పొరేషన్ ను సమర్థవంతంగా నిర్వహించాలి.
- ప్రతి సొసైటీకి చెట్ల పెంచడానికి 5 ఎకరాలు ప్రభుత్వ భూమి ఇవ్వాలని ఉన్న 560 జీవో అమలు చేయాలి. లేదా కొనివ్వాలి.
- టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన 439 సొసైటీల భూములకు పెన్సింగ్ చేయించాలి. తాటి, ఈత, జీనుగు, ఖర్జూర తదితర కల్లునిచ్చే పొట్టి చెట్లు నాటాలి.
- కల్లుగీత కార్పోరేషన్ నుండి వృత్తిలో చనిపోయిన వారి కుటుంబాలకు ఇస్తున్న తక్షణ సహాయం పెంచాలి. దహన సంస్కారాల కొరకు రూ 50వేలు, గాయాలైన వారికి వైద్య ఖర్చుల కొరకు రూ.25వేలు ఇవ్వాలి.
- నీరా, తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ప్రతి జిల్లా కేంద్రంలో నెలకొల్పాలి. గౌడ యువతీ యువకులకు ఉపాది కల్పించాలి.
- తాటి, ఈత చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విదంగా కొత్త చట్టం తీసుకరావాలి.
- వేతన గీత కార్మికులకు అసోషియేట్ మెంబర్షిప్ ఇవ్వాలి. కనీస వేతనాలు అమలు చేయాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించ చేయాలి.
- ప్రతి గ్రామంలో కమ్యూనిటీ భవనం నిర్మించి ఇవ్వాలి.
- మెమో నెం. 3347 /డి/2023 ప్రకారం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించాలి.
- కాగ్రేస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విదంగా జనగాం జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలి.

సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకట నరసయ్య, గౌనీ వెంకన్న, పామన గుండ్ల అచ్చాలు, బాల్న వెంకట మల్లయ్య, సంఘం రాష్ట్ర కార్యదర్శులు చౌగాని సీతారాములు, బూడిద గోపి, ఎస్ రమేష్ గౌడ్, బంద కింది అరుణ్, మద్దీ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో తాత్కాలిక ఆస్పత్రి

- 50 పడకలతో ఏర్పాటుకు మంత్రి ఆదేశం
- 72 మెడికల్ క్యాంపులు పెట్టాలని సూచన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమ్మక్క సారక్క జాతరకు వచ్చే భక్తులకు వైద్య సేవలందించేందుకు వీలుగా మేడారంలో తాత్కాలికంగా 50 పడకలతో ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. జాతరలో తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టీనా, డీఎంఈ డాక్టర్ త్రివేణి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, డీహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేడారంలోని ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 6 పడకలతో, స్పెషలిస్ట్ డాక్టర్లతో కూడిన మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర పరిసరాల్లో మొత్తం 30 మెడికల్ క్యాంపులు, జాతరకు పోయే రూట్లలో మరో 42 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి క్యాంపులో డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలనీ, అవసరమైన అన్ని రకాల మెడిసిన్, ఎమర్జెన్సీ మెడికల్ కిట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. 20 మొబైల్ మెడికల్ యూనిట్లు, 15 అంబులెన్సులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. జాతర వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అందువల్ల15 బైక్ అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుకుని పేషెంట్లను వీలైనంత త్వరగా మెడికల్ క్యాంపులు లేదా సమీపంలోని హాస్పిటళ్లకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. మెడికల్ క్యాంపుల్లో చికిత్స చేశాక, ఇంకా ఉన్నతస్థాయి వైద్యం అవసరమైతే ములుగు, ఏటూరునాగారం, పరకాల ఏరియా హాస్పిటల్స్‌కు, వరంగల్ ఎంజీఎంకు తరలించి వైద్యం అందించాలని మంత్రి సూచించారు. జాతర ప్రారంభం కావడానికి రెండు వారాల ముందు నుంచే మెడికల్ క్యాంపులు, ఆస్పత్రులను ప్రారంభించాలని ఆదేశించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలనీ, వాటిని ఉన్నతాధికారులు పరిశీలించాలని మంత్రి సూచించారు.

బీజేపీ పెద్ద కుటుంబం.. మనస్పర్థలు కామన్

బీఆర్ఎస్‌తో కలిసి వెళ్లబోం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ పార్టీ పెద్ద కుటుంబం లాంటిదనీ, చిన్నచిన్న మనస్పర్థలున్నప్పటికీ నేతలందరూ కలిసి పనిచేస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్‌తో కలిసి వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా వచ్చి ఓట్లపై సమీక్షించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. యువతను పార్టీలోకి పెద్ద ఎత్తున రప్పించేలా ముందుకెళ్తామన్నారు. కొత్త ఓటర్లను కలిసేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టబోతున్నామని చెప్పారు. మంగళవారం ఆర్గనైజేషన్ ఇన్‌చార్జులను ప్రకటిస్తామని తెలిపారు. సంక్రాంతి తర్వాత లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామన్నారు. తెలంగాణలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్-బీజేపీ మధ్యే పోటీ ఉంటుందనీ, తమకు ఎక్కువ సీట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మ్యానిఫెస్టో రూపకల్పన కోసం ప్రజల అభిప్రాయాలను తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 22న రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ట్రస్ట్ చేసే కార్యక్రమాలకు బీజేపీ మద్దతు ఉంటుందని తెలిపారు. ఆ కార్యక్రమం 150 దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం కాబోతున్నదన్నారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణను రేవంత్ సర్కారు ఎందుకు కోరుకోవడం లేదని ప్రశ్నించారు. బీజేపీని తట్టుకోలేకనే రాహుల్‌గాంధీ తన అధ్యక్ష పదవికి రాజీనామా చేసి పారిపోయాడని విమర్శించారు. మోడీని మూడోసారి ప్రధాని చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు.

ఇథనాల్ చిచ్చు

కర్షకుల జీవితాల్లో ఆందోళన



- పొలం రక్షణ కోసం పోరాటం
- ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని డిమాండ్

పంటలు నాశనం..పర్యావరణానికి హానికరం

- కొనసాగుతున్న దిలావర్‌పూర్, గుండంపల్లి రైతుల పోరాటం
- వర్షాలతో పంటలు ఎలా వేయాలని ఆవేదన

వ్యవసాయమే జీవనాధారంగా బతుకున్న వారి జీవితాల్లో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం చిచ్చురేపుతోంది. ఇన్నేండ్లు పొలాల్లో పంటలు వేసుకొని జీవనం సాగిస్తున్న కర్షకుల బతుకుల్లో ఒక్కసారిగా ఆందోళన రేగుతోంది. పచ్చని పంట పొలాల మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం వారి ఆందోళనకు కారణమవుతోంది. పంట పొలాలను నాశనం చేసే ఈ పరిశ్రమను ఇక్కడ్నుంచి తరలించాలని స్థానిక రైతులు పెద్దఎత్తున ఆందోళన చేపడుతున్నారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్, గుండంపల్లి రైతులు నెల రోజులుగా ఆందోళన బాటపట్టారు. కొన్ని రోజుల కిందట ఫ్యాక్టరీ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమం ఉద్రిక్తంగా మారగా.. 60మంది రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చి రైతులకు నిద్ర లేకుండా చేసింది. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వెనక్కు తీసుకుంటామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పింది. అయినా నిర్మాణ పనులు జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారికంగా ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతున్నారు. వీరికి వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు మద్దతు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడికి 'నవతెలంగాణ' బృందం వెళ్లింది. రైతులను పలుకరించింది.

కాలుష్యంతో పంటలు నాశనం



తమ జీవితాల్లో ఈ ఫ్యాక్టరీ నిర్మాణం అవరోధంగా మారుతోంది. ఈ పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం కారణంగా పంటలు నాశనమయ్యే పరిస్థితి ఉంటుంది. చిత్తనూరులో ఉన్న పరిశ్రమకు వద్దకు వెళ్లి ప్రత్యక్షంగా చూశాం. దుర్వాసన కారణంగా సమీప పొలాల్లోకి కూలీలు ఎవరూ రావడం లేదు. ఇప్పటికే వివిధ కారణాలతో పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఈ పరిశ్రమతో మరింత ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉంటుంది. శాంతియుతంగా నిరసన తెలిపిన రైతులపై అన్యాయంగా కేసులు నమోదు చేశారు.

రైతు విజయ్‌కుమార్, దిలావర్‌పూర్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, దిలావర్‌పూర్

పచ్చని పంట పొలాల్లోకి రసాయన పరిశ్రమలు రావడం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంతోపాటు గుండంపల్లి గ్రామాల మధ్య సుమారు 42 ఎకరాల్లో ఇథనాల్ పరిశ్రమ నిర్మితమవుతోంది. తొలుత రైతుల నుంచి భూమి సేకరించిన సమయంలో ఇక్కడ గోదాములు, రైస్ మిల్లులు నిర్మిస్తామని చెప్పడంతోనే మిన్నకుండిపోయారు. కానీ ఇక్కడ ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతోంది. మరోపక్క ఫ్యాక్టరీ నిర్మాణంపై ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టలేదని రైతులు చెబుతున్నారు. ఆ తర్వాత ఈ పరిశ్రమ ప్రారంభమైతే చుట్టుపక్కల పొలాలపై ప్రభావం పడుతుందని.. వ్యర్థాలతో పర్యావరణానికి హాని కలిగించడంతో పాటు దుర్వాసన వస్తుందని, జీవ వైవిధ్యానికి అవరోధంగా మారుతుందని భావించిన రైతులు పరిశ్రమ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుత నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరులో ఉన్న ఇలాంటి పరిశ్రమను రైతులు వెళ్లి పరిశీలించారు. అక్కడి భూములను చూశారు. అక్కడ ఈ పరిశ్రమ చుట్టుపక్కల సమీప పొలాల్లోకి దుర్వాసన కారణంగా పనులు చేసేందుకు కూలీలు ఎవరూ రావడం లేదని తెలుసుకున్న రైతులు ఇక్కడ ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించారు. సుమారు ఆరు నెలల నుంచి వివిధ రూపాల్లో నిరసన కొనసాగుతోంది.

అన్యాయంగా కేసులు నమోదు చేశారు



పరిశ్రమను రద్దు చేయాలని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ఫ్యాక్టరీ వద్దకు వెళ్లాం. పోలీసులు లాఠీచార్జి చేశారు. అక్కడే ఓ వాహనానికి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఫ్యాక్టరీ వాళ్లే విధ్వంసం సృష్టించినట్టు ప్రచారం జరుగుతోంది. కానీ రైతులపై అన్యాయంగా కేసులు నమోదు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులపై మోపిన కేసులను వెనక్కి తీసుకోవాలి.

రైతు భోజారెడ్డి, గుండంపల్లి

గ్రామాల్లో శాంతియుత నిరసన

దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మితమవుతున్న ఈ పరిశ్రమ చుట్టుపక్కల సుమారు 2వేల ఎకరాల్లో పంట పొలాలు ఉన్నాయి. భవిష్యత్‌లో ఈ పొలాలకు హాని జరుగుతుందనే కారణంగా ఈ ఫ్యాక్టరీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ రెండు గ్రామాల ప్రజలు ప్రతి నిత్యం నిరసన తెలుపుతున్నారు. ఊరంతా ఒక్కటై నిరసన గళం వినిపిస్తున్నారు. ఫ్యాక్టరీకి సమీపంలోనే గోదావరి నది ఉండటంతో అక్కడ్నుంచి నీటిని తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయని చెబుతున్నారు. రైతులకు అండగా సీపీఐ(ఎం)తో పాటు వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి నిరసనలో భాగస్వాములవుతున్నాయి.

నవతెలంగాణ మానవి 11 కరీంనగర్
www.navatelangana.com
మంగళవారం 9 జనవరి 2024

మనసుని క్లీన్ చేసుకోండి...

మనపై మనకి డౌట్ ఉండడం, భయం, ఆందోళన... ఇలాంటి వన్నీ మనల్ని వెనక్కి నెట్టేసేవే. వీటన్నింటిని ఎప్పటికప్పుడు హార్ట్ ఫుల్‌గా క్లీన్ చేసుకోవడం చాలా మంచిది. దీని వల్ల మీలో పాజిటీవిటి పెరుగుతుంది. వీటన్నింటి స్థానంలో చేయాలన్న ఆశ, ఆనందం, సానుకూలతలను నింపితే మీలో కాన్ఫిడెన్స్ పెరుగుతుంది.



ఆత్మవిశ్వాసం నింపుకోండి



ఆత్మవిశ్వాసం ఉండాలే గానీ దేన్నైనా సాధించగలమన్న నమ్మకం వస్తుంది. వ్యక్తిగత విషయాల్లో అయినా వృత్తిలో అయినా ఆత్మవిశ్వాసంతో తీసుకునే నిర్ణయాలు చేసే పనుల్లో మంచి ఫలితాలు వస్తాయి. ఇతరులతో సత్సంబంధాలు కొనసాగించగలరు. కొత్త విషయాలు నేర్చుకోగలరు. ఏదైనా ఒక ప్రాజెక్ట్‌కి మిమ్మల్ని నాయకత్వం వహించమని అడిగినప్పుడు మీలో ఆ సామర్థ్యం లేదని బాధడుతున్నారా.. ఈ భయం మంచిదే అంటున్నారు మానసిక నిపుణులు. మీ సామర్థ్యాలు పెంచుకోవడానికి, వ్యక్తిగా ఎదగడానికి ఈ భయం తోడ్పడుతుంది. అయితే ఇదే నిరంతరంగా కొనసాగితే అది మీ ఫెయిల్యూర్ అని చెప్పొచ్చు. కాబట్టి ఒక్కసారి మనలో విశ్వాసం పెరిగితే మనం చేయలేమన్న భావన తుడిచిపెట్టుకుపోతుంది. మరి అలాంటి ఆత్మ విశ్వాసం పెరగాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం...

జీవితం పోటీ కాదు. ఎవరి జీవితాలు వారివి. ఒకరి స్థితిగతులు ఎలా ఉంటాయనేది వారి చేతుల్లోనే ఉంటుంది. కాబట్టి ఇతరులతో పోల్చి చూసుకోవడం మానేయాలి. ఇతరులతో పోల్చుకోవడం వల్ల అసూయ ఏర్పడుతుందంట. దాని వల్ల వ్యక్తులు తమను తాము తక్కువ చేసుకోవడంతో ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుందని గత పరిశోధనల్లో తేలింది.

మంచి వ్యక్తులతో స్నేహం

మనం ఎలాంటి వారితో స్నేహం చేస్తున్నామో గుర్తిస్తే మనమేంటో అర్థమవుతుంది. మంచి వ్యక్తులు, సానుకూల దృక్పథంతో ఉండేవారు, మన మంచిని కోరే వారితో సన్నిహితంగా మెలగడం అలవాటు చేసుకోవాలి. వారి ప్రభావం మనపై కొంతైనా పడుతుంది. కాబట్టి వారి మాటలు, చర్యలు మనలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి. ఎవరైనా చెడువైపు లాగాలని ప్రయత్నిస్తే వారితో స్నేహానికి గుడ్‌బై చెప్పేయండి.

ఆరోగ్యం జాగ్రత్త

ఆరోగ్యం బాగుంటే కొండంత బలం. దీని వల్ల ఆత్మ విశ్వాసం కూడా లభిస్తుంది. నిత్యం హుషారుగా ఉండేవారిలో ఆత్మవిశ్వాసం ఎక్కువగా ఉండటాన్ని గమనించొచ్చు. కాబట్టి ప్రతిరోజు వ్యాయమం చేస్తూ పోషకాహారం తింటూ ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోండి. దీని వల్ల క్రమంగా మీలో ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది.

తప్పులు మన్నించుకోండి

మీ వల్ల ఓ పొరపాటు జరిగితే దాన్నే తలచుకుంటూ బాధపడాల్సిన అవసరం లేదు. మీ తప్పులను మీరే క్షమించుకోండి. మరోసారి అలా జరక్కుండా చూసుకోవాలని బలంగా సంకల్పించుకోండి. దీని వల్ల మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.



ఆ మాటలు వద్దు

నా వల్ల కాదు, అసలు చేయగలనా?, ఇది అసాధ్యం వంటి మాటలు మీ నోటి వెంట రాకుండా చూసుకోండి. అలాంటి మాటలు మిమ్మల్ని మరింత కుంగదీస్తాయి. దేన్నైనా నేను సాధించగలను అనే భావనతో ఉండాలి. నేను చేయగలను, సాధించగలను అని మీకు మీరే తరచూ చెప్పుకుంటూ ఉండటం వల్ల మీలో ఆత్మవిశ్వాసం రెట్టింపవుతుంది.

సక్సెస్ పోస్టర్..

మీ బెడ్‌రూమ్‌లో మీ చిన్నప్పటి నుండి ప్రస్తుతం వరకూ మీరు సక్సెస్ అయిన విషయాలు, విజయాలను పోస్టర్‌లా క్రియేట్ చేసి పెట్టండి. రన్నింగ్ రేసులో విన్నింగ్, స్కాలర్ షిప్ విన్ అవ్వడం, ఫెయిల్ అవుతారనుకున్న సమయంలో సి గ్రేడ్ రావడం ఇలా ఏవైనా మీరు హ్యాపీగా ఫీల్ అయిన విజయాలన్నింటిని పోస్టర్‌లా అంటించి పెట్టుకోండి. రోజూ వీటిని చూడడం వల్ల మీకు ఓ పాజిటివిటీ వస్తుంది. ఇప్పటివరకూ మీరు సాధించిన విజయాలను ఒక చోట రాసుకోండి. దీని వల్ల కూడా మీలో సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెరుగుతుందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. బాధలో ఉన్నప్పుడు వీటిని చదువుతూ ఉండండి.

నమ్మకం...

అందరం తప్పులు చేస్తాం. అలా తప్పులు చేయడం వల్లే చాలా విషయాలను నేర్చుకోగలుగుతాం. కాబట్టి.. కొన్ని మార్చుకోలేని వాటిని అంగీకరించి వాటిని ఎలా పాజిటివిటీగా మార్చుకోగలరో మార్చుకుని సక్సెస్ అవ్వండి.

లక్ష్యాలను విడదీయండి..

కొన్నిసార్లు పెద్ద లక్ష్యాను చూస్తే వాటిని చేరుకోండా అసాధ్యం అనిపిస్తుంది. కానీ మీరు దానిని రోజుకి కొంత చేసి చూడండి.. అంటే విభజించండి. ఇలా చేయడం వల్ల మీరు గడువుల ప్రకారం మీరు లక్ష్యాన్ని సాధిస్తారు.

భయాలను ఎదుర్కోండి

ప్రతి మనిషికి భయాలు ఉంటాయి. కానీ, ఆ భయాలను జయిస్తేనే విజయాలు దక్కుతాయి. సవాలు ఎదురైతే భయపడి దాని నుంచి తప్పుకునే ప్రయత్నం చేయొద్దు. సవాల్‌ను ఎదుర్కోండి. తొలి ప్రయత్నంలో ఓడినా భయం తొలగి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకునే అవకాశం లభిస్తోంది. దీంతో భవిష్యత్‌లో విజయాలను అందుకునే ఆస్కారముంది.



వీటిని తప్పని సరిగా తినాలని తెలుసా..!

శీతాకాలంలో మంచు వల్ల కాలుష్యం పెరుగుతూ ఉంటుంది. అటువంటి పరిస్థితిలో దగ్గు, కఫం చాలా సమస్యాత్మకంగా మారతాయి. డాక్టర్ దగ్గరకు వెళితే చాలా మందులు రాస్తాడు. దీంతో పాటు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తుంటారు. అయితే సమస్యను నుంచి కాస్త ఉపశమనం కలిగించేవి ఎండు నల్ల ద్రాక్ష... మరి వీటి వల్ల ఎటువంటి ఉపయోగాలున్నాయో ఓ సారి తెలుసుకుందామా!



- చలికాలంలో నల్ల ఎండు ద్రాక్షను తీసుకుంటే, దగ్గు, కఫం నుండి ఉపశమనం పొందడమే కాకుండా, కడుపుకు కూడా చాలా మేలు చేస్తుంది. అంతే కాకుండా చాలా సమయం పాటు కడుపు నిండుగా ఉన్న ఫీలింగ్ కలిగిస్తుంది.
- నల్ల ఎండు ద్రాక్ష బరువు తగ్గడంలో మీకు సహాయపడుతుంది. కొలెస్ట్రాల్, రక్తపోటు స్థాయిలను నియంత్రణలో ఉంచేందుకు దోహద పడుతుంది.
- వీటిని రాత్రంతా నీటిలో నానబెట్టడం ద్వారా అందులోని యాంటీ-ఆక్సిడెంట్ల పరిమాణం పెరుగుతుంది. తద్వారా ఆరోగ్య ప్రయోజనాలు అనేక రెట్లు పెరుగుతాయి.
- పచ్చి ద్రాక్ష కంటే ఎండు ద్రాక్ష ఎక్కువ మేలు చేస్తుంది. వీటిని కేక్, ఖీర్, బర్ఫీ మొదలైన అనేక రకాల డెజర్ట్‌లలో కూడా ఉపయోగిస్తారు.
- నల్ల ఎండుద్రాక్షలో జుట్టు రాలడాన్ని తగ్గించే గుణం ఉంటుంది.
- శ్వాసకోశాన్ని మెరుగుపరుస్తుంది. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీనికి కారణం ఇందులో ఇనుము, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఉన్నాయి.
- వీటితో పాటు ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. దీని వల్ల మలబద్ధకం తగ్గిస్తుంది. తద్వారా ప్రేగులలో సూక్ష్మక్రిములు పెరగవు.
- ఇది ఎసిడిటీని నియంత్రిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.
- రక్తహీనతను నివారిస్తుంది. వీటిని నేరుగా తిన్నా లేదా నీటిలో నానబెట్టి తిన్నా శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. రక్తహీనతతో బాధపడుతున్న వ్యక్తులు ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఎండుద్రాక్షను తినడం మంచిది. ఇది రక్తంలో నైట్రిక్ ఆక్సైడ్‌ను పెంచుతుంది. ఇది రక్త ప్రసరణను సాఫీగా చేస్తుంది.
- అయితే నీటిలో నానబెట్టడం వల్ల దానిలోని విటమిన్లు, ఖనిజాలను పూర్తిగా విడుదల చేస్తుంది.
- రక్తంలో షుగర్ లెవల్స్ పెంచదు.
- వీటిని తీసుకోవడం వల్ల కండరాలు ఫిట్‌గా ఉంటాయి.
- ఇందులో ఉండే కాల్షియం ఎముకల దృఢత్వానికి దోహదం చేస్తుంది.
- జుట్టు పొడిబారడం, చిట్లిపోవడం వంటి సమస్యలకు ప్రతి రోజూ వీటిని తినడం వల్ల ఇందులో పెద్ద మొత్తంలో ఉండే విటమిన్ సి సమస్యను పరిష్కరిస్తుంది.
- బీపీ సమస్య ఉంటే నల్ల ఎండుద్రాక్ష ఉపశమనాన్ని అందిస్తుంది. ఎండుద్రాక్షలో అధిక పొటాషియం స్థాయిలు రక్తంలో సోడియంను తగ్గించి, రక్తపోటును నియంత్రణలో ఉంచడంలో సహాయపడతాయి.
- నల్ల ఎండుద్రాక్ష రుతుస్రావం సమయంలో నొప్పి నుండి ఉపశమనం అందించేందుకు దోహదం చేస్తుంది.
- ఇది చెడు కొలెస్ట్రాల్‌తో పోరాడుతుంది.శక్తి స్థాయిలను మెరుగుపరుస్తుంది.

టిప్స్

బొప్పాయి గుజ్జులో తేనె, పాలు, బాదం నూనె చెంచా చొప్పున వేసి కలపాలి. ఈ మిశ్రమంతో కాళ్లు, చేతులు బాగా రుద్దుకుంటే మృదువుగా మారుతాయి.



కార్పొరేట్ మతతత్వ విధానాలను ఎండగట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

సీఐటీయూ అఖిలభారత అధ్యక్షులు డాక్టర్ హేమలత, వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సీఐటీయూ అఖిలభారత కోశాధికారి ఎం. సాయిబాబు మాట్లాడుతూ.... మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని విమర్శించారు. ఎన్నో త్యాగాలు చేసి, పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కుదించి, నాలుగు లేబర్ కోడులుగా తీసుకొచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నదని విమర్శించారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీ పథకానికి నిధులలో కోత పెట్టిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయన్నారు. వాటిని నియంత్రించటంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన సర్కారు.., ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేయలేదని ఎద్దేవా చేశారు. ఆ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉన్న ఉపాధి అవకాశాలు కూడా పోతున్నాయన్నారు. "మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి. కార్పొరేట్లని తరిమికొట్టాలి. దేశాన్ని రక్షించాలి." అనే నినాదంతో దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలకు యావత్ ప్రజానీకం సన్నద్ధమవుతున్నారని తెలిపారు. ఈ ఆందోళనల్లో అన్ని కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, మహిళా, విద్యార్థి లోకమంతా భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జే వెంకటేష్, భూపాల్, ఎస్వీ రమ, మల్లికార్జున్, జయలక్ష్మి ,కూరపాటి రమేష్, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పీ జంగారెడ్డి, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బొప్పని పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి రైతుల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

మిర్చి రేటు రూ.20,100 పలికింది. రోజురోజుకు మిర్చి ధర తగ్గుతున్నప్పటికీ రైతులు అమ్ముకోక తప్పడం లేదు. జెండా పాటను అనుసరించి మిగతా సరుకులు రూ.18 వేల నుంచి 20వేల మధ్య రేటు ఉంటుందని రైతులు భావించారు. కానీ వ్యాపారులు మిగతా సరుకు కేవలం రూ.12 వేల నుంచి 13వేలుగా ధర నిర్ణయించడంతో మిర్చి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మార్కెట్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మార్కెట్ అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై ధరలు తగ్గించారని ఆరోపించారు. ఎరువులు, కూలీలు, పురుగుమందుల ఖర్చులు పెరిగిపోయాయని.. ఈ క్రమంలో కనీసం మద్దతు ధర రాకుండా తాము పంటలను వేసి ఉపయోగం ఎంటని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వాణిజ్య పంటలు వేసి బియ్యం కొనుక్కునే పరిస్థితి లేదని నిప్పులు చెరిగారు. జెండా పాటను అనుసరించి వాస్తవ ధర నిర్ణయించాల్సిందేనని డిమాండ్ చేశారు. వ్యాపారులకు, మార్కెట్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిస్థితి విషమించడంతో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రసాద్ రావు, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ, మామునూరు ఏసీపీ రైతులతో చర్చలు జరిపారు. తక్కువ ధర పలికిన సరుకును మరోసారి పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. దాంతో మధ్యాహ్నం కాంటాలు యధావిధిగా కొనసాగించారు.

మూడు పూలు...ఆరు కాయలు

(మొదటిపేజీ తరువాయి)

పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉన్నాయని అర్థమవుతుంది. ట్రంప్ తన వ్యాపార కార్యకలాపాల ద్వారా ప్రధాని నరేంద్ర మోడీతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నారు. దేశాధ్యక్షుడు కావడానికి ముందే తన వ్యాపార ప్రయోజనాల కోసం ట్రంప్ మన దేశానికి వచ్చారు. ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించినప్పుడు కూడా శ్వేతసౌధంలో ట్రంప్‌పై ప్రశంసలు కురిపించారు.

ఈ రెండింటిలోనే భారీగా ఖర్చు

ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా ఉన్న సమయంలో న్యూయార్క్ నగరంలోనూ, వాషింగ్టన్ డీసీలోనూ ఆయన ఆస్తులలో భారత ప్రభుత్వం కనీసం 2,82,764 డాలర్లు ఖర్చు చేసింది. వరల్డ్ టవర్‌లో రెండు యూనిట్ల ఏర్పాటుకు అయిన ఖర్చును మన ప్రభుత్వమే భరించింది. ట్రంప్ అధ్యక్షుడుగా ఉన్నంతకాలం ఈ టవర్లు మన ప్రభుత్వ అధీనంలోనే ఉండేవి. వాషింగ్టన్ డీసీలో ట్రంప్‌కు చెందిన ఇంటర్నేషనల్ హోటల్‌లో అమెరికాలోని భారత రాయబారులు అనేకసార్లు బస చేశారు. ఆ ఖర్చంతా మన ప్రభుత్వమే భరించింది.

కమిటీకి మజార్స్ ఇచ్చిన పత్రాల ప్రకారం...ఐరాసలో భారత శాశ్వత కార్యకలపాల కోసం న్యూయార్క్‌లోని ట్రంప్ టవర్స్‌లో రెండు యూనిట్లను తీసుకున్నారు. 2018లో వీటి కోసం 66,046 డాలర్లు చెల్లించారు. ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో ఈ యూనిట్ల కోసం భారత ప్రభుత్వం 2,64,184 డాలర్లు ఖర్చు చేసి ఉంటుందని అంచనా. అదనపు ఛార్జీలను ఇందులో కలపలేదు. ఒక్క 2018లోనే 66,046 డాలర్ల కామన్ ఛార్జీలతో పాటు అదనపు ఛార్జీలు, ఫీజుల రూపంలో 13,983 డాలర్లు చెల్లించారు. వాషింగ్టన్‌లోని ట్రంప్ ఇంటర్నేషనల్ హోటల్‌లో 2017 ఫిబ్రవరి, మార్చిలో ఎనిమిది మంది భారత దౌత్యవేత్తలు బస చేసి 18,580 డాలర్లు చెల్లించారు.

కుటుంబ ప్రాజెక్టులు సైతం...

ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా ఉన్న కాలంలో ఆయన సంతానం డొనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్‌ల నేతృత్వంలోని ట్రంప్ ఆర్గనైజేషన్ మన దేశంలో అనేక ప్రాజెక్టులు చేపట్టింది. ట్రంప్ వ్యాపారాలలో భారతీయ మార్కెట్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని 'ఓపెన్‌సీక్రెట్స్' అనే పరిశోధనా సంస్థ తెలిపింది. భారత్ కంటే మరే దేశానికీ ట్రంప్ ఆర్గనైజేషన్ ప్రాధాన్యత ఇవ్వలేదని ఈ సంస్థ వ్యాఖ్యానించింది. అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ట్రంప్ ఆస్తులలో, ఆయన వ్యాపారాలలో భారత్ పెట్టిన ఖర్చు ఆయనకు అనేక మిలియన్ డాలర్ల ఆదాయాన్ని అందించింది. దేశాధ్యక్షుడు కావడానికి ముందే ఆయన మన దేశంలో దశాబ్ద కాలానికి పైగా వ్యాపారాలు నిర్వహించారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించే సమయానికి ఐదు ప్రాజెక్టులు వివిధ దశలలో ఉన్నాయి. ట్రంప్ అనేక మంది ప్రముఖ వ్యాపారవేత్తలతో కలిసి భాగస్వామ్యాలు నెరిపారు. వీరికి రాజకీయాలతో కూడా సంబంధం ఉండడం గమనార్హం. ట్రంప్ వ్యాపార భాగస్వాములలో అనేక మందిపై మోసం, దుష్ప్రవర్తన వంటి ఆరోపణలు ఉన్నాయి. ఆయా కంపెనీలపై విచారణలు కూడా జరిగాయి.

అటకెక్కిన విచారణలు

అమెరికా అధ్యక్షుడుగా ఎన్నిక కావడానికి ముందే ప్రధాని మోడీని ప్రసన్నం చేసుకునేందుకు ట్రంప్ అనేక ప్రయత్నాలు చేశారు. మోడీ ప్రధాని అయిన కొద్ది కాలానికి ఆయన ముంబయి వచ్చి మోడీపై ప్రశంసలు కురిపించారు. ట్రంప్ వ్యాపార భాగస్వామి మంగళ్ ప్రభాత్ లోథా బీజేపీ ఎమ్మెల్యేగా సుదీర్ఘ కాలం పనిచేశారు. లోథా కంపెనీలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో 2013లో వాటిపై విచారణ జరిగింది. అయితే మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత లోథా, ట్రంప్ భాగస్వాములుగా ఉన్న ముంబయి టవర్ ప్రాజెక్టుకు అవరోధాలు తొలగిపోయాయి. విచారణలన్నీ అటకెక్కాయి. మోడీ హయాంలో భారత్‌లో వ్యాపారాలు నిర్వహించాలని భావిస్తున్నట్లు 2014లో జరిపిన పర్యటనలో ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆయన ఆ పర్యటనలో స్థానిక మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తూ మోడీని పొగడ్తలతో ముంచెత్తారు.

భారత వ్యాపారులతో భాగస్వామ్యాలు

మన దేశంలో ట్రంప్ చేపట్టిన అనేక రియల్ ఎస్టేట్ వెంచర్లు బీజేపీతో కుటుంబ సంబంధాలున్న కంపెనీల ద్వారానే నడిచాయి. ట్రంప్ ప్రాజెక్టులకు మన అధికారులు పలు విధాలుగా అండదండలు అందించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులలో రుణాలు సైతం ఇప్పించారు. అమెరికా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టే సమయంలో కూడా ట్రంప్ అనేక మంది భారతీయ వ్యాపార భాగస్వాములను కలిశారు. ఎన్నికైన వారం రోజుల తర్వాత న్యూయార్క్‌లోని ట్రంప్ టవర్స్‌లో ముగ్గురు భారత వ్యాపారులతో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా వ్యాపార, రాజకీయ అంశాలు చర్చకు వచ్చాయి. ట్రంప్ తరచూ తనపై కురిపించిన ప్రశంసల జల్లులను మోడీ ఎప్పుడూ మరచిపోలేదు. ఆయన కూడా సందర్భం వచ్చినప్పుడల్లా ట్రంప్‌ను కొనియాడేవారు.

ఇబ్బడి ముబ్బడి ఆదాయం

మోడీ శ్వేతసౌధాన్ని సందర్శించిన తర్వాత వైట్‌హౌస్ ప్రతినిధిగా ఇవాంకా ట్రంప్, ట్రంప్ ఆర్గనైజేషన్ అధిపతిగా డొనాల్డ్ ట్రంప్ జూనియర్ మన దేశానికి తరచూ వచ్చే వారు. మోడీ ఆహ్వానం మేరకు ట్రంప్ సతీమణి కూడా హైదరాబాద్ వచ్చి అంతర్జాతీయ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో పాల్గొన్నారు. ట్రంప్ సతీమణి భారత పర్యటన తర్వాత కొద్ది కాలానికే రాజధాని న్యూఢిల్లీ శివారులోని గురుగావ్‌లో ట్రంప్ టవర్ల నిర్మాణానికి ఆఘమేఘాల మీద అనుమతులు మంజూరయ్యాయి. ట్రంప్ జూనియర్ మన దేశానికి వచ్చినప్పుడు మోడీతో ఏకాంత సమావేశం జరిపారు.

తన తండ్రి అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ట్రంప్ జూనియర్ మన దేశంలో వ్యాపార విస్తరణకు కృషి చేశారు. 2019లో ఆయన న్యూఢిల్లీలోని ట్రంప్ టవర్స్‌లో ఫ్లాట్ల కొనుగోలుదారులతో సమావేశమయ్యారు. కొనుగోలుదారులు ఫ్లాట్లలోకి ప్రవేశించక ముందే పది నుండి యాభై లక్షల డాలర్ల వరకూ లైసెన్స్ ఫీజు చెల్లించారు. తన పదవీకాలంలో ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి ఏటా లక్ష డాలర్ల నుండి పది లక్షల డాలర్ల వరకూ సంపాదించానని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. కొల్‌కతాలోని డీటీ టవర్స్ ద్వారా ఏడాదికి లక్ష నుండి పది లక్షల డాలర్ల వరకూ ఆర్జించానని కూడా తెలిపారు. అధ్యక్షుడుగా ఉన్న చివరి సంవత్సరంలో కూడా ఈ వెంచర్ ద్వారా ట్రంప్‌కు యాభై వేల నుండి లక్ష డాలర్ల ఆదాయం లభించింది.

పరస్పర మద్దతుతో...

అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు భారత్‌లోని ట్రంప్ వ్యాపారాలు దినదిన ప్రవర్ధమానమై విలసిల్లాయి. ట్రంప్, మోడీ...వీరిద్దరూ ఒకరికొకరు మద్దతు ఇచ్చుకుంటూ బలమైన వ్యక్తిగత సంబంధాలు కొనసాగించారు. ద్వైపాక్షిక పర్యటనలు నిర్విరామంగా జరిగాయి. మత స్వేచ్ఛకు మోడీ రక్షకుడంటూ భారత్‌లో పర్యటించిన ప్రతిసారీ ట్రంప్ పొగిడే వారు. అధ్యక్ష బాధ్యతల నుండి వైదొలిగే సమయంలో కూడా భారత్‌తో నెలకొల్పిన ప్రత్యేక సంబంధాల ప్రాధాన్యతను ప్రస్తావించారు. గత సంవత్సరం ఆయన ఓ ఇంటర్వ్యూ ఇస్తూ 'భారత్‌కు నా కంటే మంచి స్నేహితుడు ఉన్నాడని నేను అనుకోను. అది నేను ఏర్పరచుకున్న సంబంధాలలో ఒకటని మీకు తెలుసు' అని వ్యాఖ్యానించారు.

పార్టీ పనితీరులో మార్పులు చేయాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ అడ్డగోలుగా హామీలనిచ్చిందని కేటీఆర్ ఈ సందర్భంగా విమర్శించారు. అనేక వాగ్దానాలపై ఇప్పటికే ఆ పార్టీ దాటవేత ధోరణిని అవలంభిస్తోందని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీ సాక్షిగా నిరుద్యోగ భృతిపై తప్పించుకునే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. అప్పులు, శ్వేతపత్రాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలోని గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేస్తామంటూ సర్కారు ప్రకటించిందని అన్నారు. దళితబంధుపై ముఖ్యమంత్రి రేవంత్ నోరు మెదపటం లేదని చెప్పారు. రైతుబంధుపై ప్రభుత్వం అన్నదాతలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇలాంటి పథకాలను రద్దు చేస్తే బాధితులతో కలిసి పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. తమ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరోజూ ప్రజలను క్యూ లైన్లలో నిలబెట్టలేదని తెలిపారు. కానీ ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ సర్కారు జనాన్ని వరసల్లో నిలబెట్టి, ఇబ్బందుపాల్జేసిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టేలా క్షేత్రస్థాయిలో కృషి చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ప్రజా దర్బార్ కాదు.. డ్రామా దర్బార్... : మాజీ మంత్రి వేముల

ప్రజా దర్బార్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామా దర్బార్‌ను నడుపుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత వేముల ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకూ ఎంతమంది సమస్యలను పరిష్కరించారనే విషయమై ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిజామాబాద్ ఎంపీ స్థానంపై సమీక్ష అనంతరం సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వేముల మాట్లాడారు. కొత్త జిల్లాలకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్ ఎంతో దూరదృష్టితో ఆలోచించి, నిర్ణయాలు తీసుకున్నారని ఆయన చెప్పారు. కానీ కేసీఆర్ మీద అక్కసుతో సీఎం రేవంత్ జిల్లాల సంఖ్యను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన వాటన్నింటినీ రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలను ముట్టుకుంటే తేనె తుట్టెను కదిలించినట్టేనని హెచ్చరించారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ తదితరులు పాల్గొన్నారు.

రాజస్థాన్‌లో బీజేపీకి ఎదురు దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

విజయం సాధించిన రూపేందర్‌ను మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అభినందించారు. ప్రవర్తనా నియమావళికి, నైతికతకు తిలోదకాలు ఇచ్చిన బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పారని ఆయన అన్నారు. శాసనసభ్యుడు కాని సురేందర్‌పాల్‌ను బీజేపీ ఏకంగా మంత్రిని చేసిందని, ఉప ఎన్నికలో నిలబెట్టిందని, దీనిని ప్రజలు తిరస్కరించారని తెలిపారు. గత నెల 30న జరిగిన మంత్రిమండలి విస్తరణలో చట్టసభ సభ్యుడు కాని సురేందర్‌పాల్‌ను మంత్రిగా నియమించారు. దీనిపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఓ వైపు ఉప ఎన్నికలో పోటీ చేస్తూనే మరోవైపు మంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమే అవుతుందని విమర్శించింది. కాగా కాంగ్రెస్ అభ్యర్థి గుర్మీత్ సింగ్ కూనర్ మృతి కారణంగా కరణ్‌పూర్‌లో ఎన్నిక వాయిదా పడింది. ఈ నేపథ్యంలో 199 స్థానాలకే (మొత్తం స్థానాలు 200) ఎన్నికలు జరిగాయి. కూనర్ కుమారుడు రూపీందర్ సింగ్‌నే కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిగా ఉపఎన్నిక బరిలో నిలిపింది.

బస్సుల్లో ఒరిజినల్ కార్డులే చూపాలి

(మొదటిపేజీ తరువాయి)

అడ్రస్ ఉండదనీ, అందువల్ల ఉచిత ప్రయాణానికి చెల్లుబాటు కాదని పేర్కొన్నారు. ఇప్పటికీ కొందరు ప్రయాణీకులు స్మార్ట్ ఫోన్లలో, ఫొటో కాపీలు, కలర్ జిరాక్స్‌లు చూపిస్తున్నారనీ, ఇవేవీ ఉచిత ప్రయాణానికి చెల్లుబాటు కావని తేల్చిచెప్పారు. ఈ విషయంలో ఆర్టీసీ సిబ్బందితో వాగ్వివాదం వల్ల ఇతర ప్రయాణీకులు ఇబ్బందిపడుతున్నారనీ, ప్రయాణ సమయం కూడా పెరుగుతున్నదని చెప్పారు. మహిళా ప్రయాణీకులందరూ ఒరిజనల్ గుర్తింపు కార్డులు చూపించి జీరో టికెట్ తీసుకోవాలని కోరారు. ఒరిజినల్ గుర్తింపు కార్డు లేకుంటే కచ్చితంగా డబ్బు చెల్లించి టికెట్ తీసుకోవాల్సిందేనన్నారు. మహాలక్ష్మి పథకం తెలంగాణ ప్రాంత మహిళలకే వర్తిస్తుందనీ, ఇతర రాష్ట్రాల మహిళలు చార్జీ చెల్లించి విధిగా టికెట్ తీసుకుని సహకరించాలని కోరారు.

ఉచితమే కాబట్టి, జీరో టికెట్ తీసుకోవడం ఎందుకు? అని కొందరు ప్రయాణీకులు సిబ్బందితో వాదనకు దిగుతున్నారనీ, ఇది సరికాదనీ, జీరో టికెట్ల జారీ ఆధారంగానే ఆ డబ్బును ఆర్టీసీకి ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేస్తుందని వివరించారు.

జీరో టికెట్ లేకుండా ప్రయాణిస్తే ఆర్టీసీకి నష్టం చేసిన వారవుతారనీ, అందువల్ల ప్రతి మహిళ తప్పనిసరిగా జీరో టికెట్ తీసుకోవాలని చెప్పారు. జీరో టికెట్ తీసుకోకుండా ప్రయాణిస్తే...దాన్ని చెకింగ్‌లో గుర్తిస్తే డ్రైవర్, కండక్టర్ల ఉద్యోగం ప్రమాదంలో పడుతుందనీ, టిక్కెట్‌లేని ప్రయాణీకులకు రూ.500 వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ప్రజలు ఈ విషయంలో ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆ ఇద్దరు ఇమడగలరా?!

టీ20 జట్టులో రోహిత్, కోహ్లి

విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ. ఇద్దరూ భారత క్రికెట్ సూపర్‌స్టార్స్. ప్రపంచ క్రికెట్ మేటి క్రికెటర్లుగా ఎదిగినా.. ఐసీసీ ప్రపంచకప్ అందుకునే కల తీరలేదు. 2023 ఐసీసీ ప్రపంచకప్ వేటలో ఆఖరు అడుగు తడబాటుతో రోహిత్ శర్మ నైరాశ్యంలో పడిపోయాడు. కోహ్లి 2011 ప్రపంచకప్ నెగ్గినా.. భారత్‌కు మరో కప్పు అందించాలనే పట్టుదల ఎక్కువగా ఉంది. మరో వన్డే వరల్డ్‌కప్‌కు రోహిత్, కోహ్లి అందుబాటులో ఉండేది లేనిది అనుమానమే. అందుకే 2024 టీ20 ప్రపంచకప్‌లో మరోసారి వేట మొదలెట్టేందుకు ఇద్దరూ సిద్ధమవుతున్నారు. కుర్రాళ్లతో కుదురుకున్న టీ20 జట్టులో విరాట్, రోహిత్‌లను చేర్చటం మంచి నిర్ణయమేనా? అనే చర్చ నడుస్తుంది.



- ప్రపంచకప్ బృందంలో చోటు ఖాయమే
- పొట్టి ఫార్మాట్‌లో స్టార్స్ ప్రభావంపై చర్చ

నవతెలంగాణ క్రీడావిభాగం

2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్. ఇంగ్లాండ్‌తో చివరగా టీ20 మ్యాచ్ ఆడేసిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు పొట్టి ఫార్మాట్‌కు ఏడాది పాటు దూరమయ్యారు. 2024 టీ20 ప్రపంచకప్ సమీపిస్తుండగా.. భారత క్రికెట్ సూపర్ స్టార్స్ ఇద్దరూ టీ20 జట్టులో అడుగుపెట్టారు. దక్షిణాఫ్రికాతో వైట్‌బాల్ సిరీస్‌కు అందుబాటులోని ఉండని రోహిత్, కోహ్లి.. స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో టీ20 సిరీస్‌లో రీ ఎంట్రీ ఇస్తున్నారు. పునరాగమనంలో రోహిత్ శర్మ నాయకత్వ పగ్గాలు అందుకోగా.. విరాట్ కోహ్లి టాప్ ఆర్డర్‌లో నం.3 బ్యాటర్ స్థానం దక్కించుకోనున్నాడు. 2007 టీ20 ప్రపంచకప్ తర్వాత భారత్ మళ్లీ ఆ ట్రోఫీ సాధించలేదు. 2014లో చేరువైనా.. లంక చేతిలో నిరాశే ఎదురైంది. 2024లో పొట్టి కప్పు కొట్టాలనే గట్టి పట్టుదలతో కుర్ర జట్టును సిద్ధం చేసింది బీసీసీఐ. కానీ వేటకు ఆరు నెలల ముంగిట అనూహ్యంగా ఇద్దరు సీనియర్ క్రికెటర్లను జట్టులోకి తీసుకొచ్చింది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ రాక టీ20 ప్రపంచకప్‌లో భారత్ మేలు చేయగలదా? కుర్రాళ్లతో దూసుకెళ్తోన్న ఈ ఫార్మాట్‌లో ఈ ఇద్దరు ఇమడగలరా? ఇది పురోగమన చర్య అవుతుందా? ఈ ప్రశ్నలకు బదులిచ్చేందుకు బీసీసీఐ ఏమాత్రం సిద్ధంగా లేదు. అఫ్గాన్ సిరీస్‌కు జట్టు ప్రకటన అనంతరం సీనియర్ సెలక్షన్ కమిటీ ప్రెస్‌మీట్‌కు దూరంగా ఉండటం ఈ కోణంలోనే చూడాల్సి ఉంటుంది.

విరాట్‌కు సవాల్

ఆధునిక క్రికెట్ అత్యుత్తమ బ్యాటర్ విరాట్ కోహ్లి. వన్డేలు, టెస్టులు సహా టీ20ల్లోనూ కోహ్లి గణాంకాలు అమోఘం. 35 ఏండ్ల విరాట్ కోహ్లి ఫిట్‌నెస్ స్థాయి సైతం వివాదరహితం. 113 టెస్టుల్లో 49.15 సగటుతో 8848 పరుగులు.. 292 వన్డేల్లో 58.67 సగటుతో 13848 పరుగులు చేశాడు. టీ20ల్లో సైతం 115 మ్యాచుల్లో 52.74 సగటుతో 4008 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లలో కోహ్లి అగ్రగణ్యుడు. 37 అర్థ సెంచరీలు, ఓ సెంచరీ ఇన్నింగ్స్ సైతం ఉన్నాయి. విరాట్ కోహ్లి స్ట్రయికరేట్ 137.96. ఈ ఫార్మాట్‌లో సగటు కంటే స్ట్రయికరేట్‌కు అధిక ప్రాధాన్యం ఉంటుంది. కోహ్లి ఇక్కడ కాస్త వెనుకంజ వేశాడు. గత టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో సంచలన ఇన్నింగ్స్ నమోదు చేసిన కోహ్లి.. అభిమానులు ఎప్పటికీ మరిచిపోలేని షాట్లు ఆడాడు. గత సీజన్ ఐపీఎల్‌లో కోహ్లి స్పిన్ ఆడటంలో ఇబ్బంది పడ్డాడు. ప్రత్యర్థి జట్లు కోహ్లి కోసం నాణ్యమైన స్పిన్నర్‌ను అట్టిపెట్టుకునేవి. స్పిన్‌పై 124 బంతులు ఆడిన కోహ్లి.. స్ట్రయికరేటు 110 మాత్రమే సాధించాడు. కేవలం 32 సార్లు మాత్రమే బౌండరీ కొట్టేందుకు ప్రయత్నించాడు. ఇక ఇదే అంశంలో సూర్యకుమార్ యాదవ్ స్పిన్‌పై 148 బంతులు ఎదుర్కొని 59 సార్లు బౌండరీ కోసం బ్యాట్ ఝులిపించాడు. ఐపీఎల్‌లో సగటును ప్రతి 3.43 బంతులకు ఓ బౌండరీ ప్రయత్నం చేస్తే.. విరాట్ కోహ్లి సగటు 3.88 బంతులు. భారత టీ20 జట్టులో విరాట్ నం.3 స్థానంలో బ్యాటింగ్‌కు వస్తే.. అతడి ప్రధాన పాత్ర మిడిల్ ఓవర్లలో పోషించాల్సి ఉంటుంది. ఆరంభంలో నెమ్మదిగా ఆడే కోహ్లి.. ఆ తర్వాత వేగం పుంజుకుంటాడు. కానీ ఈ ఫార్మాట్‌లో అది కుదరదు. కుదురుకోవటం, పుంజుకోవటం ఏకకాలంలో జరగాల్సిందే. పవర్‌ప్లే ముగిసిన అనంతరం బౌండరీలు రాబట్టడం అంత సులువు కాదు. మ్యాచ్ గతిని నిర్దేశించే దశ ఇదే. ఈ ఓవర్లలో రన్‌రేట్‌ను నిలుపుకుంటే సరిపోతుంది. కోహ్లి ఓపెనర్‌గా వచ్చినా.. ప్రత్యర్థులు స్పిన్‌తోనే పరీక్ష పెడతారు. కుర్ర జట్టులో కోహ్లి కోసం కఠిన సవాల్ ఎదురు చూస్తోంది.

> 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు రోహిత్ శర్మ నాయకత్వం వహించాలి. విరాట్ కోహ్లి సైతం మన జట్టులో కచ్చితంగా ఉండాలి. కోహ్లి అద్భుతమైన క్రికెటర్. 14 నెలల విరామం రోహిత్, కోహ్లిలపై ఎటువంటి ప్రభావం చూపించదు. టీ20 ప్రపంచకప్‌లో భారత్ గెలుపు గుర్రాలు రోహిత్, కోహ్లి'
>
> - సౌరవ్ గంగూలీ, మాజీ కెప్టెన్

రోహిత్‌కు పరీక్ష

భారత క్రికెట్‌లో ఎం.ఎస్ ధోని తర్వాత మేటి సారథిగా రోహిత్ శర్మ ప్రశంసలు అందుకున్నాడు. ఐపీఎల్‌లో ఐదు టైటిళ్లతో సత్తా చాటాడు. భారత క్రికెట్ పగ్గాలు కోహ్లి నుంచి రోహిత్‌కు అందటానికి సైతం ఐపీఎల్‌లో అతడు సాధించిన సక్సెసే కారణం. ఐపీఎల్ జట్టును, జాతీయ జట్టును నడిపించటం ఒకటి కాదని తెలిసేందుకు రోహిత్‌కు పెద్దగాస సమయం పట్టలేదు. నాకౌట్ మ్యాచుల్లో భారత జట్టు ఒత్తిడిని తట్టుకుని నిలబడటం కష్టంగా మారింది. రోహిత్ శర్మ ఈ అంశంలో మార్పు తీసుకు రావటంలో విఫలమయ్యాడు. కెప్టెన్‌గా ఐసీసీ టైటిల్ అందుకోవాలనే తపిస్తున్న రోహిత్ శర్మ.. 2024 టీ20 ప్రపంచకప్‌ను చక్కటి అవకాశంగా చూస్తున్నాడు. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ కెప్టెన్సీ హార్దిక్ పాండ్యకు కోల్పోయిన రోహిత్.. భారత టీ20 జట్టు పగ్గాలను హార్దిక్ నుంచి తీసుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు. బ్యాటింగ్ లైనప్‌లో రోహిత్ శర్మ స్థానం



ఓపెనింగ్. ఇటీవల వన్డే వరల్డ్‌కప్‌లో రోహిత్ శర్మ విశ్వరూపం చూపించాడు. సెహ్వాగ్ తరహాలో పవర్‌ప్లేలో ప్రత్యర్థులను ఊచకోత కోశాడు. భారత్‌కు అది బాగా కలిసొచ్చింది. టీ20ల్లో సైతం పవర్‌ప్లేలో విధ్వంస రచన రోహిత్‌కు పెద్ద విషయం కాదు. బ్యాటర్‌గా భీకర ఫామ్ అందుకునేందుకు రోహిత్ ఎదురుచూస్తున్నాడు. కానీ నాయకుడిగా రోహిత్ శర్మ కఠిన పరీక్ష ఎదుర్కొంటున్నాడు. విరాట్ కోహ్లికి తుది జట్టులో చోటు కల్పించే అంశం నుంచే రోహిత్ కెప్టెన్సీ కష్టాలు షురూ అవుతాయని చెప్పవచ్చు. 148 టీ20ల్లో రోహిత్ శర్మ 31.32 సగటుతో 3853 పరుగులు చేశాడు. స్ట్రయికరేట్ 139.24. పొట్టి ఫార్మాట్‌లో రోహిత్ 4 సెంచరీలు, 29 అర్థ సెంచరీలు సాధించాడు. వన్డేల్లో 262 మ్యాచుల్లో 49.12 సగటుతో 10709 పరుగులు చేశాడు.

కుర్రాళ్లకు కష్టమే!

యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ సహా రింకూ సింగ్‌లు రానున్న 2024 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు కీలకం అవుతారని ఇప్పటివరకు ఓ అంచనా. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ రాకతో అసలు తుది జట్టులో ఈ కుర్రాళ్లకు చోటు దక్కటమే ప్రశ్నగా మిగిలి పోనుంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్‌లలో ఒకరు రోహిత్ శర్మ కోసం స్థానం వదులుకోవాలి. నం.3 బ్యాటింగ్ స్థానం రేసులో శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మలు విరాట్ కోహ్లి కోసం బెంచ్‌కు పరిమితం కావాల్సిందే. రోహిత్, కోహ్లిలతో కూడిన తుది జట్టులో సమతూకం కోసం ఏకంగా రింకూ సింగ్‌ను సైతం పక్కన పెట్టే ప్రమాదం లేకపోలేదు. మేటి బ్యాటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు ఏ సవాల్‌నైనా ఎదుర్కొని నిలబడగలరు. టీ20 జట్టులో చోటే చర్చకు దారితీసి నప్పుడు.. అందుకు తగినట్టుగా ధనాధన్ విధ్వంసం వ్యూహాలు చేయాలనే సంగతి బాగా తెలుసు. అయితే, ఇద్దరు సీనియర్ క్రికెటర్ల ప్రపంచకప్ కల కోసం..భీకర ఫామ్‌లో ఉరకేస్తున్న కుర్రాళ్లను పక్కనపెట్టడం భారత్ క్రికెట్‌కు మేలు చేస్తుందా? అనేది కాలమే సమాధానం చెప్పాలి.

పసిడితో పారిస్‌కు..

- ఇషా సింగ్, వరుణ్ ఒలింపిక్స్‌కు అర్హత



జకర్తా (ఇండోనేషియా) : భారత యువ షూటర్, తెలంగాణ స్టార్ ఇషా సింగ్ గన్‌తో మళ్లీ అదరగొట్టింది. జకర్తాలో జరుగుతున్న ఒలింపిక్స్ 2024 ఆసియా క్వాలిఫయర్స్‌లో పసిడి గురితో మెరిసింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఇషా సింగ్ పసిడి పతకం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఫైనల్లో ఇషా సింగ్ 243.1 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచింది. పాక్ షూటర్ తలట్ 236.3 స్కోరుతో సిల్వర్ మెడల్ దక్కించుకుంది. భారత మరో షూటర్ రిథమ్ సంగ్వాన్ మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించగా, సురభి రావు ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. జూనియర్ వరల్డ్ చాంపియన్, వరుణ్ తోమర్ మెన్స్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో సత్తా చాటాడు. ఫైనల్లో 239.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకంతో పాటు పారిస్ ఒలింపిక్ బెర్త్ దక్కించుకున్నాడు. అర్జున్ చీమ 237.3 పాయింట్లతో సిల్వర్ సాధించగా, మంగోలియా షూటర్ 217.2తో కాంస్యం అందుకున్నాడు. ఓవరాల్‌గా భారత షూటర్లు ఇప్పటివరకు 15 ఒలింపిక్ బెర్తులు సాధించారు. ఆసియా క్వాలిఫయర్స్‌లో 16 ఒలింపిక్ బెర్తులు అందుబాటులో ఉండగా.. భారత్ పోటీల తొలి రోజే రెండు ఒలింపిక్ బెర్తులు సొంతం చేసుకుంది.

జర్మనీలో శస్త్రచికిత్స!


- ఐపీఎల్‌కు సూర్య దూరం?



ముంబయి : భారత క్రికెట్ గాయాల బారిన పడుతోంది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య గాయంతో ఇప్పటికే జట్టుకు దూరమవగా.. తాజాగా ఆ జాబితాలోకి టీ20 సూపర్‌స్టార్ సూర్యకుమార్ యాదవ్ చేరాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో సూర్యకుమార్ యాదవ్ చీలమండ గాయానికి గురయ్యాడు. దీంతో స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో సిరీస్‌కు దూరమయ్యాడు. త్వరలోనే సూర్యకుమార్ జర్మనీలో శస్త్రచికిత్సకు వెళ్లనున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. 8-10 వారాలు విశ్రాంతి అవసరమని, ఐపీఎల్ ఆరంభ దశకు దూరమవుతాడని సమాచారం. 'సూర్యకుమార్ స్పోర్ట్స్ హెర్నియాతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం ఎన్‌సీఏలో చికిత్స పొందుతున్నాడు. రెండు మూడు రోజుల్లో జర్మనీలో మ్యూనిచ్‌కు బయల్దేరతాడు. అక్కడే సూర్యకు శస్త్రచికిత్స చేయనున్నారు. 8-10 వారాల్లో కోలుకునే అవకాశం ఉంది. ఐపీఎల్ ఆరంభ దశకు అందుబాటులో ఉండడు' బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు.

నవచిత్రం

అందుకే ఎర్ర సముద్రం అంటారు..



ఎన్టీఆర్

ఎన్టీఆర్ లేటెస్ట్ భారీ చిత్రం 'దేవర'. బాలీవుడ్ నాయిక జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మరో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ కీలక పాత్రలో అలరించబోతున్నారు. డైరెక్టర్ కొరటాల శివ ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. అందులో తొలి భాగం 'దేవర పార్ట్ 1' ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 5న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ రిలీజ్ అవుతోంది.
మేకర్స్ సోమవారం ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో ఈ సినిమా రూపొందుతోందని గ్లింప్స్ చూస్తే తెలుస్తోంది. సముద్రం, ఓడలతో పాటు రక్తంతో నిండిన ప్రపంచాన్ని పరిచయం చేశారు. ఇంతకు ముందెన్నడూ చూడని మాస్ అవతార్‌లో 'దేవర'గా ఎన్టీఆర్ నటన, లుక్ అదుర్స్ అనేలా ఉన్నాయి. గ్లింప్స్‌లోని ప్రతీ ఫ్రేమ్ చూస్తుంటే కొరటాల శివ సృష్టించిన సరికొత్త భారీ ప్రపంచం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. రక్తంతో తడిసిన ఆయుధాన్ని ఎన్టీఆర్ శుభ్రం చేస్తూ, 'ఈ సముద్రం చేపల కంటే రక్తాన్నే ఎక్కువగా చూసింది అందుకనే దీన్ని ఎర్ర సముద్రం అంటారు' అంటూ తన పవర్‌ఫుల్ వాయిస్‌తో హైలెట్‌గా నిలిచింది. అనిరుద్ రవిచందర్ సంగీతం సినిమాను నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళుతుంది. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ ప్రొడక్షన్ బ్యానర్స్ అంచనాలను మించేలా ఎక్కడా తగ్గకుండా అన్‌కాంప్రమైజ్డ్‌గా సినిమాను రూపొందిస్తున్నాయి. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

పక్కా కమర్షియల్ సినిమా



మహేష్‌బాబు

మహేష్ బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో 'అతడు', 'ఖలేజా' వంటి కల్ట్ క్లాసిక్స్ తర్వాత వస్తున్న చిత్రం 'గుంటూరు కారం'. హారిక హాసిని క్రియేషన్స్ పతాకంపై అన్ని రకాల కమర్షియల్ వ్యాల్యూస్‌తో ఈ చిత్రాన్ని నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చిన్నబాబు) నిర్మిస్తున్నారు. లేటెస్ట్‌గా చిత్రబృందం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇందులో మహేష్ బాబు డైలాగ్స్, ఆయన యాటిట్యూడ్, ఆయన ఎనర్జీ అన్నీ కూడా ఇటీవలి కాలంలో ఆయన చేసిన చిత్రాలకు భిన్నంగా సరికొత్తగా ఉన్నాయి.
సంక్రాంతికి విడుదల కానున్నందున, థియేటర్లలో పండుగ సినిమా కోసం ప్రేక్షకులు ఎదురుచూసే అన్ని అంశాలను మేకర్స్ జోడించినట్లు తెలుస్తోంది. ఈ ట్రైలర్ ఖచ్చితంగా సినిమా బ్లాక్ బస్టర్ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందనే నమ్మకాన్ని కలిగిస్తోంది. శ్రీలీల మీనాక్షి చౌదరి నాయికలుగా నటించి ఈ చిత్రానికి తమన్ సంగీతం అందించారు. సంక్రాంతి బరిలోకి దిగుతూ ఈనెల 12న ఈ సినిమా విడుదల కానుంది.



హను-మాన్ సూపర్ హిట్ ఖాయం : చిరంజీవి

దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'హను-మాన్'. తేజ సజ్జ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె నిరంజన్ రెడ్డి నిర్మించారు. శ్రీమతి చైతన్య సమర్పిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఈనెల 12న ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం మెగా ప్రీ రిలీజ్ ఉత్సవ్‌ని నిర్వహించింది.
ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన చిరంజీవి మాట్లాడుతూ,'ఈ వేడుకకు నేను రావడానికి దోహద పడినవి నాలుగు కారణాలు. హనుమాన్ నా ఆరాధ్య దైవం, మా ఇలవేల్పు. ఆ స్వామి గురించి తెలిపే కథ ఈ సినిమా. డైపర్లు వేసుకునే స్థాయి నుంచి డయాస్‌లు ఎక్కే స్టేజికి అంచలంచెలుగా ఎదుగుతున్న తేజ సజ్జ ఒక కారణం. ఈ చిత్ర ట్రైలర్, టీజర్‌లో చాలా అద్భుతమైన ఫైన్‌నెస్ కనిపించింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ గురించి తెలుసుకున్న తర్వాత ఖచ్చితంగా ఇది గొప్ప సినిమా అవుతుందని అనిపించింది. నిర్మాత నిరంజన్ రెడ్డికి హృదయపూర్వక అభినందనలు. ఈ వేదిక నుంచి ఒక మంచి ప్రకటన నేను చేస్తే బావుటుందని దర్శక నిర్మాతలు చెప్పారు. అయోధ్య రామమందిర నిర్మాణం చరిత్రలో నిలిచిపోయే ఘట్టం. ఈ సమయంలో ఈ చిత్రం రావడం ఒక శుభపరిణామం. హను మాన్ చిత్రం ఆడినన్ని రోజులు వచ్చే కలెక్షన్స్‌లో ప్రతి టికెట్ పై రూ.5 అయోధ్య రామమందిరానికి ఇవ్వాలని హనుమాన్ చిత్ర బృందం నిర్ణయం తీసుకుంది. ఇది చాలా గొప్ప నిర్ణయం' అని తెలిపారు.
దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జా, హీరోయిన్ అమృత అయ్యర్, నిర్మాత కె నిరంజన్ రెడ్డి, వరలక్ష్మీ శరత్ కుమార్, డైరెక్టర్ కేవీ అనుదీప్, బివిఎస్ రవి తదితరులు ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

కుటుంబంలోని ప్రతి ఒక్కరూ చూసేలా సైంధవ్




వెంకటేష్ నటించిన తన 75వ చిత్రం 'సైంధవ్'. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మించారు. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈనెల 13న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లో నిర్వహించిన 'సైంధవ్' ప్రీ రిలీజ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది.
వెంకటేష్ మాట్లాడుతూ, 'నా తొలి సినిమా నుంచీ వైజాగ్‌తో అనుబంధం ఉంది. కలియుగ పాండవులు, సుందరకాండ, మల్లీశ్వరి. సీతమ్మ వాకిట్లో, గోపాలగోపాల ఇలా చాలా చిత్రాలు ఇక్కడ చిత్రీకరణ జరుపుకున్నాయి. 'సైంధవ్' చిత్రీకరణ కూడా చాలా రోజులు ఇక్కడే చేశాం. అభిమానులు, ప్రేక్షకులు నాపై చూపించిన ప్రేమకు ధన్యవాదాలు. కుటుంబంలోని ప్రతి ఒక్కరూ చూసేలా నా 75వ చిత్రంగా న్యూ ఏజ్ యాక్షన్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'సైంధవ్'ని తీశాం. దర్శకుడు శైలేష్ అద్భుతంగా ప్రజంట్ చేశారు. మీకు నచ్చే యాక్షన్ చాలా కొత్తగా చేశాను. ఇది పండగ రోజు వస్తుంది. పండగే పండగ అన్నట్టుగా ఉంటుంది' అని తెలిపారు.
దర్శకుడు శైలేష్ కొలను, నవాజుద్దీన్ సిద్దిఖీ, శ్రద్ధా శ్రీనాథ్, రుహాని శర్మ, నిర్మాత వెంకట్ బోయినపల్లి, రామజోగయ్య శాస్త్రి తదితరులు ఈ చిత్రంలోని విశేషాలను తెలియజేశారు.

పోరాటాల చిత్రీకరణలో
పోలీసు వారి హెచ్చరిక



బాబ్జీ దర్శకత్వంలో తూలికా తనిష్క క్రియేషన్స్ పతాకంపై బెల్లి జనార్థన్ నిర్మిస్తున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. ఈ చిత్రం ప్రస్తుతం పోరాట సన్నివేశాల చిత్రీకరణ జరుపుకుంటోంది.
'రవి కాలె, అజయ్ ఘోష్, సంజయ్ నాయర్, అఖిల్ సన్నీలతో పాటు హీరో, హీరోయిన్‌ల బృందం పై టాలీవుడ్ స్టూడియో, చిత్రమందిర్ స్టూడియో, చందానగర్, బీరంగూడా, ఘణ పూర్, షామీర్ పేట్‌ల్లో భారీగా వేసిన సెట్స్‌లో ఫైట్ మాస్టర్ 'సింధూరం' సతీష్ నేతృత్వంలో పోరాట సన్నివేశాలను చిత్రీకరించాం. అక్టోబర్ 23న ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్‌ని సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేస్తున్నాం. ఇప్పటివరకు జరిగిన షూటింగ్‌తో 80 శాతం టాకీ పార్ట్‌తో పాటు పోరాట సన్నివేశాల చిత్రీకరణ పూర్తి అయ్యింది. జనవరి నెలాఖరు నాటికి మిగతా సన్నివేశాలతో పాటు పాటల చిత్రీకరణను కూడా పూర్తి చేస్తాం' అని దర్శకుడు బాబ్జీ తెలిపారు. నిర్మాత బెల్లి జనార్ధన్ మాట్లాడుతూ, 'క్రమశిక్షణతో ఉన్న ఈ రంగంలో పొందిన స్ఫూర్తితో భవిష్యత్‌లో కూడా సినిమాల నిర్మాణాన్ని ఇలాగే కొనసాగిస్తాను' అని అన్నారు.

మరో ప్రెసిడెంట్‌గారి పెళ్ళాం..



ఎం.ఎం.కీరవాణి

నాగార్జున నటించిన తాజా చిత్రం 'నా సామిరంగ'. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాస చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మించారు. సంక్రాంతి కానుకగా ఈనెల 14న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది.
ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సంగీతం సమకూర్చిన ఎంఎం కీరవాణి మీడియాతో మాట్లాడుతూ, 'నాగార్జునతో ప్రెసిడెంట్ గారి పెళ్ళాం, అల్లరి అల్లుడు నుంచి అన్నమ్మయ్య.. శ్రీరామ దాసు ఇలా అన్ని వైవిధ్యమైన చిత్రాలు చేశాను. మా కాంబినేషన్ ఎప్పుడూ విజయం సాధిస్తూ వచ్చింది. ప్రెసిడెంట్ గారి పెళ్ళాం ఎంతటి ఘన విజయం సాధించిందో ఈ సినిమా కూడా అలాంటి విజయం అందుకుంటుంది. ఇది మరో ప్రెసిడెంటు గారి పెళ్ళాం అవుతుందని ఆశిస్తున్నాను. సంక్రాంతి పండగ కళ ఉట్టిపడేలా ఈ చిత్రాన్ని దర్శకుడు విజయ్ బిన్నీ రూపొందించారు. చంద్రబోస్ రాసిన పాటలు, నేను చేసిన సంగీతం రెండూ ఫ్రెష్‌గా ఉంటాయి' అని చెప్పారు.

రిపబ్లిక్ డే కానుకగా ఫైటర్ రిలీజ్



హృతిక్ రోషన్

హృతిక్ రోషన్, దీపికా పదుకొనె ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఫైటర్'. 'వార్, పఠాన్' సినిమాల ఫేమ్ సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం రిపబ్లిక్ డే కానుకగా ఈనెల25న ప్రేక్షకుల ముందుకు రానుంది.
ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన టీజర్‌తో పాటు ఫస్ట్ సింగిల్, సెకండ్ సాంగ్‌కు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి 'హీర్ ఆస్మాని' సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సాంగ్‌లో హృతిక్ రోషన్, దీపికా పదుకొనె డాన్స్ మూమెంట్స్‌కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. అనిల్ కపూర్, అక్షయ్ ఒబెరాయ్, సంజీదా షేక్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను వయాకామ్ 18 స్టూడియోస్, మార్ ఫ్లిక్స్ పిక్చర్స్ సంస్థలపై మమతా ఆనంద్, రామన్ చిబ్, అంకు పాండే నిర్మిస్తున్నారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.